# మూసీ

# MUSI


◆ Samputi : 25 ◆ Sanchika : 08 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ June 2022

UGC Care List
Approved Journal


మూసీ 25 వసంతాలు

- కవిత్వానువాద సాధ్యాసాధ్యాలు
- చరిత్రగా మారనున్న ప్రాచ్య కళాశాలల ఘనమైన గతం
- పాంచభౌతిక శక్తి 'శాక్తేయం'
- భాషావేత్తల స్రష్ట ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మ
- తెలంగాణ దేవాలయాలు - పుట్టుపూర్వోత్తరాలు : విభజన
- సంతూర్ పండిత్ శివకుమార్ శర్మకు అశ్రునివాళి
- సామెతలు - శాస్త్రాంశాలు
- వలస రాయలసీమలో మహిళాచైతన్యం





వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 25 సంచిక : 8
జూన్ - 2022
'శుభకృత్' జ్యేష్ఠ మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
SAGI KAMALAKARA SHARMA

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. Anantha Laxmi

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL
ज्ञान-विज्ञान विमुक्तये



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

కవిత్వానువాద సాధ్యాసాధ్యాలు ... డా. బాణాల భుజంగ రెడ్డి 7
చరిత్రగా మారనున్న ప్రాచ్య కళాశాలల ఘనమైన గతం ... సుభ్యా 11
శానతనం (బందారం కథలు - 7) ... డా. నందిని సిధారెడ్డి 13
పాంచభౌతిక శక్తి 'శాక్తేయం' ... డా. సాగి కమలాకర శర్మ 17
పద్య మనోహరం - 31 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 20
భారతీయీకరణ : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 21
కలోనియల్ ఆలోచనాసరళికి అతీతంగా ... రోచిష్మాన్ 27
భాషావేత్తల స్రష్ట ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మ... డా. కాచాపురం దుర్గాదేవి 29
తెలంగాణ దేవాలయాలు - పుట్టుపూర్వోత్తరాలు : విభజన - ఆర్. నరహరి 31
తంజావురాంధ్రనాయక చరిత్రము (గ్రంథాంతరంగం-13) ... ఘట్టమరాజు 35
సంతూర్ పండిత్ శివకుమార్ శర్మకు అశ్రునివాళి ... సామల రాజవర్ధన్ 38
సామెతలు - శాస్త్రాంశాలు ... డా. అట్టెం దత్తయ్య 41
జ్ఞానవాహిని శ్రీ యాదగిరి నరహరి శతకం... డా. మంత్రి శ్రీనివాస్ 48
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 24 ... టి. లక్ష్మీనారాయణ 53

### కవితలు

నవ్యతెలంగాణ ... సుప్పని సత్యనారాయణ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; తానే అంతా ... అరుణ ధూళిపాళ - 6; సుదూర పయనం - డా. జి. వెంకట లక్ష్మి - 26; మాతకు సాష్టాంగ ప్రణామమ్ ... అవుసుల భానుప్రకాశ్ - 34; నేటి స్థితి ... డా. వొజ్జల శరత్ బాబు -37; నారోజు ... పెద్దపల్లి తేజస్వి - 48; తెలంగాణ తల్లి ... డా. బి. నీలిమా కృష్ణమూర్తి - 52; నిరుద్యోగుల స్వప్నం ... వెంకటేశ్ కె విశ్వ - 62.

### సమీక్షలు

ఉద్యమ ప్రస్థానాన్ని పలికించిన బ్లూస్కార్ఫ్ నవల ... ఇమ్మిడి మహేందర్ 44
సజీవ చిత్రాలలోని 'నేను' ... బి. రమేశ్ 47
వలస రాయలసీమలో మహిళాచైతన్యం ... శివప్రియ 56
వ్యాసభారతి ముక్తేవి భారతి ... ఆచార్య వెలుదండ నిత్యానందరావు 58
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office* : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor* : **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





## విశేషం

శేషం అనగానే మనకు గణితం గుర్తుకు వస్తుంది. శేషం అంటే మిగిలేది అని అర్థం. ఒక సంఖ్య గాని, పదార్థం నుండి గాని, శక్తి నుండి కొంత తీస్తే మిగిలిన దానిని 'శేషం' అంటాం. ఈ సృష్టికి సంబంధించిన అంశాల్లో అన్ని పదార్థాలను తీసేస్తే మిగిలేది కేవలం శక్తి మాత్రమే. అదే శేషిస్తుంది. దానినే శేషం అంటాం. ఎప్పటికీ మిగిలే శక్తికే శేషమని పేరు. శక్తికి స్వరూపంగా ఈ లోకంలో పెద్ద సర్పాన్ని చూపించడం సంప్రదాయం. ఈ సర్పానికే 'శేషుడు' అని పేరు. ఈ శేషం సృష్టియొక్క ఆదిలోనూ ఉంటుంది. సృష్టి అంత్యంలోనూ ఉంటుంది. అందుకే ఈ శక్తికంతకూ 'ఆదిశేషుడు' అని పేరు. ఈ భూమి చుట్టూ సంచరించే విద్యుదయస్కాంత తరంగ శక్తి కూడా సర్పిలాకృతిలోనే ఉంటుంది. అదే కుమారస్వామిగా, సుబ్రహ్మణ్యంగా, సర్ప సంబంధంగానే దర్శించడం భారతీయ సంప్రదాయం. భూమి చుట్టూ ఉండే శక్తి చిన్నదిగా, సృష్టిమొత్తంలోనూ ఉన్న శక్తి పెద్దదిగా భావించడం వల్లనే చిన్న శేష వాహనం, పెద్ద శేష వాహనం అనే రెండు వాహనాలు మనకు కనిపిస్తున్నాయి.

శక్తి విశిష్టమైతే అది విశేషం అవుతుంది. నిత్యజీవితంలో ఈ పదాన్ని మనం అధికంగా వినియోగించినా ఈ శబ్దార్థం ప్రత్యేకంగానే ఉంటుంది. వ్యక్తి ఈ లోకంలో పుట్టి పెరిగి మరణించడానికి ఎంతో శక్తి అవసరం అవుతుంది. కాని వ్యక్తి ఈ లోకం నుండి వెళ్ళిపోయే సందర్భంలో ఏమీ తీసుకొని పోలేదు, ఏమీ మిగుల్చుకొని కూడా పోలేదు. కొందరు మాత్రమే కృషి అధికంగా చేసి, శక్తియొక్క సహకారంతో వారు పోయిన తర్వాత కీర్తి ప్రతిష్ఠలను మిగుల్చుకొని పోతారు. లోకంచేత, ప్రకృతి చేత గుర్తింపులను పొందుతారు. వారిదే 'విశేష'మైన జీవితం. కీర్తి శేషించబడిన జీవితం. వారు మృత్యువును అధిగమించినవారే. అమృత మయులే.

శక్తి చుట్టూ ప్రదక్షిణం చేస్తూ ఉండేవారే విశేషమవుతారు. బలహీనతలు, బాధలు, ఒత్తిడులు, చికాకులు, సామాజిక సమస్యల చుట్టూ సంచరించేవారు ఈ లోకంలో అన్నీ వినియోగించుకొని బాధపడుతూ మళ్ళీ మళ్ళీ జన్మల కోసం మరణిస్తూ ఉంటారు. భూమి కూడా తాను శక్తిని సంపాదించుకొని తన సంతానాన్ని కాపాడుకోవడం కోసం నిరంతరం సూర్యుని చుట్టూ సంచరిస్తూ ఉంటుంది. దేవాలయాల్లో ప్రదక్షిణ విధానాన్ని తెలియజేసింది మనకు భూమి మాత్రమే. శక్తి చుట్టూ నిరంతర సంచారం వల్ల తాము శక్తివంతులవుతారు. శక్తివంతులైన వారు లోక ధర్మాలను, కర్మలను తక్కువ సమయంలో ఎక్కువగా నిర్వహించుకోగలుగుతారు. చాలా మందికి కర్మలు శేషిస్తాయి. కొద్దిమందికే శక్తి శేషిస్తుంది. వారే ఈ లోకానికి వినియోగపడే దైవ స్వరూపాలు. వారే విశేష జీవులు. వారి ప్రభావమే తరువాతి తరాలపై అధికంగా ఉంటుంది. వారి సంకల్పాలే లోకవినియోగం అవుతుంటాయి.

భారతీయమైన పదజాలమంతా ప్రత్యేకార్థాలతో కూడుకున్నదే. విశదంగా గమనిస్తే తప్ప ఈ ప్రకృతికి మూలాలు అర్థం కావు. శబ్దం ఆకాశ తత్త్వానికి సంబంధించినది కావడం వల్ల మన వినియోగ పదాలలో తెలియకుండా ఈ సృష్టి విశేషాలు అధికంగా వస్తుంటాయి. జీవితం మొత్తం శక్తితో మాత్రమే కలిసి ఉండి కర్మలన్నీ నిశ్శేషం చేసుకున్నవాడే విశేషజీవి. కర్మలు శేషమైన వాడు మరల జన్మించాలి కాబట్టి విశేషాలు ఏమీ ఉండవు. శేషం లేకుండా ఉండటం, విశిష్టమైనదే శేషంగా ఉండటం అనే అంశాలను దృష్టిలో పెట్టుకొని వ్యక్తి జీవనం కొనసాగించాలి.

# నవ్య తెలంగాణ




ఏళ్ళ తరబడి నైజాము కెదురు నిలిచి
నీచ కృత్యాల దెగటార్చి నిగ్గు దేల్చి
ఆధిపత్యపు పీఠాల నదరజేసి
కడకు తెలగాణ తల్లియే కదలివచ్చె !

పండితులు, శాస్త్ర కోవిదుల్, పరమ ఋషులు
సరస సాహిత్య సద్గ్రంథ సౌరభములు
జానపద శోభలలరారి జగతి మురియ
విరియ జేసినదీ నేల వేడ్క మీర !




పాడి పంటల యందాలు పరిఢవిల్ల
పచ్చపచ్చని వనశోభ పరవశింప
సుజల సంపద సతతము సొంపుమీర
నవ్య తెలగాణ మీ తీరు నడువసాగె !

మేటి పథకాలవెన్నియో మేలు జేయు
పేద కడు బీద వర్గాల పెన్నిధవుచు
యాతనల గాంచి నిరతము ఖ్యాతినొంద
పాలన నొసంగుచుండె నీ ప్రభుత నేడు !




ఇట్టి చరితకు నెలవైన ధరిత్రి
తరతరాలీ యశస్సును దలచునటుల
యువత కాదర్శమయ్యెడు భవితనొసగి
ప్రగతి బాటలో నడుచుటే పరమసుఖము!



సుప్పని సత్యనారాయణ
బాన్సువాడ, ఫోన్ : 9492626910

# తానే అంతా...!



మరణం!!
తప్పని నొసటి శాసనం...
ఏ ప్రాణీ కోరని వరం...
చాపకింద నీరులా తగిలి
అకస్మాత్తుగా గుండెను చేరి
దేహమంతా చుట్టుకుంటుంది....

వెలసిపోతాయి...
మనిషి గీసుకున్న రేపటి చిత్రాలన్నీ...
విడివడిన ప్రాణం ఖరీదు శూన్యం
దానిపై పెంచుకున్న మమకారం అనంతం
వేల జ్ఞాపకాలు తనతోనే
విలువ కూడా....



అన్నింటినీ వదిలి
రివ్వున ఎగిరిపోతుంది గువ్వలా
అట్టిపెట్టుకున్న దేహపు భ్రాంతి
బిగుసుకుపోతుంది కట్టెలా
మిగిలిపోతుంది గతంలా



నేనన్న అబద్ధం చెత్తలా
నలుగురితో మోయబడి
అనేక కనుగవల సాక్షిగా
బూడిదగా రాలుతుంది
ఎప్పటిలాగే
తనవంతు మరో పాత్ర
తన ప్రమేయం లేకుండానే
ముగిసిపోతుంది
జగన్నాటకంలో
విధి ఆడించిన విచిత్రంలో....!!



**అరుణ ధూళిపాళ**
వలిగొండ, ఫోన్ : 8712342323

# తుకారాం అభంగం

ఇవ్వవే ఆర్తులకు రొట్టెని
జ్ఞానమనే సద్ది పెరుగు బువ్వని
కడుపు నిండ పంచి ప్రభు
యదను చల్లబరుచు విభు

ఆకలున్న తీరు పంచుము
అలుముకున్న దుమ్ము దులుపుము
చరణదాస జనుల చేరి
నీ దివ్య స్నేహము పంచుము

అంతరాన్ని పరికించుము
ఆత్మశుద్ధి గావించుము
మమ్ముదోచి తలుపు తెరిచి
మహిమ నావ నెక్కించుము

తుకా పలికె ఓ హరి
లేరు సాటి లేరు నీకు
దూరాల నుంచక మమ్ము
నీ దరికి చేర్చవయ్యా




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 (7) హైదరాబాద్ జూన్ : 2022

# కవిత్వానువాద సాధ్యాసాధ్యాలు

**డా. బాణాల భుజంగ రెడ్డి,** సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం. ఫోన్ : 7217872141

### 1.1. కవిత్వం – సంస్కృతి

ప్రాచీన కవిత్వమైనా, ఆధునిక కవిత్వమైనా సాంస్కృతికాంశాలతో నిండి ఉంటుంది. కవిత్వంలో మన సంప్రదాయాలో, ఆచారాలో, అలవాట్లో, ఆభరణాలో, దుస్తులో, ఇతిహాసాలో, పురాణాలో, మిథ్యాగాథలో, వీరగాథలో, జాతీయాలో, సామెతలో ఇతర సాహిత్య ప్రక్రియల్లో కంటే ఎక్కువగా ఉంటాయి. ఈ సాంస్కృతికాంశాల ఆధారంగానే ఆయా భాషల్లో పదాలూ, నుడికారాలూ, సామెతలూ ఏర్పడతాయి. వాటి అర్థాలూ, అర్థచ్ఛాయలూ నిర్ణయమవుతాయి. కవి సమయాలూ, కల్పనలూ రూపొందుతాయి. గంజి – గట్క తెలుగు భాషలో ఉంటే, సూప్ – సాస్ ఇంగ్లీషు భాషలో ఉంటాయి. బెల్లంతో పానకం చేసుకొని తాగే అలవాటున్న హిందువుల భాషల్లో 'పానకంలో పుడక' అనే నుడికారం ఉంటే, మాంసం ముక్కలను కట్టెపుల్లలకు కుచ్చి కాల్చుకుని తినే అలవాటున్న ముస్లింల భాషల్లో 'కబాబ్ మే హడ్డీ' అనే నుడికారం ఉంటుంది. అమ్మాయి అందమైన కళ్ళను చేపలతో పోల్చే సంప్రదాయం తెలుగు కవుల్లో ఉంటే, ఒంటె కళ్ళతో పోల్చే సంప్రదాయం కజకిస్తాన్ కవుల్లో ఉంటుంది. అయితే ఏ రెండు భాషా సమాజాల్లోనూ ఈ సాంస్కృతికాంశాలు సమానంగా ఉండకపోవచ్చు. కాబట్టి భిన్నభిన్న సంస్కృతులను ప్రతిఫలించే కవిత్వాన్ని ఒక భాషనుంచి మరో భాషలోకి అనువదించడంలో ఎన్నో భాషా సమస్యలూ, సాంస్కృతిక సమస్యలూ ఎదురవుతాయి. అందుకే కొందరు భాషావేత్తలూ, తత్త్వవేత్తలూ, సాహితీవేత్తలూ కవిత్వ అనువాదం అసాధ్యం అన్నారు.

### 1.2. కవిత్వానువాద సాధ్యాసాధ్యాలు

జాన్సన్ అనే పండితుడు **"కవిత్వం అనువదించబడదు"** (నిర్మల్ 1973:65లో ఉట్టంకితం) అన్నాడు. డాంటే అనే (44) కవి "కవిత్వం అనువదించదగింది కాదు" (Kumar 1994:241లో ఉట్టంకితం) అన్నాడు. **'సంగీతం లాగే కవిత్వం కూడా అనువాదనీయం కాదు"** (Kumar 1994:18) అన్నాడు వోల్టేర్. విక్టర్ హ్యూగో అనే రచయిత **"కవిత్వానువాదం వివేక శూన్యమూ, అసాధ్యము"** (నర్వణే 1994:12లో ఉట్టంకితం) అన్నాడు. రాబర్ట్ క్రోషే అనే తత్త్వవేత్త **"కవిత్వాన్ని అనువదించడం ప్రాక్టికల్‌గా సాధ్యమే. కానీ, తర్కరీత్యా అసాధ్యం"** (Rangasamy 1994:282) అన్నాడు. రోమన్ జాకబ్సన్ అనే భాషాశాస్త్రవేత్త **"కవిత్వం అనువదించదగింది కాదు. అనుసృజన మాత్రమే సాధ్యం"** (Jokobson 1959:239) అన్నాడు. ఇంతమంది కవులూ, రచయితలూ, తత్త్వవేత్తలూ, భాషావేత్తలూ కవిత్వాన్ని అనువదించడం అసాధ్యం అని అభిప్రాయపడినప్పటికీ, కవిత్వం పుట్టినప్పటి నుంచి నేటివరకూ కవిత్వాన్ని చాలామంది అనేక భాషల్లో అనువదిస్తూనే ఉన్నారు. ఎన్నో అనువాదాలు మంచి అనువాదాలుగా పేరు పొందాయి కూడా. దీన్ని బట్టి కవిత్వానువాదం అసాధ్యం అనడానికి ఎంత అవకాశం ఉందో, సాధ్యమే అనడానికి కూడా అంతే అవకాశం ఉందని తెలుస్తోంది.

### 1.3. కవిత్వానువాదం తీరుతెన్నులు

**"కవిత్వం అనేది ఎక్కువ భాగం పరిమళం, సుగంధం. అనువాదంలో ముందుగా అది అదృశ్యమవుతుంది"** (చక్రవర్తి 1992:138లో ఉట్టంకితం) అంటాడు Robert Frost. కవిత్వ రూపసౌందర్యాన్ని మరో భాషలోకి అనువదించలేం. ఒకవేళ అనువదిస్తే చప్పగా ఉంటుంది. పండ్లనుండి రసాన్నీ, పూలనుండి సారాన్నీ పిండి వేరే పాత్రలో పోసినప్పుడు ఆ పాత్రలోకి (పండ్ల) రసం, (పూల) సారం మాత్రమే వస్తాయిగాని, సహజంగా ఆ పండ్లలో, పూలలో ఉండే సౌందర్యం రాదు. అలాగే కవిత్వాన్ని ఒక భాషనుండి మరొక భాషలోకి అనువదించినపుడు అనువాదంలోకి మూల భాషా పాఠంలోని సారం మాత్రమే వస్తుంది గానీ, మూల భాషా కవిత్వంలోని సౌందర్యం రాదు (Raja gopalachari 1994:3) అని రాజగోపాలాచారి అంటారు. అలెగ్జాండర్ పోప్ The fire of the poem is what the translator should principally regard, as it is most likely to expire in his managing (Nida 1964:18) అంటారు. Sir John Denham అనే ఆయన **"కవిత్వం స్పిరిట్ లాంటిది, దాన్ని ఒక భాషలో నుంచి మరో భాషలోకి ఒంపుతుంటే అది ఆవిరైపోతుంది. కాబట్టి దాంట్లో (అనువాదంలో) కొంత కొత్త స్పిరిట్ కలపాలి. లేకుంటే మడ్డి మాత్రమే మిగులుతుంది."** (Savory 1968:79–80) అంటాడు.

### 1.4. పద్యాన్ని పద్యంగానే అనువదించాలా?

**'మూలభాషలోని పద్యాన్ని పద్యంగా, వచనాన్ని వచనంగా అనువదించాలి'** (Savory 1968:79లో ఉట్టంకితం) అని J.P. Postgate అంటే, **'మూలభాషా పాఠాన్ని లక్ష్యభాషలో వీలైనంత కచ్చితంగా అనువదించడం అనువాదకుని లక్ష్యంగా ఉండాలి. అందుకోసం ఛందస్సు, ప్రాస అనే బంధాలు ఉండకూడదు. అందుకే కవిత్వాన్ని ఎల్లప్పుడూ వచనంగానే అనువదించాలి'** (Holmes 1970:94 లో ఉట్టంకితం) అని John Middleton Murry అంటాడు. ఇతనిలాగే Hilaire Belloc కూడా మూలభాషలోని పద్యాన్ని లక్ష్యభాషలో వచనంగా అనువదించాలని (Savory

1968:79లో ఉట్టంకితం) అంటాడు. నవీన్‌చంద్ సెహగల్, ఆధునికులు ఛందస్సును కవిత్వానికి అవసరమైన అంశంగా భావించడం లేదు. ఇలాంటి స్థితిలో ఛందోబద్ధ కవిత్వాన్ని ఛందోబద్ధ కవిత్వంగా అనువదించే ప్రశ్నేలేదు (సెహగల్ 1993:68) అంటారు. వీళ్ళకి భిన్నంగా, Alexander Fraser Tytler భావగీతంలోని సౌందర్యం, ఆ సౌందర్యాన్ని కలిగించే అంశాలన్నీ దాన్ని వచనంలోకి మారిస్తే నశిస్తాయి కాబట్టి, భావగీతాన్ని (Lyric) వచనంగా అనువదించడం అసంగతం (Holmes 1970:94లో ఉట్టంకితం) అన్నాడు. మిల్టన్, షేక్స్పియర్ల కవిత్వంలోని కొన్ని పంక్తులను తీసుకొని వాటి అర్థం కొంచెం కూడా మారకుండా వచనంలో రాయడం అనేది పచ్చటి గడ్డిమీద ఉండే ముత్యాల్లాంటి నీటి బిందువులను చేతిలోకి తీసుకున్నట్లుగా ఉంటుంది. గడ్డిమీది నీళ్ళే చేతిలోనూ ఉంటాయి. కానీ గడ్డి మీద ఉన్నప్పటి సౌందర్యం, మెరుపు, గుండ్రని ఆకారం పోతాయంటాడు (Hudson 1968:74లో ఉట్టంకితం) james Montgomery అనే ఆంగ్ల విమర్శకుడు. ఈ పోలికను పద్యాన్ని వచనంగా అనువదించడానికి కూడా వర్తింపజేయవచ్చు. A translation of the poem into free verse could be nothing but ironical (Boulton 1998:161) అంటుంది. Marjorie Boulton. The translation of a poem should be a poem, viable as poem, and as a poem weighable (Brower 1959:35 లో ఉట్టంకితం) అని Dudley Fitts అంటాడు. మనిషి శరీరం అంతా రక్తం వ్యాపించి వున్నట్లు కవిత నిండా లయ వ్యాపించి ఉంటుంది. ఆ లయను/రక్తాన్ని తొలగిస్తే మిగిలేది శవమే (Nowottiny 1965:114లో ఉట్టంకితం) అని Yvor Winters అంటాడు. Theodore Savory, కవిత్వాన్ని వచనంగా అనువదించడం అనేది రంగుల వర్ణ చిత్రాన్ని తెలుపు, నలుపు రంగులతో చిత్రించినట్లుగా ఉంటుంది (Savory 1968:31) అంటాడు. **'పద్యాన్ని పద్యంగానే అనువదించడానికి ప్రయత్నించాలి. కుదరకపోతే వచన పద్యంగా అనువదించడానికి యత్నించాలి. అదీ కుదరకపోతే వచనంగా అనువదించాలి'** (తివారీ 1993:60–61) అని బోలానాధ్ తివారీ అంటారు. పైన చెప్పిన అందరి అభిప్రాయలకీ తివారీ గారి అభిప్రాయం ఆమోదయోగ్యంగా ఉన్నట్లు అనిపిస్తోంది.

### 1.5. కవిత్వానువాదం – పునఃసృజన

కవిత్వానువాదంలో మూలభాష కవితా రూపానికి సమానమైన రూపాన్ని లక్ష్యభాషలో సృష్టించడానికి మూలంలోని భావాన్ని మార్చడమో, మూలభాషలోని భావానికి సమానమైన భావాన్ని లక్ష్యభాషలో తేవడానికి లక్ష్యభాషా కవితా రూపాన్ని మార్చడమో లేదా రెండూనో జరుగుతుంటాయి. కాబట్టి ఎక్కువమంది అనువాదకులూ, అనువాద సిద్ధాంతవేత్తలూ కవిత్వాన్ని అనువదించడమంటే అనుసృజించడమే లేదా కొత్త కవితను వ్రాయడమే అన్న అభిప్రాయాలను వెలిబుచ్చారు. Poetry in translation is either poetry born anew or it is nothing at all (Laxmi 1993:80 లో ఉట్టంకితం) అని Raffel Burton అంటాడు. **'కవితను అనువదించడం అంటే కవితను కొత్తగా సృష్టించడమే'** (Nida 1964:161లో ఉట్టంకితం) నంటాడు Jackson Mathews. **'కవిత్వానువాదంలో అనువాదకుడు చేయాల్సింది పునఃసృజనే కాని పునర్నిర్మాణం కాదు'** (Brower 1959:55) అని Lattimore అంటాడు. A successfully translated poem is always another poem (Newmark 1988:165) అంటాడు Peter Newmark.

అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని భాషల మధ్య కవిత్వాన్ని మూలవిధేయంగానూ, నిర్దుష్టంగానూ (Perfectగా) అనువదించడం సాధ్యమే అని ఈ కింది తెలుగు కవిత హిందీ అనువాదం నిరూపిస్తుంది.

**"చూపులు"** – తెలుగు మూలం – జయప్రభ

**రెండు కళ్ళనుంచి**
**చూపులు**
**సూదుల్లా వచ్చి**
**మాంసపు ముద్దలపై**
**విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటాయి.**
**చూపులెప్పుడూ ముఖంలోకి చూడవు**
**మాట ఎప్పుడూ మనస్సునుంచి పుట్టదు**
**కనిపించినప్పుడల్లా**
**కంపరం పుట్టేలా ఒంటిమీద**
**చూపులు చెదల్లా పాకుతూ ఉంటాయి.**
**ఆ కళ్ళల్లో**
**లక్ష వర్గాలున్నాయి**
**కానీ చూపులకి మాత్రం వర్గవిభేదాలు లేవు.**
**ఆ చూపుల్లో ఎప్పుడూ**
**ఒక్కటే సంకేతం ఉంటుంది**
**చొంగ కార్చే కుక్కలాంటి ఆకలుంటుంది**
**వికృతమైన భల్లూకపు పట్టులాంటిదేదో**
**విడువక కలల్లో సైతం వెంటాడుతుంది.**
**చిక్కని ఈ అడవిలో వెలుగుకి చీకటికి**
**తేడానే ఉండదు**
**చూపులనుంచి దాటుకోవడానికి**
**స్థలమనేదే ఉండదు**
**రోడ్డుమీద, బస్సులోనూ, క్లాసులోనూ**
**వేసే ప్రతి అడుగు వెనకా**

శరీరంలోని ఏదో ఒక భాగాన్ని
గాయం చేస్తూ
విషపు చూపులు గుచ్చుకుంటూనే ఉంటాయి.
ఒక్కోసారి భయమేసి
సుదూర ఆకాశంలోకి, శూన్యంలోకి
మాయమైపోవాలనిపిస్తుంది,
కానీ
పలాయనం పరిష్కారం కాదని
విషపు చూపులనెదుర్కొనే
ముళ్ళలాంటి తీక్షణతని
కళ్ళకు నేర్పడం మొదలుపెట్టాను.
ఇప్పుడు ఆ కళ్ళని వెంటాడటానికి
కళ్ళతోనే యుద్ధం చేస్తాను
సూటిగా రెండు క్షణాలు
కళ్ళలోకి చూడలేని పిరికిచూపులు
పాతాళంలోకి పారిపోతాయి.
అప్పుడనుకుంటాను
కళ్ళకేకాదు,
ఈ దేశంలో ఆడదానికి
వళ్ళంతా ముళ్ళుండేరోజు ఎప్పుడొస్తుందా అని.

"నజ్ రేఉ" - హిందీ అనువాదం- రేగులపాటి మాధవరావు

దో ఆంఖో సే
నజ్రే
సూయియోc సీ ఆకర్
మాంస్ - ఖండోc పర్
మన్ మానీ ఘూమ్ తీ హైc
నజ్రేc కభీ ముఖ్ కీ ఓర్ నహీc దేఖ్ తీ
బాతేc కభీ హృదయ్ తల్ సే నహీc జగ్తీ
జబ్ - జబ్ దిఖాఈ దేతీ హై
సిహరన్ - సీ
బదన్ పర్
నజ్రేc దీమక్ - సీ రేంగ్ తీ రహతీ హైc!
ఆంఖోc మే
లాఖోc వర్గ్ భేద్ హైc
లేకిన్ నజ్రో మే వర్గ భేద్ నహీc!
ఉన్ నజ్ రో మే హమేశా
ఏక్ హీ సంకేత్ రహతా హైc
లార్ టప్కాతే కుత్తే కీ - సీ భూఖ్ రహతీ హై!
వికృత్ భాలూ కీ పకడ్ - సీ కుఛ్
లగాతార్ స్వప్నోc మే పీఛా కర్తీ రహతీ హై!!
ఇస్ ఘనే జంగల్ మే రోశ్నీ ఔర్ అంధేరే కా
అంతర్ హీ నహీc రహతా
నజ్cరోc సే బచ్ జానే కే లియే!
జగాహీ నహీc రహతా
రోడ్ పర్
బస్ మే, క్లాస్ మే
హర్ కదమ్ కే పీచే
శరీర్ కే కిసీ భాగ్ కో
ఘాయల్ కర్తీ హుఈ
జహరీలీ నజ్రేc చుభ్తీ రహతీ హైc
కభీ కభీ డర్ కే మారే
ఐసా లగ్తా హై
సుదూర్ ఆకాశ్ మే, శూన్య మే
గాయబ్ హెూ జాఏc! లేకిన్
సోచా కి పలాయన్ సమాధాన్ నహీc
జహరీలీ నజ్రోc కా సామ్నాకరనే,
అప్నీ ఆంఖోc కో కాంటోc కీ తీక్షణతా
సిఖానా శురూ కర్ దియా!
అబ్ ఉన్ ఆంఖోc కా పీఛా కర్ నే
ఆంఖోc సే లడ్తీ హూc
సీదా దో క్షణ్
ఆంఖోc మే ఆంఖేc డాల్
న దేఖ్ సక్నే వాలీ కాయర్ నజ్రేc
పాతాల్ కీ ఓర్ పలాయన్ కర్తీ హైc!
తబ్ సోచి హూc
వహ్ దిన్ కబ్ ఆయేగా
జబ్ అంఖోc
మే హీ నహీc
ఇస్ దేశ్కీ ఔరత్ కే
సారే బదన్ పర్ కాంటే ఉగ్ ఆఏc!

పైన పేర్కొన్న జయప్రభగారి "చూపులు" అన్న తెలుగు కవితను రేగులపాటి మాధవరావుగారు హిందీలోకి నిర్దుష్టంగా, లోపరహితంగా అనువదించారు. ఇది నిర్దుష్టమైన అనువాదం అని ఎలా చెప్పవచ్చంటే, ఈ హిందీ అనువాదాన్ని ఇంకా మెరుగుపెట్టడానికి అవకాశం లేకపోవడమే ఈ అనువాదం నిర్దుష్టమైనదనీ, లోపరహితమైనదీ తెలుపు తున్నది. ఈ నిర్దుష్ట అనువాదం సాధ్యం కావడానికి ఈ కింది కారణాలు కనిపిస్తాయి.

1. సంస్కృతం నుంచి వచ్చిన సంస్కృత పదజాలం తత్సమాల రూపంలోనో, తద్భవాల రూపంలోనో హిందీ, తెలుగు భాషల్లో ఒకే అర్థంలో ఉండడం. లక్ష వర్గాలు, వర్గభేదాలు, శరీరం, గాయం,

వికృతం, భల్లూకం, పలాయనం, పరిష్కారం, సుదూరం, శూన్యం, పాతాళం, దేశం మొదలైన సంస్కృత పదాలను అనువాదకుడు సమర్థవంతంగా ఉపయోగించుకున్నాడు.

2. తెలుగు కవితలో అనువాదకుడిని తరచుగా ఇబ్బంది పెట్టే సంస్కృతికి చెందిన పదాలు లేకపోవడం.

3. తెలుగు కవితలో శబ్ద వక్రతగానీ, అర్థవక్రత పెద్దగా లేకపోవడం. సూటిగా వచనంలాగానే ఉండడం.

4. తెలుగు కవితలో వాచ్యార్థం కుదరని నుడికారాలుగానీ, జాతీయాలుగానీ లేకపోవడం.

5. అనువాదకుడు ప్రతిభావంతుడు కావడం, తెలుగు, హిందీ భాషలమీద మంచి పట్టువున్నవాడు కావడం.

**ఉపయుక్త గ్రంథాలు**

**తెలుగు గ్రంథాలు**

1. జయప్రభ. 1996. 'చూపులు', నీలిమేఘాలు : స్త్రీవాద కవిత్వం. హైదరాబాద్: స్వేచ్ఛ ప్రచురణలు.

2. నిర్మల్, భీమ్ సేన్. జనవరి-మార్చి 1973. 'అనువాద రీతులు' తెలుగు. హైదరాబాద్: తెలుగు అకాడమి.

**హిందీ గ్రంథాలు**

1. కుమార్, సువాస్, 'కవితా కే భావీ జన్మ్' : భాషాంతర్ ఏక్ నిరంతర సంభావ్నా హై', అనువాద్, సంపా, బ్రజేంద్ర త్రిపాఠి, నఇ ఢిల్లీ: భారతీయ అనువాద పరిషత్. అంక్ 78. జనవరి-మార్చి 1994. పుట 15-19.

2. తివారీ, భోలానాథ్ మహేంద్ర చతుర్వేది. సంపా. 1993 సంస్కరణ్. 'కావ్యానువాద్ కీ సమస్యాయేఁ'. దిల్లీ: శబ్దర్ (ప్రథమ సంస్కరణ్ 1980).

3. సహగల్, నగీన్ చంద్. 1993సంస్కరణ్. 'కావ్యానువాద్ : కఠినాఇయాఁ ఏవం సంభావనా' కావ్యానువాద్ కీ సమస్యాయేఁ. సంపా. భోలానాథ్ తివారీ, మహేంద్రచతుర్వేది. దిల్లీ: శబ్దర్ (ప్రథమ సంస్కరణ్ 1980).

4. మాధవరావు, రేగులపాటి. 1998. 'నజ్రే' భారతీయ్ కవయిత్రియాఁ - భాగ్ ?. నఈ దిల్లీ: హిందీ కేంద్రీయ్ నిదేశాలయ్.

5. నర్వణే, వి.ఎస్. 'కావ్ కో అనూదిత్ నహీఁ కియా జా సక్తా', అనువాద్. సంపా. గార్గీగుప్త. నఈ దిల్లీ: భారతీయ్ అనువాద్ పరిషద్. అంక్ 80. జులై - సితంబర్ 1994 - 10-14.

6. రాజగోపాలాచారి, సి. Reflection on translation అనువాద్. సంపా. గార్గీగుప్త. నఈ ఢిల్లీ: భారతీయ్ అనువాద్ పరిషద్ అంక్ 80. జులై - సితంబర్ 1994.

**ఆంగ్ల గ్రంథాలు**

1. Belloc, Hilaire. 1931. On Translation. Oxford: Clarendon Press.

2. Brower, R.A. (Ed.). 1959. On Translation. Cambridge, MA: Harvard University Press.

3. Boulton, Marjorie. 1998 edition. The Anatomy of Poetry. New Delhi: Kalyani Publishers.

4. Chakravarthy, Amiya. "On Translation from Bengali "Indian Literature-149. Ed. K. Sachidanandan. New Delhi: Sahitya Academy, May-June 1992. PP 131-139.

5. Holmes, James S. (Ed.). 1970. The Nature of Translation: Essays on the Theory and Practice of Literary Translation. Mouton: Slovak Academy of Sciences.

6. Hudson, W.H. 1968 edition. An Introduction to the Study of Literature. Ludhiyana: Lyall Book Depot.

7. Jakobson, Roman. 1959. "On Linguistic Aspects of Translation" in Brower (Ed). On Translation. Cambridge, MA: Harvard University Press.

8. Laksmi, H. 1993. Problems of Translation. Hyderabad: Book links.

9. Newmark, Peter. 1988. A Textbook Of Translation. New York: Prentice Hall

10. Nida, Eugene. 1964. Toward a Science of Translating. Leidon: E.J. Brill.

11. Nowottny, Winifred. 1968 edition. The Language Poets Use. London: University of London The Athlone Press (1st edition. 1962).

12. Postgate, J.P. 1992. Translation and Translations. London: Bell.

13. Rengasamy, P. "Literary Translation" in Mahaswetha sengupta and Udayanarayana Singh.Eds.

14. Savory, Theodre. 1968 edition. The Art of Translation. London: Savory (1st edition. 1957).

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022

# చరిత్రగా మారనున్న ప్రాచ్య కళాశాలల ఘనమైన గతం

**సుభ్యా,** పరిశోధక విద్యార్థి, హైదరాబాద్, ఫోన్ : 73068 74798

ఈ రోజు మొత్తం తెలంగాణ రాష్ట్రంలోనే ప్రాచ్య విద్యాసంస్థల చరిత్ర గతంగా మారడానికి సిద్ధమైపోయింది. నిన్న మొన్నటివరకు మిణుకు మిణుకు మంటూ అయినా నడిచిన ఈ కళాశాలలు నేడు ఆ మాత్రం ఉనికిని కూడా కోల్పోయే స్థితికి చేరాయి. అవి జ్ఞాపకాల పేటికలు కానున్నాయి. ఇవి తెలంగాణ సమాజంపై సానుకూల ప్రభావాన్ని చూపిన గొప్ప విద్యాసంస్థలుగానూ చరిత్రలో ప్రత్యేకమైన గుర్తింపును సాధించుకున్నాయి. ప్రాచ్య విద్యాసంస్థలు విజ్ఞానాన్ని మాత్రమే అందించలేదు, ఈ విజ్ఞాన సాధనలో విద్యార్థులు ఉపాధిని పొందేందుకు దోహదం చేశాయి. ఇటీవలి కాలం వరకూ జరిగిన అనేక డి.ఎస్ (ఇప్పుడు టిఆర్‌టి)లలో తెలుగు పండిత ఉద్యోగాలకు అధిక శాతం ఎంపిక అయింది ఈ విద్యాసంస్థల పూర్వ విద్యార్థులే. వీరికి భాషా సాహిత్యాలపై సహజంగానే గట్టిపట్టు ఉంటుంది. కనుక బోధనలో చక్కగా రాణిస్తారు. అంతేకాదు తెలుగుభాషను రక్షించగలిగే భవిష్యతరాన్ని కూడా వీరు నిర్మిస్తున్నారు.

తెలంగాణలో ప్రాచ్య విద్యాసంస్థలు అన్న సంస్కృత పదం కంటే ఓరియంటల్ కాలేజీలు అనే ఇంగ్లీషు మాటే అధిక ప్రచారంలో ఉంది. అదొక సంప్రదాయంగాను స్థిరపడింది. వాస్తవానికి ఈ "ఓరియంటల్" అన్న భావన బ్రిటీష్ వలస పాలనా కాలంలో ఆరంభమైంది. న్యాయ కోవిదుడు, ఇంగ్లాండ్ పౌరుడైన సర్ విలియం జోన్స్ కలకత్తాలో జడ్జిగా ఉంటూ ఈ సంస్థను ముందుకు తీసుకొనిపోయారు. సంస్కృతాన్ని లాటిన్‌తో పోల్చి చూశారు. భారతీయ అధ్యయనాలను "ఓరియంటల్ స్టడీస్"గా అభివర్ణించడం అప్పుడే ఆరంభమైంది. ఉర్దూ, తమిళం, అరబిక్, కన్నడం, హిందీ, తెలుగు ఇంకా ఎన్నో భారతీయ భాషలు బ్రిటిష్‌వారి దృష్టిలో "ఓరియంటల్" విభాగానికి చెందినవి. కల్నల్ కాలిన్ మెకంజీ, సిపి.బ్రౌన్, బిషప్ కాల్డ్వెల్ ఇంకా ఎందరో కొత్త సిద్ధాంతాలు ప్రతిపాదించారు. బిషప్ కాల్డ్వెల్ ప్రతిపాదించిన ద్రవిడ భాషా సిద్ధాంతాలు ఇటువంటివే. వీటిని సహేతుకమైనవిగా తదనంతర భాషా శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

20వ శతాబ్ది ఆరంభంలో నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయనగరం, కొవ్వూరు లాంటి పట్టణాలలో ఓరియంటల్ విద్యాసంస్థలు ఆరంభమయ్యాయి. విజయనగరం విద్యాసంస్థలకు పూసపాటి రాజవంశీయుల సహాయ సహకారాలు ఉండేవి. తాతా సుబ్బరాయ శాస్త్రి వంటి మహాపండితులు ఇక్కడ తమ సేవలు అందించారు. కొవ్వూరులో ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం స్థాపించ బడింది. ప్రసిద్ధ వ్యాకరణ పండితులు దువ్వూరి వెంకటరమణ శాస్త్రి ఇక్కడ బోధించారు. తదనంతరం ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు అయ్యారు. మరో విద్యాసంస్థ చిట్టి గూడురులో స్థాపించ బడింది. కోవెల సంపత్కుమారాచార్య వంటి ఎంతోమంది చిట్టిగూడూరులో చదువుకొని చిర యశస్సును సాధించారు. ఇదంతా స్వాతంత్ర్య పూర్వకాలం నాటి మాట. దేశం స్వతంత్ర్యాన్ని సాధించుకున్న తరువాత కోస్తాంధ్రలోని అన్ని పెద్ద పట్టణాలలోను ఓరియంటల్ కళాశాలల స్థాపన జరిగింది. వీటిలో ఎక్కువగా ఎయిడెడ్ పద్ధతిలో ప్రారంభమైనవి. అయితే రాయలసీమలో మాత్రం వీటి సంఖ్య తక్కువగానే ఉండేది.




తెలంగాణ ప్రాంతంలో 1498 సెప్టెంబర్ 17 నాటి దాకా నిజాం రాజవంశీయుల పాలన సంగతి తెలిసిందే. వీరు అసఫ్‌జాహీలు, 1724 నుండి రెండు వందల సంవత్సరాలకు పైగా సాగిన వీరి పరిపాలనలో తెలుగుభాష అనేక రకాలుగా అణచివేతకు లోనైంది. 1880ల వరకు పార్శీ అధికార భాష. అటు తర్వాత ఉర్దూ ఆ స్థానాన్ని ఆక్రమించింది. తెలుగుకు మాత్రం ఈ స్థానం ఏనాడూ దక్కలేదు. ఉర్దూమయమైన ఆనాటి వాతావరణంలో తెలుగు – సంస్కృతాలకు ప్రాధాన్యత ఇచ్చే ఓరియంటల్ కళాశాలల స్థాపన ఒక సాహసమే. దీన్ని చూపించారు కొద్దిమంది ఆనాటి భాషా ప్రేమికులు, పండితులు. హైదరాబాద్ నగరంలోని సీతారాంబాగ్ కళాశాల ఈ వరుసలో తొలుత పేర్కొనదగినది. మహా విద్వాంసులైన శఠగోప రామానుజాచార్యులవారు సంస్థ వ్యవస్థాపకులు. ఆయనను ఆ రోజుల్లో సీతారాంబాగ్ స్వామీజి అని ఎంతో గౌరవంతో పిలిచేవారు. తదనంతర కాలంలో విశ్వవిద్యాలయ ఆచార్యులుగా ప్రసిద్ధులైన కె.కె.రంగనాథాచార్యులు, రవ్వాశ్రీహరి వంటివారు ఇక్కడే తమ విద్యాభ్యాసాన్ని ప్రారంభించారు. ఇక వరంగల్లు నగరంలో విశ్వేశ్వర

సంస్కృతాంధ్ర కళాశాల తొలి ఓరియంటల్ సంస్థగా జిల్లా చరిత్రలో నిలుస్తుంది. ఆకారం నరసింగం గుప్త అనే గొప్ప వ్యాపారితో పాటు మాదిరాజు రామకోటేశ్వరరావు అనే స్థానిక న్యాయవాది మరికొందరు వరంగల్లు పుర ప్రముఖులు ఈ కళాశాల స్థాపనకు కృషిచేశారు. సిద్ధిపేటకు చెందిన వేముగంటి నరసింహాచార్యులు వంటి గొప్ప సాహితీవేత్తలు ఇక్కడ చదివారు. పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న సుప్రసిద్ధ సంస్థాన కవి శ్రీ భాష్యం విజయసారథి ఈ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఓరియంటల్ కళాశాల ఏర్పాటు త్వరితగతిన కొనసాగింది. ఇలా వేములవాడ, ధర్మపురి, యాదగిరి గుట్టల్లో ఓరియంటల్ కళాశాలల స్థాపన, వాటి వికాసం జరిగింది. పట్టుదలకు ప్రతిరూపాలుగా ఉన్న ముగ్గురు ప్రముఖులు మూడు ఓరియంటల్ కళాశాలల స్థాపనకు కారకు లయ్యారు. ఈ మూడు అనేకమందికి అన్నపూర్ణలు అయ్యాయి. అందులో ఒకటి నల్లకుంట (హైదరాబాద్) లో ప్రారంభమైన ఆంధ్ర ప్రాచ్య కళాశాల. అది ఇటీవలి కాలం దాకా ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం కళాశాలగా ఉండేది. 1960లలో ఆచార్య ఖండవల్లివారు ఈ కాలేజీని స్థాపించారు. ఇందుకోసం ఆయన విశేషంగా శ్రమించారు. శాశ్వత స్థాయిలో అధ్యాపకులు నియామకం కాని తొలిదశలో ఖండవల్లితో సహా గరికపాటి లక్ష్మీకాంతం వంటి విద్యావేత్తలు ఇక్కడ స్వచ్ఛందంగా పాఠాలు చెప్పి, సంస్థను నిలబెట్టారు. కనీసం పాతిక సంవత్సరాలపాటు సంస్థ ఎంతో పచ్చగా వైభవంతో అలరాలింది. ప్రమాణాలకు ప్రతిరూపంగా నిలిచింది. శివునూరి విశ్వనాథశర్మ సుదీర్ఘకాలం పాటు ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. మరో ప్రముఖుడు పాలెం సుబ్బయ్య మహబూబ్‌నగర్ జిల్లాలోని తన ఊరిలో ఓరియంటల్ కళాశాలను ప్రారంభింపజేశారు. సుబ్బయ్య విద్యావేత్త కాదు, నిస్వార్థపరుడైన రాజకీయ వేత్త. పాలెం వంటి పల్లెటూరులో పలు విద్యాసంస్థల ఏర్పాటు కోసం అవిశ్రాంతంగా శ్రమించిన అపర భగీరథుడు. డాక్టర్ శ్రీరంగాచార్య, తెలకపల్లి విశ్వనాథ శర్మ వంటి విద్వాంసులు ఇక్కడ పనిచేశారు. సుప్రసిద్ధ సాహితీవేత్తలు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య రుక్నుద్దీన్, గన్నమరాజు గిరిజా మనోహరబాబు వంటివారు ఇక్కడ విద్యాభ్యాసం చేశారు. మూడవ ప్రముఖుడు ఆచార్య అమరేశ్వరం రాజేశ్వరశర్మ. ఆయన స్వస్థలం కామారెడ్డి పట్టణం. అమరేశంగారు, జటావల్లభుల పురుషోత్తంవంటి గొప్ప విద్వాంసుల శిష్యులు. పేరున్న వ్యాకరణ పండితులు. ఆయన సంకల్పమే సాధనంగా కామారెడ్డి ఓరియంటల్ కళాశాల స్థాపన జరిగింది.

ఇంకా హైదరాబాద్ నగరంలో బొగ్గులకుంటలోని ఆంధ్ర సారస్వతపరిషత్తు, పాతనగరంలోని అభ్యుదయ, బోయిన్‌పల్లిలోని ప్రాచ్య కళాశాలతోపాటు నల్గొండ తదితర పట్టణాలలోనూ ఓరియంటల్ కాలేజీలు ఉండేవి. ఉర్దూను బోధించే ఓరియంటల్ హైదరాబాద్ నగరంలో మాత్రమే ఉండేవి.

ఓరియంటల్ కళాశాలలు సంప్రదాయ విద్యాభ్యాసానికి పెద్ద పీటలే వేశాయని స్పష్టంగా చెప్పవచ్చు. సంస్కృతాంధ్ర వ్యాకరణాలు, సంప్రదాయ కవిత్వం, సంస్కృత గద్య – శ్లోక రచనలు, ఛందస్సు – అలంకారశాస్త్రం కొంతమేరకు తర్కం ఇవన్నీ పాఠ్యాంశాల్లో అనివార్యమైన భాగాలు, తరువాత ఇంగ్లీషును కూడా ఈ అనివార్య అంశాల్లో చేర్చారు. పి.డి.సి, డిప్లొయెల్, బి.పి.ఎల్ (తరువాత బి.ఎ.ఎల్) అనంతరం ఎం.ఎ.ఎల్ ఇట్లా ఒక క్రమం కొనసాగుతూ ఉండేది. పఠనపాఠనాలు ఎంతో లోతుగా సాగేవని నాటి విద్యార్థుల జ్ఞాపకాలు చెబుతున్నాయి. గురుశిష్యుల అనుబంధ క్రమంలో ఆనాటి గురుకుల సంప్రదాయాలు గుర్తుకు వచ్చేవని కొంతమంది చెబుతారు. కళాశాల సమయం సాధారణంగా సాయం సమయం. దీనితో రోజువారి పనులకు ఇబ్బంది ఉండదు. పలువురు విద్యార్థులు ఇటు చదువును కొనసాగిస్తూనే పార్ట్‌టైం ఉద్యోగాలు చేసే అవకాశం ఉండేది.

టిఆర్‌టిలో ఉద్యోగాలతోపాటు పలువురు ఓరియంటల్ విద్యార్థులు గతంలో జూనియర్, డిగ్రీ కళాశాలల ఉపన్యాసకులు అయ్యారు. పలువురు విశ్వవిద్యాలయాల స్థాయిలో రాణించిన సంగతిని ఇదివరకే ఈ వ్యాసంలో పేర్కొనడం జరిగింది. ఓరియంటల్ విద్యాసంస్థల విద్యార్థులు కొందరు ఉన్నతాధికారులు గాను రాణించారు. కొంతమంది పత్రికారంగంలోను గొప్ప యశస్సును సముపార్జించుకోగలిగారు. ప్రాచ్య విద్యాసంస్థల ద్వారా తెలంగాణ విద్యారంగం అనేక ప్రయోజనాలు సాధించుకున్నది.

“కాలం మార్పునకు నిలయం” అన్నది వేదాంతుల మాట మాత్రమే కాదు, జీవితానికీ వర్తిస్తుంది. కాలస్వభావాన్ని అంచనావేయడం అసాధ్యం. ప్రాచ్య విద్యాసంస్థలు మూతబడి చరిత్రలో చేరిపోతాయని గత పాతిక సంవత్సరాలనాడు ఎవరూ ఊహించలేదు. అయితే గత పది సంవత్సరాల నుండి మాత్రం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఈ కళాశాలల్లో చేరికలు నానాటికీ తగ్గుముఖం పట్టాయి. ఇందుకు ఎన్నో కారణాలు. డిగ్రీ కళాశాలల్లోనే తెలుగు (స్పెషల్) కోర్సుల ఏర్పాటు, ప్రపంచీకరణ క్రమంలో కంప్యూటర్‌కు పెరిగిన ఆదరణ అదే నిష్పత్తిలో తెలుగుపట్ల ఏర్పడిన నిరాదరణ, గతం వలె ఉపాధ్యాయుల నియామక పరీక్షలు తక్కువ కాలవ్యవధిలో జరగకపోవడం ఇట్లా ఎన్నో కారణాలు.

ఓరియంటల్ కళాశాలలు గత జ్ఞాపకాలు. అయితే అవి ఎంతో విలువైనవి. ఎన్నో కళాశాలలు దశాబ్దాల కాలగమనంలో ఎన్నో మైలురాళ్ళను దాటాయి. ఆయా కళాశాలల పూర్వ ఆచార్యులు, గతంలో అక్కడ చదివిన విద్యార్థులు అయినా అప్పటి ఘనతల్ని సాధికారికంగా నమోదు చేసి పదిలపరచడం అవసరం. భవిష్యత్తులో తెలంగాణ ఉన్నత విద్యను గురించి పరిశోధించేవారికి ఈ అంశాలు అమూల్య ఉపకరణాలుగా తోడ్పడతాయి.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 (13) హైదరాబాద్ జూన్ : 2022

బందారం కథలు - 7

# శానతనం

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148

దొరవారి పీరి జోరుమీదుంది. ఎవరూ ఆపలేకపోతున్నారు. దుంబాల మల్లయ్య ఆ పీరిని ఎత్తకున్నాడంటే చాలు. ఉన్నట్టుండి జోష్ పెరుగుతుంది. నడుముకు కట్టిన రుమాలులో బిగిసి ఉన్న పీరీ కర్ర బొడ్డు మీద ఒత్తిడి పెంచుతున్నది. మల్లయ్య పూనకంతో ఆడుతున్నాడు. ఒక చేత్తో పీరిని ఆపటానికి కట్టిన పగ్గం, మరొక చేత్తో వారు గట్టె పట్టుకొని ఉరుముతున్నాడు. ఉరుకుతున్నాడు. పీరికి కుడిపక్క కట్టిన పగ్గం ఒకాయన, ఎడమపక్క కట్టిన పగ్గం మరొకాయన బలంగా పట్టుకొని జోరును ఆపటానికి ప్రయత్నిస్తున్నారు. మల్లయ్య కోపంతో వారుగట్టెతో కాళ్లకు కొట్టుకుంటున్నాడు. పక్కన గౌండ్లోల్ల పీరి జోరు పెరిగింది. ఆ పీరి ఎత్తుకున్న కనకయ్య పూనకం పెరిగి వారుగట్టెతో చటాచటా కొట్టుకున్నాడు. రెండు పీరీలకు పెద్దపెద్ద కొమ్ములున్నాయి. వృత్తాకారపు ఇత్తడి పలక మీద మూడు ఇత్తడి రేకులు మెరుస్తున్నాయి. పక్కన సాకలోల్ల పీరి లాల్‌చావ్ వెండి కిరీటం ధరించి వెండి గున్నాలతో ప్రశాంతంగా ఉన్నది. పీరినెత్తుకున్న తను ప్రశాంతంగా ఉన్నాడు. ఆ పీరికే మహిమలెక్కువని నమ్ముతారు. ఎర్రటి దట్టి ఎంత మెరుస్తున్నదో కుడుక పేర్లు అంతే మెరుస్తున్నాయి. కుమ్మరోల్ల పీరి కొంచెం కురచగా ఉంది. పక్కన మరింత చిన్నపీరి. ఎత్తుకున్నవాళు ఆవేశపడటం లేదు. అలసిపోవటం లేదు. అలగటం లేదు. హాయిగా సాగుతున్నరు. పీరీలకు ముందు ఇమామ్ సాబ్ చేతిలో వెడల్పాటి మట్టిపాత్ర పొగలో విరజిమ్ముతున్నది. మరోచేతిలో నెమిలీకల కట్ట అటూ, ఇటూ కదులుతుంది. నడుమ నడుమ ఊదుపొడి చల్లినప్పుడు ఉద్వేగపరిచే వాసన పొగతో పాటు గుప్పుమంటున్నది. ఇమామ్‌తోపాటు టోపీలు ధరించిన ముగ్గురు పిల్లలు, వాళ్ళతో పాటు ముగ్గురు కులపూజారులు నడుస్తున్నారు. కొందరు అసోయ్‌ధూలా అని నినదిస్తున్నారు. పీరీల పక్కన, వెనుక పిల్లలు గుమిగూడి గుంపులుగా ఎగురుతున్నారు. ఆ గుంపులన్నిటికి ముందు దప్పులు జోరుగా మోగుతున్నాయి. దరువు మార్చుకుంటూ జోష్ పెంచుకుంటూ ఊరేగింపు సాగుతుంది. పీరీలు ఆడుకుంటూ పటేండ్ల పాటకి లోకి మలిగాయి. అప్పటికే ఇద్దరు స్త్రీలు బిందెలతో నీళ్లు పట్టుకొని ఇంటిద్వారం ముందు నిలబడి ఉన్నారు. పీరీలు రాగానే వాకిట్లో నీళ్లు కుమ్మరించారు. రెండు కుడకలు, ఊదుపొట్లం తెచ్చి చదివించారు. ఇమామ్ పొట్లం విప్పి ఊదు పొడి నిప్పులమీద పోశాడు. కమ్మని వాసన విస్తరించింది. కుడుకలు దొరవారి పీరికొకటి, లాల్‌చాల్ కొకటి దబ్బనంతో కుచ్చి సుతిలి ముడేశారు. ఇమామ్ సాబ్ పొగపాత్రలో రాలిన బూదిని రెండువేళ్లతో తీసి ఆ ఇంటి స్త్రీల నుదుట బొట్టు పెట్టాడు. పిల్లలకు కూడా బొట్టు పెట్టాడు.



నెమలీకల కట్ట తలమీద కొట్టి ఆశీర్వదించాడు. కొంత బూది పొట్లం మలిచి ఇచ్చాడు. తరువాత పీరీలు మరొక ఇంటికి మలిగాయి. మరొక ఇల్లు, ఇంకొక ఇల్లు. వాడంతా తిరిగాయి. ఎండ పెరుగుతూ ఉన్నది. పీరీలు ఎత్తుకోవటానికి యువకులు పోటీ పడుతున్నారు. పీరీ దొరకని వాళ్లు పూనకం వచ్చి చేతులతో తొడల మీద చరుచుకుంటున్నారు. కొమురెల్లి ఆవేశంతో పీరి ఎత్తుకోవాలని ముందుకొచ్చాడు. పక్కన నడుస్తున్న వాళ్లు జరుగబోయేది ఊహించినట్లే. పరుగెత్తుకొచ్చి కొమురెల్లిని వారించారు. శాంతింపజేశారు. ఆ వాడ చివరి ఇల్లు వచ్చింది. ఇల్లు చివర పాడుపడిన బావి ఉంది. గోరీల బావి అంటారంతా. పీరీలు దగ్గరికి రాకముందే బావిచుట్టూ యువకులు, పిల్లలు గుమిగూడి బావిలోకి తొంగి చూస్తున్నారు. చెవి ఒగ్గి చప్పుడు వింటున్నారు. బావిలోంచి ప్రతిధ్వని వస్తుంది. బావిలో పీరీలు ఆడుతున్నాయని ఊరివాళ్లు భావిస్తారు. అట్లా ప్రతి పీరీల పండుగకు బావిలోంచి వచ్చే చప్పుడు విని కథలు చెప్పుకోవటం ఊరివాళ్లకు అదో సంతోషం. అదో హుషారు. పీరీలు బావిదాకా వచ్చి లోపలి పీరీలకు జోష్ కలిగించి మరో వాడకు మర్లాయి. మధ్యాహ్నం దాకా అన్ని వాడలూ తిరిగి తిరిగి కబీరులో పీరీలను మళ్ళా నిలబెట్టారు.

కుమ్మరి వాళ్లింటికి వెళ్లి స్వయంగా తెచ్చిన కొత్తపటువను అలంకరిస్తున్నది చంద్రవ్వ. ఏ పండుగ వచ్చినా చంద్రవ్వ, వాళ్ళమ్మ

పోశవ్వ అంతే భక్తి శ్రద్ధలతో జరుపుతారు. కుటుంబమంతా పండుగ పనుల్లో లీనమైపోతారు. ఖర్చు గురించి ఆలోచిస్తాడు గానీ ముసలాయనకు కూడా పండుగలిష్టమే. పీరీల పండుగ వచ్చిందంటే మట్కీలు ఊరిస్తాయి. పటువను కడిగిన దగ్గర నుంచి అందంగా దిద్దటం చంద్రవ్వకు ఇష్టం. కొంచెం బియ్యంపిండి కొంచెం పసుపు పలచగా కలిపింది. రంగు మారింది. పసుపు తెలుపు కలిసిపోయి మెరిసే మరో రంగు తయారైంది. ఆ రంగు నీళ్లలో దారం ముంచి తీసి పటువ పక్కన పెట్టి గోటితో చిలకరించింది. పటువ మీద చిన్నచిన్న రంగు బిందువులు పడి అందంగా మెరుస్తున్నాయి. క్షణాల్లో పటువ మీద ఆకర్షణీయమైన చుక్కల డిజైన్ తయారైంది. పటువ మెడ దగ్గర ఆ దారం కట్టింది. పొయ్యి దగ్గర పోశవ్వ బెల్లంతో తీయని పానకం తయారు చేసి తెచ్చింది. పటువలో బెల్లం పానకం పోసి కంచుడు మూత పెట్టారు. పొద్దు పోతున్నదని, తొందరగా తయారు గమ్మని పోశవ్వ చంద్రవ్వను లేపింది. ముసలాయన హుషారుగానే ఉన్నాడు గానీ, కొమిరెల్లి అంత ఉత్సాహంగా లేడు. దేనికైనా ముందుండెటోడు, ఏ పండుగకైనా మురిసెటోడు ఆరోజు ఎందుకో మజ్జుగా ఉంటున్నాడు. పీరీల పండుగ గదా, పకీరయ్యవు కమ్మంటే కోపంగా గదమాయించాడు. కానే కానని మొరాయించాడు. **"యాదాదికొక్క దినం ఏ దేవుడు కనికరిస్తడో కొలుసుకోరా"** ముసలాయన ఎంత అన్నా వినలేదు చిర్రుబుర్రులాడుతుంటే పోశవ్వకు ఏమీ తోచటం లేదు.

పక్కింటి యాదగిరి ఫకీరయ్య అయ్యాడు. మరో నలుగురు యువకులు ఫకీరయ్యలయినారు. పండు మిరపరంగు నాడా కొందరు, పసుపు రంగు నాడా కొందరు ఒంటిమీద ధరించారు. యాదగిరి కొమిరెల్లిని ఎంత సముదాయించినా ఫకీరయ్య కావటానికి ఒప్పుకోలేదు. పసుపురంగు నాడా ధరించి ఫకీరయ్య అయిన యాదగిరి ఐదిండ్లకు వెళ్లి అడిగి భిక్ష తీసుకొచ్చాడు. అనుకున్నది నెరవేరుతుందనే ఆశతోనే కొలుపుకు పూనుకొంటారు ఎవరైనా. అదొక వేడుక. అదొక జోష్.

చీకటి పడుతున్నది. పగలు ముగిసిందంటే పనులకు సెలవు. ఆటపాటలకు అనుమతిస్తూ తప్పుకున్నాడు సూర్యుడు. చీకటి పడినా కుదుటపడలేదు కొమిరెల్లి. బయట వేడి చల్లారినా కొమిరెల్లి లోపలి వేడి చల్లారలేదు.

పాలేరు పని ఎంత ఉరికురికి చేసినా పటేలు పజీత చేస్తనే ఉ ంటడు. చేసి చేసి ఇంటికొస్తే అయ్య ఏందేందో గులుగుతనే ఉ ంటడు. ఎప్పుడన్నా మెచ్చడు. అవ్వ, చెల్లె అట్లట్లుంటరు గని అతకరు, పొతకరు. అన్నిట్ల తనే ముందుండాలనిపిస్తది. సదువుకుంటనంటె సాగనియ్యలేదు అయ్య. దోస్తులతోనే పానం. ముచ్చట మురిపెం అన్నీ దోస్తులే కావచ్చు. పీరీల పండుగ పీర్లే. పోయినేడు పీరినెత్తుకోనియ్యలే. ఇయ్యేడు ఎత్తుకుందామంటే ఎత్తుకోనియ్యలే. అజం లేదా... మల్లయ్యకెంత పేరుందో అంత పేరు తను తెచ్చుకునేటంత దమ్ముంది. ఊరు ఊగిపోవాలె. తనను ఊగనియ్యరు. ఏ పీరినైనా ఎత్తుకొని ఎగురగలడు. ఎత్తుకోనియ్యరు. పీరినే ఎత్తుకోనియ్యనప్పుడు, ఫకీరయ్య ఎందుకు గావాలె. ఎవనికి గావాలె. కొమిరెల్లి మనసు పరిపరి విధాల తొక్కులాడుతుంది. చిక్కు పడుతున్నది.

ఊరంతా చీకటి అలుముకున్నది. మట్కీలకు వాడంతా తయారయింది. ఆ వాడకు పీరీలు రావు. పీరీల దగ్గరికే ఆ వాడ వెళ్ళాలి. వెళ్ళేతందుకు హుషారుగున్నది. పానకం, పటువల మీద కంచుడు. కంచుట్ల నూనె. నూనెల వత్తులు. చీకటిని అదరగొడ్తూ దీపాలు వెలుగుతున్నాయి. దిక్కులను ఎగిరిస్తూ డప్పులు మోగుతున్నాయి. మట్కీల పటువలెత్తుకొని ఆడవాళ్లు నడుస్తుంటే చీకట్లో దీపాలు నడుస్తున్నట్టే ఉన్నది. దీపాల నడక, వరుస దీపాలు. వరుస వెలుగులు. మెరుపు వయ్యారాలు. ఒకపక్క డప్పులజోరు. మరొక పక్క యువకుల జోష్. యువకుల గంతులు వేడెక్కించే నోటి ఈలలు. పేరు దేవతలది. వేడుక మనుషులది. పండుగల పరవశం అదే మరి.

దోస్తులెంత లాగినా కొమిరెల్లి పూర్తిగా కలువలేకపోతున్నాడు. బలవంతంగా లాగితే రెండు నిమిషాలు ఆడి తప్పుకుంటున్నాడు. మట్కీల బోనం పటువల మీద దీపాలు గాలికి కొట్టుకుంటున్నాయి. ఒక దీపం ఆరిపోయింది. మోస్తున్న ఆమె ఆగి పక్క దీపం నుంచి మళ్లీ వెలిగించుకున్నది. ఆ దీపం ఆరిపోబోతూ వెలుగుతున్నది. గాలికి రెపరెపలాడుతున్నది. కొమిరెల్లి మనసు కూడా దీపం వలె రెపరెపలాడుతున్నది.

"ఊరంతటికీ సత్తెలింగం సేటు లోకువ. ఆ సత్తెలింగం సేటుకు తను లోకువయిండా... పొద్దున బీడీల కట్టకోసం పోతే ఉద్దెర లేదన్నడు. ఎందరికి ఉద్దెర ఇయ్యడు. తనకెందుకియ్యలేడు. అరుగుమీద కూచోబోతే అరుగు మీద కూచోనియ్యలేదు. రోజు ఎందరు అరుగుమీద కూచోరు. తనేనా తక్కువ. అన్నుంచి పొయ్యి దుకాణం ఎదురుంగ చింతమొద్దు ఉంటే చింతమొద్దు మీన కూసోబోతే కూసోనియ్యలేదు. తిట్టుకుంటు ఉరుకొచ్చిండు. మొద్దుమీన సుత కూసోవద్దా – ఎందరు కూసోరు – ఏమయింది తనకు. అందరు పండుగ జోరుల ఉంటే తనెందుకు తండ్లాడుతున్నడు. మంకన్నకు చెప్పితే మరిసిపొమ్మన్నడు. మరుపెంత మంచిది. మరుపెందుకు రాదు? తనది కోపమా? పండుగ పూటేం కోపం...?

కొమిరెల్లి పండుగలో కలువలేకపోతున్నా వాళ్లతోనే నడుస్తున్నాడు. కబీరు దగ్గరికి చేరగానే మట్కీలు నిలబడ్డాయి. డప్పులు దరువు మార్చి మోగుతున్నాయి. ఇద్దరు యువకులు కట్టెల మోపులు దించుకున్నారు. ముసలాయన వచ్చి ఏదో చెప్పాడు. ఇమామ్‌సాబ్ ఎదురొచ్చి ఆహ్వానించాడు. ఊదు పొగతో మట్కీల ఎదురుగా నిలబడి ఏదో చదివాడు. వాడ వేడుక చూడటానికి ఊరంతా వచ్చింది. వాడ

పెద్దావిడ వచ్చి బోనం పటుకలు దించుతూ అలికి ఉంచిన చోట వరుసగా పెడుతున్నది. అయిదు వరుసల దీపాలు అలరారు తున్నాయి. మట్కీ బోనాలు దించిన స్త్రీలు పీరీలకు మనస్ఫూర్తిగా మొక్కుకున్నారు. పిల్లలు ఉత్సాహంగా చూస్తున్నారు. వృద్ధులు, యువకులు, స్త్రీలు అదో జాతర. ఎవరి శ్రద్ధ వారిది. ఎవరి పనుల్లో వాళ్లు హడావుడిగా ఉన్నారు.

మట్కీ పటువల్లోంచి బెల్లం పానకం పీరీలకు సమర్పించారు. తర్వాత కొందరికి పంచారు. యువకులు కొందరు కట్టెలమోపు విప్పారు. ఆలువా గుండంలో నిప్పు రగిలించారు. కట్టెలు వేసి మండించారు. అప్పటికే నిప్పులతో ఉన్న గుండం మంటలతో వేడెక్కింది. ఎరుపెక్కింది. దీపాల వెలుగు మంటల వెలుగు ముందు చిన్నబోతున్నది.

యువకులు చేతులు ఒకరికొకరు జొటబొటలు పట్టుకొని ఆట మొదలు పెట్టారు. 'అసోయ్' అన్నారెవరో. 'ధూలా' అన్నారందరు. ఆలువా చుట్టు ఆట మొదలయింది. ముందుకు వెనకకు అడుగులు వేస్తూ ఆనంద నృత్యం సాగుతున్నది. "ఒకటే పీరు. తొలి మసీదు దుంకుత కూడొయ్. అసోయ్‌ధూల పాటందుకున్నాడు ఆశాలు. ఆశాలుది మంచి గొంతు. అట్లా విప్పితే ఎన్ని పాటలో.... పాటకు తగిన దరువు. దరువుకు తగిన అడుగులు. అడుగుల మించి ఊపు. ఊపుకు మించి పాట. మంటలో దుంకి నడిచి వచ్చాడొకాయన. **"ఏమేమి కావాలె సామికి పెద్దగుట్ట మౌలాలికి. ఏమేమి కావాలె సామికి మలీద కావాలె సామికి".**

కొమిరెల్లి చూపుల్లో మంట. ఊపందుకున్న మంట. కొమిరెల్లి ఆటలో లేకపోతే వెలితి. కనిపెట్టాడు యాదగిరి. మంకయ్య వెళ్లి బలంగా లాక్కొచ్చాడు. తనకూ ఆడాలనే ఉన్నది. చేతులు పట్టుకొని అడుగులు వేశాడు మంకయ్య. ఆశాలు అలిసిపోతే కొమిరెల్లి అందుకున్నాడు. **"ఓహో జంబియా వొల్లంపల్లి జంబియా - నాతోని మాట్లాడు నాంపల్లి జంబియా"** ఆట జోరుకొచ్చింది. పక్కన యువకుడు పదే పదే ఈలలు వేస్తున్నాడు. కట్టెలు తెచ్చి గుండంలో వేశారు.

మరోపక్క స్త్రీలు మొదలుపెట్టారు ఆట. ఒకరి చేతులు ఒకరు పట్టుకొని వంగుతూ లేస్తూ ఆడుతున్నారు. ఒకామె వినసొంపుగా పాడుతున్నది. **"ఆశన్నూశన్న అన్నదమ్ములూ ఆశన్నా ఊశన్నల్లాల"** పాట దీర్ఘంగా సాగుతుంది.

ఆలువ గుండంల మరెవరో దుంకి ఉరికొచ్చారు. మంట తగ్గుతున్నది. ఆటలో యువకులు పెరిగారు. ఇతర యువకులు కలిశారు. కొర్రాయిలు కదిపారు. కట్టెలు పూర్తయినాయి. ఎవరో వెళ్లి మరికొన్ని కట్టెలు తెచ్చి గుండంల వేశారు. మంట, సెగ తగిలి చెమటలు కారిపోతున్నాయి. ఆట ఆగలేదు. పాట ఆగలేదు.

ఆలువా గుండంలో మంట మందగించింది. కొమిరెల్లి గుండెల్లో



మంట ప్రజ్వరిల్లింది. 'కట్టెలు కావాలి' ఆడుకోవాలనే మురిపెం మరింత పెరిగింది.

యువతుల ఆట ఉడుకెత్తుతున్నది.

యువకుల ఆటకు 'గుండం'ల మంట కొరవడుతున్నది.

'కట్టెల్రా కట్టెలు' గట్టిగా వినిపించింది.

కొమిరెల్లి మనసులో ఏదో మెరిసింది.

దోస్తులతో గుసగుస పెట్టాడు. ఆటలోంచి కొందరు తప్పుకున్నారు. అరగంటలో తిరిగొచ్చారు. చెమటలు కక్కుతున్నారు. హడావుడి చూసి ఒకరొకరు పక్కకు జరుగుతున్నారు.

"ఆలువా గుండంలో చింతమొద్దు"

"అంత మొద్దా... చిన్నగ నరికి వెయ్యండ్రి"

"అవుసరం లేదు. బాగ ఎండి ఉన్నది. అంటుకుంటె వొదులది మంట"

గుండంలో చింతమొద్దు. కొమిరెల్లి వంటి ఎందరినో 'చింత' పెట్టిన మొద్దు. మురిపానికి అడ్డమొచ్చే దుకాణం మొద్దు. శానతనం మొద్దు.

"ఎంత పెద్ద మొద్దో..."

పెద్ద మంట ముందు కొమిరెల్లి దోస్తులు ఆట మళ్లా మొదలుపెట్టారు. ఎంత పెద్ద మొద్దయితే మాత్రం మంటకు ఎంత?

## సాధన పంచకమ్

**వాక్యార్థశ్చ విచార్యతాం శృతిశిర: పక్ష: సమాశ్రీయతాం**
**దుస్తర్కా త్సువిరమ్యతాం శృతిమతస్తర్కోకను సంధీయతామ్।**
**బ్రహ్మైవాస్మి విభావ్యతాం అహరహర్గర్వ: పరిత్యజ్యతాం**
**దేహేకహమ్మతి రుజ్ఝ్యతాం బుధజనైర్వాద: పరిత్యజ్యతామ్॥**

**తాత్పర్యం :** 1. వేదాంత వాక్యములను చక్కగా విచారణ చేయవలెను. 2. వేదాంతము లేక ఉపనిషత్తులు నిర్ణయించిన సిద్ధాంతమునే ఆశ్రయింపవలెను. 3. చెడు తర్కమును విడనాడ వలెను. 4. వేద సమ్మతమైన తర్కమునే (యుక్తినే) అనుసరిపవలెను. 5. నేను బ్రహ్మమునే ఐ ఉన్నాను అని చక్కగా భావన చేయవలెను. 6. ఎప్పటికప్పుడు గర్వమును త్యజింపవలెను. 7. దేహమే నేను అనెడు భావమును విడిచిపెట్టవలెను. 8. బుధజనులతో వాదించుటను మానివేయవలెను.

**వివరణ**

**3. దుస్తర్కా త్సువిరమ్యతామ్ –**

పనికిరాని, అనవసరమైన దుస్కర్కానికి లేక కుతర్కానికి దూరంగా ఉండాలి. తర్కమనేది ఒక శాస్త్రం. తర్కశాస్త్రం లేకుండా తత్త్వశాస్త్రమే లేదు. సత్య నిర్ణయం చేయడానికి ఉపయోగపడే దానిని తర్కం లేదా తర్కశాస్త్రం అంటారు. దారి తప్పించి పెడత్రోవ పట్టించేది దుస్తర్కం లేదా కుతర్కం అని తెలియాలి. అట్లే దుస్తర్కం లేక కుతర్కం చేసేవారితో సాంగత్యం చేయడం కూడా దుస్సాంగత్యమే అవుతుంది. కావున దుస్కర్కాన్ని, దుస్సాంగత్యాన్ని విడిచిపెట్టవలెను.



## జ్ఞాని – ప్రపంచం

## సత్సంగం



జ్ఞాని దృష్టి నుంచి చూస్తే లోకమూ, అందులో అణుమాత్రమైన బాధా కలే. కలలో నీకు కూడా ఆకలి తెలుస్తుంది. ఇతరులకీ ఆకలి వేస్తూండటం చూస్తావు. నీవు తిని, ఇతరుల పట్ల జాలిపడి, వారికి తిండి పెడ్తావు. ఇప్పుడు నీవు చూసే బాధా, ప్రపంచమూ ఎంత వాస్తవమో కల ఉన్నంత సేపూ ఆ ఆకలిబాధా వాస్తవమే. నిద్ర మేల్కొనగానే నీకు తెలుస్తుంది కలలోని బాధ వాస్తవం కాదని. కడుపునిండా భోజనం చేసి పడుకుంటావు. కాని కలలో, రోజంతా కష్టపడి పని చేసినట్టు, అలసిపోయినట్టు, ఆకలిగా ఉన్నట్టూ, బాగా భోజనం చేయాలన్నట్టూ కనబడుతుంది. అప్పుడు మేల్కొంటావు. నీ కడుపు నిండి ఉన్నదనీ, నీవు పక్కమీద నుంచి కదలనైనా కదలలేదనీ గ్రహిస్తావు. అయినా, కలలో నీకు అనిపించే బాధ నిజం కాదని ప్రవర్తింపలేవు కదా. కలలోని ఆకలిని, కలలోని భోజనం తోనే తగ్గించుకోవాలి. కలలో, ఆకలితో ఉన్న తోటి మానవులకు కలలోనే భోజనం పెట్టాలి. మేల్కొని ఉన్న అవస్థనీ కలగాపులగం చేయలేవు. జ్ఞానోదయమై, ఈ మాయని గ్రహించనంత వరకూ, ఎక్కడ బాధ కనబడినా దానిని నివారించటానికి సమాజ సేవ చేయాలి. "నేను చేస్తున్నా" అహంకారం లేకుండా చేయాలి. "నేను ఈశ్వరుని పనిముట్టుని మాత్రమే" అనుకోవాలి. అట్లాగే స్వాతిశయంతో, "నాకంటె తక్కువ వానికి సహాయపడుతున్నాను. వానికి నా సహాయ మవసరముంది. వానికి సహాయపడగల స్థితిలో నేనున్నాను. నేను గొప్ప, వాడు తక్కువ" అనుకోకూడదు. ఆ మనిషిలోని భగవంతుణ్ణి ఆరాధిస్తున్నట్టుగా సహాయపడాలి. ఆ సేవ నీ ఆత్మ కొరకే. ఇంకెవరి కొరకో కాదు, నీకు తప్ప నీవెవ్వరికీ సహాయపడటం లేదు.



నీవు నిద్రలో ఉండగా ఈ లోకంగాని అందులోని క్షోభగాని నీకు తెలియలేదు. ఇప్పుడు మేల్కొని ఉన్న స్థితిలోనే ఆ ఎరుక ఉంది. అవి పట్టని స్థితిలోనే ఉండు. అంటే ప్రపంచం గురించి ఎరుక లేనప్పుడు, ప్రపంచపు బాధలు పట్టవు నీకు. నీవు నిద్రలో వలె ఆత్మలో సంస్థితమైతే ప్రపంచము, దాని బాధలు నిన్నేవిధంగానూ ప్రభావితం చేయవు. అందువల్ల లోపల చూసుకో. ఆత్మని గ్రహించు. అప్పుడు ప్రపంచము, దాని దుఃఖమూ అంతమవుతాయి.

ప్రపంచం బయటలేదు. నీవు తప్పుగా నీ దేహంతో తాదాత్మ్యం చెంది ఉండటం వల్ల ప్రపంచం నీకు బయట ఉన్నట్టు కనబడుతుంది. అందులోని దుఃఖం కూడా కనబడుతుంది. కాని అవి వాస్తవం కావు. సత్యమేదో అన్వేషించు. ఈ అసత్యాన్ని వదిలించుకో.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022

సాహిత్యం ~ వైజ్ఞానిక మూల్యాంకనం

# పాంచ భౌతిక శక్తి 'శాక్తేయం'

**డా. సాగి కమలాకర శర్మ**, ఫోన్ : 9704 227744

సృష్టి మొత్తం పదార్థం, శక్తి అనే రెండు అంశాల చుట్టూ తిరుగుతుంది. పదార్థాన్ని శివునితో, శక్తిని అమ్మవారితో పోల్చడం కవి సంప్రదాయం. నిజానికి పదార్థంలోనూ శక్తి ఉండక తప్పదు. శక్తి మూలమైన ఈ వ్యవస్థలో ముందుగా శక్తి ఆకాశంగా మారుతుంది. ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలం, జలం నుండి భూమి, భూమి నుండి ఓషధులు (వృక్షాలు), ఓషధుల నుండి ఆహారం, ఆహారం నుండి వ్యక్తి పరిణామం చెందుతున్నాడని ఉపనిషత్తులు చెపుతున్నాయి. (ఆకాశాత్ వాయుః, వాయో రగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ, పృథివ్యా ఓషధయః, ఓషధీభ్యోకన్నమ్, అన్నాత్పురుషః). మన సౌరమండలం వరకే గమనిస్తే సౌరమండలం మొత్తంలో వ్యక్తమయ్యే శక్తి వేరు, భూగ్రహంపై ప్రసరించే శక్తి వేరు. భూగ్రహంపై ప్రసరించే సౌరశక్తి పూర్తిగా భూమిపైకి ప్రసరించకుండా భూమి చుట్టూ ఒక అద్భుతమైన కవచం వంటి పొర ఉంది. దానినే ప్రస్తుతం ఓజోన్ పొర అంటున్నాం. దానివల్లనే ఈ భూమి చల్లగా ఉంది. దాని వల్లనే ఇక్కడ జీవజాలం పుట్టి మనుగడ సాగించడానికి అవకాశం ఏర్పడింది. ఇదొక అద్భుతమైన ప్రక్రియ. ఈ వ్యవస్థ ఈ విధంగా ఏర్పడడానికి ఒక ఉన్నతమైన రచన కొనసాగాలి. ఆ రచననే 'కృతి' అని మనం భావిస్తే, ఈ స్పష్టమైన కృతికే 'ప్రకృతి' అని, పంచభూతాలతో నిండిన ఈ వ్యవస్థకే 'ప్రపంచము' అని పేర్లు పెట్టుకున్నాం.

వేదమంతా ఈ పాంచభౌతిక శక్తితో కూడుకున్న ప్రకృతిని, దానిని ప్రభావితం చేస్తున్న సూర్యశక్తిని గూర్చి వర్ణించింది. వేదంలోని అనేక సూక్తాలు ఈ అంశాలను తెలియజేస్తున్నాయి. అటువంటి సూక్తాలలో ముఖ్యమైనది 'శ్రీసూక్తం'. ఈ సూక్తంలోని 'శ్రీ'కారమే పాంచభౌతిక శక్తికి సంకేతంగా ఉంటుంది. వైదిక దేవతలలో శ్రీదేవి, లలిత, లక్ష్మి, పార్వతి వంటి దేవతలందరూ ఈ పాంచభౌతిక శక్తికి అనుబంధమైనవారే. వైదిక దేవతలు కాని, జానపద దేవతలు కాని స్త్రీ దేవతా మూర్తులన్నీ శక్తి స్వరూపాలే. వేదం నుండి నేటి వరకు ఈ శక్తిని ఆరాధించడానికే భాషలో కూడా 'శ్రీమతి, శ్రీవారు, శ్రీయుత, శ్రీకరం, శ్రీ...' మొదలైన శబ్దాలు నిత్యజీవితంలో అనుసరించేటట్లుగా చేసినారు. శ్రీయంత్రం, శ్రీచక్రం అనే పేరు గలిగిన అన్ని అంశాలు ఈ మూల సృష్టి శక్తి, పాంచభౌతిక శక్తిగా విస్తరించి ఈ భూమి చుట్టూ ఆవరించి రక్షణ కవచంగా ఏర్పడిన విధానాన్నే తెలియజేస్తున్నాయి. మూలమంతా ఒక్కటే. అధ్యయనం చేసే విధానాలే వేరు వేరు. ఇదే శాక్తేయంలోని మూల తత్త్వం.



శ్రీసూక్తంలో **'కాంసోకస్మితాం హిరణ్యప్రాకారాం ఆర్ద్రాం జ్వలంతీం తృప్తాం తర్పయన్తీం'** అనే మంత్రానుసారం .... హిరణ్య ప్రాకారం అనే అంశం నేడు మనం మాట్లాడుకునే ఓజోన్ పొర మాత్రమే. భూమి చుట్టూ ఉన్న ఓజోన్ పొర ఒక రకమైన పసుపు, నారింజ వర్ణంలో కనిపిస్తుంది. ఉదయ కాలంలో సూర్యుని వెలుతురును మనం ఆ రంగుల్లో గమనించవచ్చు. అందుకే ఈ ప్రాకారానికి అవతల ఆమె జ్వలంతిగా, లోపల ఆర్ద్రగా కనిపిస్తుంది. తాను తృప్తి చెందుతూ లోకానికి ఆనందాన్ని కలిగిస్తుంది. తాను చంద్రత్వంతో (చల్లదనంతో), బంగారు, వెండి రంగుల కలయిక అయిన హిరణ్మయిగా కనిపిస్తుంది. హిరణ్య ప్రాకారం మనకు రక్షణ కవచం అయితే, హిరణ్యగర్భుడు సూర్యుడు అవుతుంటాడు. పసుపు, నారింజ వర్ణం కలిగిన వర్ణమే హిరణ్యంగా గుర్తిస్తే ఇదంతా తన కడుపులో ఉంచుకున్న వాడు హిరణ్యగర్భుడు. **"హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్"** అనే మంత్రం కూడా ముందుగా హిరణ్య గర్భుడు, తర్వాత పంచభూతాలు పుట్టినాయని తెలియజేస్తుంది. హిరణ్య కశిప, హిరణ్యాక్షులు ఈ ప్రాకారానికి రంధ్రం చేసినవారని కూడా పౌరాణిక కథా సాహిత్యాదులు మనకు తెలియజేస్తున్న వాస్తవాలు. చిన్నగా ఉన్న ఈ పొర నాశనం కాకుండా కాపాడిన అవతారాలు వరాహ, నారసింహ అవతారాలు అయితే,

వామనావతారం ఈ పొరను మూడింతలు పెద్దగా చేసి మానవ జీవన మనుగడకు అవకాశాన్ని ఇచ్చిన అవతారం అవుతుంది. అదే త్రివిక్రమత్వం. భూమిపై జీవులను విస్తరింపజేయడానికి, సౌరశక్తిలో 'బలి' కాకుండా కాపాడటానికి ఏర్పడిన అవతార ప్రతీక వామనావతారం. వామనుడు త్రివిక్రమునిగా మారిన విధానం కూడా ఈ అంశాన్నే మనకు స్పష్టం చేస్తుంది. ఈ సౌరశక్తిలోని వేడిమిని జాగ్రత్తగా మనకు మార్చి అందించేవాడు జాతవేదుడనే అగ్ని స్వరూపం. సాహిత్యాన్ని ఈ మూలరూపంతో కూడుకుని అధ్యయనం చేస్తే దైవ స్వరూపాలన్నీ శక్తి కి సంకేతాలుగానే కనిపిస్తాయి.

విష్ణువు (వ్యాపనశక్తి కలిగినవాడు) కు, శ్రీదేవి, భూదేవి అనే ఇద్దరు భార్యలున్నట్లు పౌరాణిక కథలన్నీ చెపుతుంటాయి. దీనిలో మనం నివసించే భూమి భూదేవి కాగా, మన చుట్టూ ఉండే హిరణ్య ప్రాకారం శ్రీదేవిగా భాసిస్తుంది. ఇదే శక్తి శివ సంబంధ పురాణాలలో పార్వతిగా కనిపిస్తే, శక్తి సంబంధ పురాణాలలో లలితా మాతగా దర్శనమిస్తుంది. సూర్యకిరణాలు వేరు వేరు సమయాల్లో ఈ ఓజోన్ పొర నుండి భూమికి ప్రసారితం అవుతుంటే మార్పులు పొందుతున్న శక్తి వేరు వేరు రూపాల్లో కనిపిస్తుంది. అవే మనం నవరాత్రుల్లో ఆరాధించే రూపాలు.

సృష్టించబడిన జలం దైవ స్వరూపంగా చిక్లీతుడనే ఋషి దర్శిస్తాడు. **"ఆపః సృజంతి స్నిగ్ధాని చిక్లీత వస మే గృహే, నిచ దేవీం మాతరం శ్రియం వా సయమే గృహే"** అనే మంత్రంలో ఈ భావన స్పష్టం అవుతుంది. ఈ ఓజోన్ పొర పై భాగంలో జలం విస్తరించే అవకాశం లేదు. లోపలి భాగంలోనే ఇది రూపుదిద్దుకుంటుంది. భూమి, భూమి చుట్టూ ఉండే ఓజోన్ పొరనే మనవాళ్ళు గృహంగా భావించి, ఇదంతా శ్రేయోదాయకంగా ఉండాలని భావించారు. **"అభూతిం అసమృద్ధించ సర్వాన్నిర్నుద మే గృహాత్"** ఇంతకన్నా అభ్యుదయం ఏముంటుంది?

ఈ భూమి, ఈ ఓజోన్ పొరలు రక్షించబడాలంటే బిల్వ వృక్షాలను పెంచాలనే భావం, వాటి ఫలాలను హోమం చేయాలనే విషయం శ్రీసూక్తం చెపుతుంది. **"ఆదిత్య వర్ణే తపసోఽధిజాతో వనస్పతిస్తవ వృక్షోఽథ బిల్వః, తస్య ఫలాని తపసానుదంతు మాయాంతరాయాశ్చ బాహ్యా అలక్ష్మీః"** అనే మంత్రం పై విషయాలను స్పష్టం చేస్తుంది. శివలింగం భూమి అయితే, శివునిపై బిల్వం, తులసి వంటి పత్రాలు పెట్టి పూజించడం, విష్ణువుకు బిల్వ, తులసీ మాలలు వేయడం.. ఈ ప్రకృతిలో మారేడు (బిల్వం), తులసీ వనాలు బాగా పెంచి, ఓజోన్ పొర పాడుకాకుండా కాపాడటం అనే అంశాన్నే ప్రత్యేకంగా సూచన చేస్తుంది. బిల్వ ఫలాలను శ్రీసూక్తంతో అనుసంధానించి హోమం చేయడం వల్ల కూడా భూమి చుట్టూ ఉండే మాయ (కాలుష్యం) తొలగుతుందని, అలక్ష్మీనిస్సరణం జరుగుతుందని మంత్రం సూచన చేస్తుంది. ఈ సంప్రదాయం వైదికంగా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఈ ప్రకృతిని, ప్రకృతి శక్తిని కాపాడుకోవడం లక్ష్యంగా వైదిక, పౌరాణిక సాహిత్య వ్యాసంగం కొనసాగుతుంది. మనలోని, మనచుట్టూ ఉండే శక్తిని ముందు గమనిస్తే, మనం తీసుకోవలసిన జాగ్రత్తలు, చేయవలసిన ధర్మాలు, విధివిధానాలు అర్థం అవుతాయి. మన సాహిత్యమంతా ప్రతీకాత్మకమే. ఈ ప్రతీకలను గమనిస్తే తప్ప మూలాలు మనకు అర్థం కావు.

లలితాదేవి చిత్రాన్ని మనం గమనిస్తే కూడా ఇదే విషయం తెలుస్తుంది. పడుకున్న శివునిపై తాను కూర్చున్న విధానం, నాలుగు సింహాసనం కోళ్ళకు నలుగురు దైవిక శక్తుల ఆధారం ఉండడం గమనిస్తే పంచభూతాత్మకమైన ప్రకృతి అర్థం అవుతుంది. అందులో పడుకున్న శివుడు భూమికి ప్రతీక అయితే కూర్చున్న అమ్మవారు చుట్టూ ఉన్న ఓజోన్ పొర లోపలి శక్తికి సంకేతం అవుతుంది. అమ్మవారి సహస్రనామాలలో **"పంచ ప్రేతాసనాసీన, పంచ బ్రహ్మాసన స్థితా"** అనే నామాలను బట్టి ఈ అంశాలను మనం పంచభూతాత్మక స్థితిని గమనించవచ్చు. వైదిక సూక్తాలు, పౌరాణిక కథనాలు, సహస్ర అష్టోత్తర శత నామాలు, స్తోత్రాలు, దైవిక రూప చిత్రాలు అన్నీ కూడా ప్రకృతికి, వేరువేరు శక్తులకు సంకేతంగానే మనకు కనిపిస్తుంటాయి. శాక్తేయం అంతా ఈ అంశాన్నే మనకు చెపుతుంది.

లక్ష్మీదేవి అష్టోత్తర శతనామ స్తోత్రాల్లో మొదటి నామాలే **"ప్రకృత్యై నమః, వికృత్యై నమః, విద్యాయై నమః, సర్వభూత హిత ప్రదాయై నమః...."** అంటూ ప్రారంభం అవుతాయి. మరి లక్ష్మీదేవి అంటే ప్రకృతి అనే కదా అర్థం. ప్రకృష్టమైన కృతి – ప్రకృతి; విశిష్టమైన కృతి – వికృతి అవుతుంది. సర్వభూతాలకు మేలు కలిగించేది ఎవరు? ఓజోన్ పొర లోపలి పాంచభౌతిక శక్తి కాదా!! లక్ష్మీదేవినే శ్రీదేవిగా మనం పూజిస్తూ ఉన్నాం. లక్ష్మలు అంటే శుభ లక్షణాలు అని అర్థం. రామాయణంలో లక్ష్మణుడు కూడా అటువంటివాడే. అన్ని శుభ లక్షణాలు కలిగినదే లక్ష్మీదేవి. మనకుండే ఆరోగ్యం, ఆనందం, సంతోషం, సంతృప్తి, ధైర్యం, స్థైర్యం మొదలైనవన్నీ సంపదలకు అర్థం. కొలవలేని సంపదలన్నీ మనలో ఉన్నాయి. మానవమాత్రులు మనలోని కొలవలేని పాంచభౌతిక ప్రాకృతిక సంపదలను వదిలిపెట్టి, కొలవగలిగిన సంపదలు, రూప సంపదలపై దృష్టి కేంద్రీకరించి తమ లక్ష్యాన్ని, ఈ ప్రకృతి తత్వాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. తాము నాశనం కావడమే కాకుండా ఈ ప్రకృతిని కూడా పూర్తిగా పాడుచేస్తున్నారు. విద్యాలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, గజలక్ష్మి, ధైర్యలక్ష్మి మొదలైన నామాలన్నీ లక్ష్మీ స్వరూపాలే. కొన్ని రూప సంపదలు, కొన్ని గుణసంపదలు.

మనలోని మూలశక్తి కూడా పాంచభౌతిక శక్తిగా విస్తరిస్తుంది. మనలో కూడా ఆకాశం, వాయువు, అగ్ని, జలం, భూమి అనే పంచ భూతాలు ఉన్నాయి. మనం చూడాలన్నా, వినాలన్నా, మాట్లాడాలన్నా, రుచి చూడాలన్నా, స్పర్శించాలన్నా, వాసన చూడాలన్నా, తిన్నది

అరగాలన్నా, విసర్జన జరగాలన్నా, శక్తి ప్రసారం శరీరానికి విస్తరించాలన్నా, బాహ్య ప్రకృతికి అంతర ప్రకృతికి సమన్వయం సాధించాలన్నా... అన్నింటికీ ఈ పాంచభౌతిక శక్తులతో అనుబంధం ఉంటుంది. శబ్ద స్పర్శ రూప రస గంధాదులు ... ఈ అంశాల్లో మనకు వినియోగపడే భూత సంబంధమైన తన్మాత్రలు. ఇదంతా ఆధ్యాత్మికం అనుకోవడం అలవాటైంది. అధ్యాత్మికం అంటేనే సూక్ష్మమైన, మనం పరిశోధించలేని విజ్ఞానం. వేరు వేరు శక్తులకు వేరు వేరు రూపాలను ఏర్పాటు చేసుకుందీ భారతీయ వ్యవస్థ. అన్ని శక్తులకు శక్తి రూపాలే అనంతంగా మనకు దర్శనమిస్తుంటాయి. పంచభూతాలను శక్తులుగా, వాటిని గ్రహించగలిగే మన శరీరం, మనస్సులోని అంశాలను శక్తులుగా గమనించే విధానమే శాక్తేయం. శక్తి, అనేక రూపాలుగా మారుతుందనీ, శక్తి నిత్యమనీ, రూపాలు మారుతుంటాయనీ, ఆ శక్తివైపు మనిషిని ప్రయాణం చేయమనీ కోరేది శాక్తేయం.

ఒకే సూర్యశక్తి శరీరానికి డి.విటమిన్ గా (గాయత్రి), వృక్షాలపై ప్రసరించి కిరణజన్య సంయోగ క్రియ నిర్వహించినపుడు అన్నపూర్ణగా, ఈ భూమిలో అనేక రకాల మార్పులు తీసుకుని వచ్చి పెట్రోల్, గ్యాస్, నీళ్ళు, మైన్స్ వంటివి తయారు చేయడానికి సహకరించినపుడు లక్ష్మీదేవిగా, పాంచభౌతిక శక్తి రక్షణ కోసమై లలితా దేవిగా, వెలుగుతో పూర్తి కూడినపుడు జ్ఞానమయమైన సరస్వతీ దేవిగా, అంటువ్యాధులు నివారించి మనిషికి ధైర్యాన్ని సమకూర్చే సమయంలో దుర్గగా, మహిషాసుర మర్దనిగా, రాజరాజేశ్వరిగా రూపాన్ని సంతరించుకుంటుంది. ఆ యా సమయాల్లో ఆ శక్తులకు ఆ పేర్లు పెట్టుకున్నదీ భారతీయ వ్యవస్థ. ఇవే నవరాత్రుల్లో ఆరాధించే శక్తి తత్వాలు. జానపద దేవతలలోనూ అందరిని రక్షించే (ప్రోచే) అమ్మ పోశమ్మగా, మరణానికి అధిదేవత మారెమ్మగా, కాలానికి అధినేత్రి మహంకాళిగా, మహిషాసుర మర్దని మైసమ్మగా... ఇలా ఎందరో జానపద దేవతలూ శక్తి స్వరూపాలుగానే దర్శనమిస్తున్నారు.

ఈ విధంగా శ్రీదేవి, లలిత, లక్ష్మీ మొదలైన రూపాలే కాకుండా అనేక ఇతర స్త్రీ రూపాలన్నీ శక్తిమయమైనవే. ఈ శక్తులు అన్ని చోట్లా విస్తరించేవే. ప్రతి శక్తికీ కృతజ్ఞత చెప్పుకునేందుకు సనాతన భారతీయుల సృజనాత్మక రూపాలే ఈ శాక్తేయ రూపాలు.

ఇంకా జ్యోతిషశాస్త్ర రీత్యా కన్యారాశి శక్తికి సంకేతం. ఆ రాశిలో సూర్యుడు ప్రవేశించినపుడు దేవీ నవరాత్రులు జరగడం సంప్రదాయంగా ఉంది. కన్యారాశిలో సూర్యుని ప్రవేశం తర్వాత, అంతకు ముందు వర్షాదుల వల్ల విజృంభించిన విచ్చలవిడి శక్తి కొంత అదుపులోకి వస్తుంది. శరీరం, మనస్సులు శుద్ధం చేసుకునేందుకు అది ఒక మంచి సమయం. అయితే కన్యారాశికి ముందు ఉండే రాశి సింహ రాశి. ఆకాశంలో సింహరాశి ముందుగా తూర్పువైపున ఉదయించి తర్వాత కన్యారాశి ఉదయిస్తుంది. దీనిని



శాస్త్రవేత్తలు, సాహితీవేత్తలు గమనించి అమ్మవారికి సింహ ధ్వజంగా నిర్ణయించడం జరిగింది. అదేవిధంగా అస్తమయ సమయంలో పశ్చిమ ఆకాశంలో ముందుగా సింహం తర్వాత కన్యారాశి కనిపిస్తాయి. ఆ సమయంలో సింహంపైన ఎక్కి కూర్చున్న అమ్మవారి రూపంలో భావుకునికి కనిపిస్తుంది. అమ్మవారికి సింహవాహనం అని చెప్పడానికి భారతీయ జ్యోతిషంలోని సింహ, కన్యారాశుల వరుస మాత్రమే ఆధారం. ఇది తప్ప మరో మార్గం మనకు కనిపించదు. ఇంకా శ్రీనాథుడు **".... దశ దినంబులు సింహకేతనము నిలిపి, హూణభూమికి దైవమీ ఉత్పలాక్షి"** రాస్తాడు. మన దగ్గరే కాకుండా క్రైస్తవ సంబంధమైన కన్యమేరీ సంబంధమైన చిత్తా నక్షత్ర సంబంధాంశాలు దీనిలో మనకు కనిపిస్తుంటాయి. వీటన్నింటినీ పరిశీలించాలంటే ఆ యా గ్రంథాల లోతులు, గ్రహగతులు, విశ్వ ప్రభావాలను సునిశితంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

ఇలా శక్తి రూపాలను ఎన్నింటినో అధ్యయనం చేయవచ్చు. శక్తి శాశ్వతం. సర్వానికి ప్రతీక. మూల శక్తి విడివడి వేరు వేరు శక్తులుగా పరిణామం చెందుతుంది. ఆ యా శక్తులను మనం గమనిస్తూ, వాటికి ధన్యవాదాలు సమర్పించుకుంటూ ఉండాలి. ప్రత్యేక నమస్కారాలూ తెలియజేయాలి. ఆ శక్తి మనకు అనుకూలమైన పండుగ, ఇబ్బందికరమైతే వ్రతం నిర్వహించాలి. మూలశక్తికీ నమస్కరించాలి. ఆ శక్తి నిండిన పంచ 'భూత' శక్తికీ నమస్కరించాలి. ఆ భూతాలతో కూడుకున్న పదార్థ శక్తికీ నమస్కరించాలి. ఇదే శాక్తేయ అంతర్గతం. అందుకే **'యాదేవీ సర్వభూతేషు శక్తి రూపేణ సంస్థితా నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః'** అంటున్నది దుర్గా సప్తశతి.

**సర్వం శక్తిమయం జగత్.**



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022

# పద్యమనోహరం - 31

**గన్నమరాజు గిరిజామనోహర్ బాబు**

వరంగల్, ఫోన్ : 994 901 3448

**"అతడు ప్రతాపుడే ఒకని అయ్యకు జంకెడివాడు గాడు, యే కృతిని సమీక్ష జేసిన నొకేపరి యందలి మంచి చెడ్డ క చ్చితముగ చెంపపెట్టువలె చెప్పును, తప్పులగప్పుచున్ ముఖ స్తుతులనొనర్పడా తడల సోముని భీముని రామునైననున్"**

ఒక సాహితీమూర్తి మహోన్నత వ్యక్తిత్వాన్ని పద్యబద్ధం చేసి మనకు ఈ పద్యాన్ని అందించిన మహాకవి వానమామలై వరదాచార్యుల వారు. అభినవ పోతనగా గౌరవింపబడిన ఆచార్యులవారి పోతన చరిత్రము ఎంత ప్రసిద్ధమో తెలుగు సాహితీ ప్రపంచానికి తెలిసిన విషయమే. అయితే కేవలం ఒక్క రచనే గాక అనేక ఇతర ఖండకావ్య సంపుటులు, గేయ, వచన కవితా సంపుటులు, నాటకాలు రచించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవి వానమామలైవారు.

సాహిత్యంలోని ఉత్తమ రచనలకు పురస్కారాలను అందించాలన్న సత్సంకల్పంతో కేంద్ర సాహిత్య అకాడమీ నిర్ణయించగానే తెలుగులో తొట్టతొలిసారి ఈ పురస్కారాన్ని అందుకున్న గ్రంథం కీ.శే. సురవరం -



ప్రతాపరెడ్డిగారి "ఆంధ్రుల సాంఘిక చరిత్ర". ఇది మనకు గర్వకారణమైన అంశం. సురవరం వారు నిజమైన ప్రతాపం కలిగిన మహనీయుడు. ఆయన ఏ గ్రంథాన్నైనా సమీక్ష చేసినా విమర్శ చేసినా ఆ రచనలోని మంచిని, చెడును కూడా స్పష్టంగా వివరించి చెప్పే తత్త్వం గలిగిన నిబద్ధత కలిగినవాడు. అవసరమైతే ఎదుటి వ్యక్తికి అది బాధాకరమైనా అందులో నిజం ఉందనుకున్నప్పుడు ఎటువంటి సంకోచాలను పెట్టుకోకుండా నిజాయితీగా వెల్లడించే వాడు. అందులోని దోషాలను కప్పి పుచ్చడం, ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి ముఖస్తుతులు చేయడం వంటివి ఎప్పుడూ చేయని కచ్చితమైన ప్రమాణాలతో వివరించేవాడు. తాను సమీక్షించే గ్రంథమేదైనా, రచయిత ఎంతటి ప్రఖ్యాతుడైనా సరే తాను లెక్క చేయని తత్త్వం కలిగిన సద్విమర్శకుడు కీ.శే. సురవరం ప్రతాపరెడ్డిగారు.

మాన్యులు శ్రీమాన్ వరదాచార్యులవారి ఈ పద్యం ప్రతాపరెడ్డిగారి మహోన్నత సాహిత్య వ్యక్తిత్వాన్ని ప్రకటిస్తున్నదైనా దీంట్లో ఒక సద్విమర్శకునికి ఉండవలసిన అనేక సల్లక్షణాలను ధ్వనింపజేశారు ఆచార్యులవారు. విమర్శకునికి స్వతంత్ర వ్యక్తిత్వంతో బాటు మంచి, చెడ్డలను వివేచించుకోగలిగే శక్తి ఉండాలి. దాన్ని ఎటువంటి సందర్భాల్లోనైనా నిర్మొహమాటంగా చెప్పే తత్త్వం కూడా ఉండాలి. అప్పుడే అతడు సద్విమర్శకుడు, అది సద్విమర్శ అనిపించు కుంటుంది. అంతేకాని తాను సమీక్షిస్తున్న గ్రంథం తనకు ఆప్తుడో, మిత్రుడో అయినంత మాత్రాన అందులోని దోషాలను కప్పిపుచ్చ రాదు. అదేవిధంగా తనకిష్టమైనవాడనో, తన ప్రయోజనాలను నెరవేర్చేవాడనో అతన్ని ముఖస్తుతులతో ముంచెత్తరాదు. అవతలివాడు ఆప్తుడైనా, అధికారియైనా, మరెవ్వరైనా నిజాలు చెప్పడమే తన ఋజుత్వాన్ని చాటి చెబుతుంది. తన జీవితకాలమంతా తాను సంపాదకుడుగా వ్యవహరిస్తు వెలువరించిన మాన్యులు కీ.శే. సురవరం ప్రతాపరెడ్డిగారు ఆచరణలో చూపించి కీర్తినందుకున్న వారు. అందుకే వానమామలైవారు వారిని కీర్తించడంతో బాటు ఉత్తమ విమర్శకుని లక్షణాలను కూడా తెలిపి తెలుగువారికి దిగ్దర్శనం చేశారు.



# భారతీయాకరణ

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయాకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయాకరణ. భారతీయాకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయాకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయాకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయాకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయాకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

### పస్తావన

1969 సెప్టెంబర్ 27న ఢిల్లీలోని "కాన్స్టిట్యూషన్ క్లబ్"లో "ఫోరం ఆఫ్ నేషనల్ ఎఫైయిర్స్" వారు నిర్వహించిన ఒక చర్చా సదస్సులో మాట్లాడుతూ యాథాలాపంగా, దేశ శాంతిని, సమైక్యతను పరిరక్షించడం దృష్ట్యా భారతీయ ప్రజాబుద్ధిని భారతీయాకరించ వలసిన అవసరం ఉన్నదని అన్నాను. బ్యాంకులను జాతీయం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని నేనీ మాటలనడం జరిగినది.

మానవులకు సంబంధించిన అన్నీ అంశాలలోనూ మానవుల వ్యవహార రీతి ప్రధానం కావడం వల్ల, బ్యాంకులూ, పరిశ్రమలూ వ్యక్తుల చేతులలో ఉన్నా, ప్రభుత్వం చేతులలో ఉన్నా గూడా, వాటిని నిర్వహించేవారిలో నిజమైన జాతీయ సాంఘిక ప్రేరణలను కలిగించవలసిన ఆవశ్యకతను గూర్చి నొక్కి చెప్పినాను. ఈ ప్రేరణలు గనుక లోపించినట్లయితే ఈ జాతీయాకరణ పరిస్థితులను ఏ మాత్రం మెరుగుపరచజాలదు. ఎందుకంటే ఆర్థిక జీవితానికి సంబంధించి నంతవరకు, సమాజానికీ, ఉత్పాదనకూ ఉపయోగపడటం దృష్ట్యా పరిశ్రమలమీద, సంస్థలమీద యాజమాన్యం ఎవరిది అనేది అంతగా పట్టించుకోదగిన అంశమేమి కాదు. తక్కిన అంశాలన్నీ ఉభయత్ర సమంగానే ఉన్నాయనుకొన్నప్పుడు ఒక పారిశ్రామిక సంస్థ అధికంగా ఉత్పత్తి చేస్తున్నదా? అన్న అంశం, ఆ సంస్థ ఎవరి యాజమాన్యంలో ఉన్నదనే దాని మీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఉద్యోగస్థుల సామర్థ్యాన్ని పెంచడానికే వారిలో జాతీయ దృక్పథాన్ని పెంపొందించడానికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వవలసి ఉన్నది. తద్వారా, వారు తాము కేవలం వేతనాల కోసమే పనిచేయడం లేదనీ, వ్యాపార సంస్థలను నడపడం ద్వారా బ్యాంకులను నిర్వహించడం ద్వారా సాంఘిక జాతీయ ప్రయోజనాల కోసం పాటుపడవలసి ఉన్నదని భావించే విధంగా చేయవలెనని కోరినాను.

ఆనాటికింకా ప్రజల మనసుల్లో మాయ కాకుండా క్రొత్తగానే ఉన్న అహమ్మదాబాదు కల్లోలాలను ప్రస్తావిస్తూ, అహమ్మదాబాదులో జగన్నాథ దేవాలయాన్ని ధ్వంసం చేసి కల్లోలాలను ప్రారంభించిన వారు నిజంగా జాతీయాకరింపబడి ఉంటే ఎక్కడో జెరుసలెంలో అల్అక్సా మసీదు దహనానికి విరుద్ధంగా అంతటి ఆర్భాటం చేసి ఉండేవారు కాదు. తమ పట్టణంలోని దేవాలయంపై దాడి చేసేవారూ కాదు అని అన్నాను. భారతీయాకరణ అంటే అన్నీ రకాల ఉపాసనా మార్గాలనూ, స్థలాలనూ సమానంగా గౌరవించడం, ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషా వర్గాలకు చెందినవాడైనా వాటి ప్రయోజనా లన్నింటికన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యమీయడం అని నేను వాదించినాను.

అయితే, నేనిట్లా ప్రస్తావించిన ఈ భారతీయాకరణ అన్నది దేశంలో ఇంతగా వివాదాంశమవుతుందని ఆ సమయంలో నేను కలలో గూడా అనుకోలేదు. భారత జాతీయ కాంగ్రెసు స్థాపకులూ, మొదటి రోజులలో ఈ పదాన్ని ఒక సంకుచితార్థంలో– అంటే జాతీయ జీవితంలోని వేరు వేరు రంగాలలో, ప్రధానంగా పరిపాలనా నిర్వహణలో భారతీయులను ఆంగ్లేయుల స్థానంలో నియమించడం అన్న అర్థంలో విరివిగా ఉపయోగించిన విషయం ఒక చరిత్ర విద్యార్థిగా నాకు తెలుసు.

పండిత జవహర్‌లాల్ నెహ్రూ తన “డిస్కవరీ ఆఫ్ ఇండియా” అన్న గ్రంథంలో ఈ పదాన్ని మరింత విస్తృతార్థంలో ఉపయోగించడం కూడా నేనెరుగుదును. విదేశీయమైన వాటిని జాతీయ జీవనంలో “సంలీనం” చేసుకోవడం భారతీయ భావన వారిలో సృష్టించడం అన్న అర్థంలో ఆయన ఈ పదాన్ని ఉపయోగించినారు.

అందువల్ల భారతీయీకరణను గూర్చి నేను మాట్లాడిన దానిని ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తున్నదనీ, అట్లా మాట్లాడినందుకు న్యాయస్థానంలో నా మీద అభియోగం మోపలేననుకొంటున్నదనీ వార్త పత్రికలలో చదివి దిగ్భ్రాంతి పొందాను. దీనివల్ల దేశ వ్యాప్తంగా ఈ విషయం భారతీయీకరణ మీద చర్చలు ప్రారంభమైనవి, ఇంకా ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. దాదాపు దేశంలోని ప్రధాన వార్తా పత్రికలన్నీ ఈ విషయాన్ని గూర్చి వ్యాసాలు, లేఖలూ ప్రకటించినయి. సంపాదకీయాలలో వ్యాఖ్యానాలు కూడా చేసినాయి. లోకసభలో, దాని వెలుపలా ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ, కొందరు ఆమె సహచరులూ ఈ భావనను విమర్శిస్తున్నా గూడ, ప్రజాభిప్రాయం నా దృక్పథానికి దగ్గరగా వస్తుండటం నాకెంతో సంతోషంగా ఉన్నది. ఆమె పక్షానికి చెందిన కొందరు కాంగ్రెసులోని పెద్దలు గూడా దేశభక్తి పూరితము, నిరభ్యంతరము అయిన ఈ భావనను ఆమె ఎందుకు వ్యతిరేకిస్తున్నదో తామేమాత్రమూ అవగాహన చేసుకోలేక పోతున్నామని విశ్వసనీయంగా నాతో అన్నారు. భారతీయీకరణను వ్యతిరేకించడం ద్వారా ప్రధాన మంత్రి ముస్లింలలో భయాందోళనలు కలిగించి, ఆ వర్గాన్ని దుర్వినియోగించుకోదలచుకొంటున్నా గూడా, ఆ వర్గానికి చెందిన కొందరు యువకులు ఈ భావన యొక్క అర్థాన్ని, ఉద్దేశాన్ని గూర్చి గాఢంగా ఆలోచించడానికి ప్రారంభించడం నన్ను మరింత ప్రోత్సాహపరిచింది. ఈ విషయంపై రాజ్యసభలో జరిగిన చర్చలో వివిధ పక్షాలకు చెందిన శ్రీ మహమ్మద్ కరీం భాగ్లా, శ్రీ రాజనారాయణసింగ్, శ్రీ సి.డి. పాండే మొదలైన పెద్దల ఉపన్యాసాలు దేశంలో భారతీయీకరణ భావనకు బలం పెరుగుతున్నదనే అంశాన్ని సూచిస్తాయి. శ్రీమతి ఇందిరాగాంధినే మెట్టమొదట భారతీయీకరించ వలసి ఉన్నదని శ్రీ రాజనారాయణ సింగ్ సూటిగా సత్యం చెప్పినారు.

భారతీయీకరణ భావనా స్వరూపాన్ని నేనర్థం చేసుకున్న విధంగా, భారతీయ జనసంఘం అంగీకరించిన రీతిని వివరిస్తూ నేను చాలా వ్యాసాలు రాసినాను. అయినా గూడా అధికార కాంగ్రెసు పక్షంలోని ఒక వర్గం దాని కూటంలో చేరిన కమ్యూనిస్టులు, మత తత్త్వవాదులూ సమాజంలోని కొన్ని వర్గాల మనస్సులలో భారతీయీకరణ భావనను గూర్చి అనేకమయిన అపోహలు కలిగించేందుకు నిరంతర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిట్లా ఉండగా, ప్రజలను భారతీయీకరించడం ఎట్లా జరుగాలన్న అంశాన్ని గూర్చి అనేక ప్రశ్నలు, ఉత్తరాల ద్వారా చాలా మంది అడుగుతూ ఉన్నారు.

అందువల్ల ఈ ప్రశ్నలకు సమాధానంగా సందేహాలకు నివారకంగా, మున్ముందు ఇంకా ముఖ్యమైన ఈ విషయంపై వాద ప్రతివాదాలకూ, చర్చలకూ వీలుగా ఒక విషయ ప్రతిపాదక పత్రంగా ఈ చిన్ని గ్రంథం భారతీయీకరణను గూర్చి వివరిస్తూ వ్రాయబడింది. భారతీయీకరణ అంటే, నేనేమీ ఉద్దేశిస్తున్నానో, అది ఎందుకు అవసరమనుకుంటున్నానో, దాన్ని ఎట్లా అమలు చేయడానికి వీలున్నదో ఈ గ్రంథంలో వివరించడానికి ప్రయత్నించినాను.

ఈ భావన మౌలికంగా నేను కనుగొన్నదేమికాదు. ఈ అంశం ఈ గ్రంథాంతంలో చేర్చిన అనుబంధాల ద్వారా స్పష్టమవుతుంది. భారతీయ జనసంఘం – రాజకీయరంగంలో ఈ సంస్థకు చెంది ఉండటం నాకొక గౌరవంగా భావిస్తున్నాను. 1952లోనే ఈ అంశాన్ని గూర్చి గాఢంగా ఆలోచించింది. కాన్పూరులో మహానుభావుడైన కీ. శే. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అధ్యక్షతన జరిగిన జనసంఘ సర్వ ప్రతినిధి సమావేశంలో ఈ విషయంపై ఆమోదింపబడిన తీర్మానం ఎంతో అంగీకారయోగ్యంగా, స్పష్టంగా ఉన్నది. దానికి ఆ రోజుల్లో విస్తృత ప్రచారం కూడా కలిగింది. తన కూతురు కన్నా బాగా తెలిసిన పండిత జవహర్‌లాల్ నెహ్రూ ఆనాడు ఈ అంశాన్ని ఏ మాత్రం కూడా ఆక్షేపించలేదు. అధికారాన్ని నిలబెట్టుకొనడానికి ముస్లింల మతతత్త్వ వర్గంలో చేతులు కలుపవలసిన అవసరం ఆయన కూతురుకు ఈనాడున్నంతగా బహుశః ఆయనకు ఆనాడు కలిగి ఉండకపోవచ్చు.

నాకు తెలిసినంతవరకు ఈ గ్రంథంలో ఉదాహరించిన అంశాలన్నీ యథార్థమైనవి, అయితే అభిప్రాయాలు మాత్రం నావి. సాధ్యమయినంత వరకు విషయాశ్రయంగా, హేతుబద్ధంగా ఉండవలెనని ప్రయత్నించినాను. అయితే విషయాశ్రయంగా ఉండే చాలామంది వ్యక్తులు సంపూర్ణంగా ఆత్మాశ్రయాన్నుంచి, వైయక్తికాభిప్రాయ ప్రభావం నుంచి విముక్తులై ఉండలేరనే అంశం నాకు తెలుసు. ఈ గ్రంథం వ్రాయడంలో నా ఉద్దేశ్యం విషయాన్ని గూర్చి పాఠకులకు స్పష్టంగా, బాగా తెలియజేయడమే తప్ప, ఏ వర్గాన్ని నొప్పించడం గానీ, ఎవరి భావాలనూ గాయపరచడం గానీ కాదు.

ఏ ఉద్దేశంతో నేను దీనిని రచించినానో, పాఠకులు గూడా అదే ఉద్దేశ్యంతో ఈ గ్రంథాన్ని పరిశీలించగలరని ఆశిస్తున్నాను. విషయం లోనూ, భాషలోనూ ఎక్కడయినా ఏవైనా లోపాలుంటే గూడా నన్ను క్షమించవలసిందిగా కోరుతున్నాను.

అతి తక్కువ సమయంలో ఈ గ్రంథాన్ని వెలువరించిన యస్. చాంద్ అండ్ కో వారిని అభినందిస్తున్నాను.

న్యూ ఢిల్లీ

మే, 27. 1970

**బలరాజ్ మధోక్**

"భారతీయీకరణ" అంటే ఏమిటి ?

భారతీయీకరణ అన్న భావాన్ని సరిగా అర్థం చేసుకోవలెనంటే మొట్టమొదట భారతదేశమంటే ఏమిటో, దాని స్వరూపమేమిటో తెలుసుకోవడం అత్యవసరం. ప్రత్యేక స్వరూప స్వభావాలు గల భారతదేశాన్ని గూర్చిన పరిజ్ఞానం, భారతీయీకరణను గూర్చి సామాన్యంగా కలిగే సందేహాలనూ, అపోహలనూ తొలగిస్తుంది. దుర్ వ్యాఖ్యానాలలోని నిజాయితీని బయటపెడుతుంది.

భారతదేశం అతి ప్రాచీనమయిన దేశం. దీని భౌగోళిక సీమలు స్పష్టంగా, నిశ్చితంగా ఉండటం విశ్వప్రసిద్ధమే. చరిత్రకందినంత వరకు, ఈ దేశాన్ని ఏకమొత్తంగానే ప్రపంచం గుర్తించింది. భారతీయ సారస్వతంలో ఈ దేశ వైశాల్యాన్ని, సీమలనూ స్పష్టంగా నిర్దేశించిన సందర్భాలు కోకొల్లలు. పురాణాలలోకెల్లా అతి ప్రాచీనమైనది "విష్ణు పురాణం". ఇది వేల సంవత్సరాల క్రితం రచింపబడింది. ఇందులో 'భారత వర్షమును' గురించి–

**"ఉత్తరం యత్ సముద్రస్య – హిమాద్రేశ్చైవ దక్షిణమ్**
**వర్షం తద్ భారతం, నామ – భారతీ యత్ర సంతతి:"**

సముద్రానికి ఉత్తరంగా, హిమాద్రికి దక్షిణంగా భారతవర్షం వ్యాపించి ఉన్నది. దాని సంతతి భారతి – అంటే భారతీయులు అని చెప్పబడింది. ఇంతే కాకుండా భారత భౌగోళిక లక్షణాలనూ, ఇక్కడి ప్రధాన నదులనూ, పర్వతాలను గూర్చి కూడా ఈ పురాణం వివరించింది. హిమాద్రితోబాటు మహేంద్ర, మలయ, ఋక్ష మొదలైన పర్వతాలు ఇందులో పేర్కొనబడినాయి. పైగా ఈ దేశానికి తూర్పున కిరాతులు – ఒక జాతి, పశ్చిమాన యవనులు–గ్రీకులు – ఈ దేశంలో ఆర్యులు నివసిస్తున్నారని కూడా ఈ పురాణంలో చెప్పబడింది.

వాయు పురాణంలో వివరాలు ఇంకా ఎక్కువ చెప్పబడినాయి. గంగోత్పత్తిస్థానం నుంచి కన్యాకుమారి దాకా వ్యాపించి ఉన్న ఈ దేశపు పొడవు వంద యోజనాలని స్పష్టంగా ఇందులో చెప్పబడింది.

**"యోజనానాం సహస్రంతు – ద్వీపోయం దక్షిణోత్తరమ్**
**ఆయతోహ్య కుమారిక్యా–దాగంగా ప్రభావాచ్చయః"**

ఈ విధంగా భౌగోళిక సీమలు స్పష్టంగా నిర్దేశింపబడి ఉన్నా ఈ భారతదేశం అతి ప్రాచీన కాలం నుంచీ ఏక ఖండంగానే గుర్తింపబడుతున్నది. ఇక్కడి ప్రజలు అతి ప్రాచీన కాలం నుంచీ ఈ దేశాన్ని గూర్చి ఈ విధమయిన గాఢ భావనతోనే ఉన్నారు. ఈ దేశానికున్న "భారత" అన్న పేరులో రాజకీయ దృష్టి ఇమిడి ఉన్నది. సముద్రం నుంచి హిమాద్రి దాకా ఈ దేశం మొత్తాన్ని ఏకాధికారంలోకి తెచ్చిన రాజు భరతుడు. ఈ ఏకాధికార సాఫల్యం కారణంగా ఆ సాఫల్యానికి గుర్తింపుగా ఈ దేశం ఆ మహారాజు పేరిట వెలసింది. దేశీయ న్యాయ విధాతలూ సాంఘిక శాస్త్రవేత్తలూ ఈ దేశాన్ని, దాని అన్ని హద్దుల వరకూ ఏకాధికారంలోకి తీసుకు రావడమనేది రాజుల యొక్క న్యాయమయిన ఆకాంక్ష కావలెనని ఉద్దేశించినారు. అయితే అనేక మంది రాజులు ఈ ఆకాంక్ష పూర్తికి పూనుకొన్నా గూడా, కొద్దిమంది మాత్రమే సఫలులు కావడానికి గల కారణాలు ప్రసిద్ధమయినవే, సంపూర్ణంగానో, లేక కొంత అసంపూర్ణంగానో ఈ సాఫల్యం పొందినవారిని గూడా "చక్రవర్తి సామ్రాట్" అని దేశం గౌరవించింది. ఈ సాఫల్యాన్ని సంపూర్ణంగా సాధించిన వారిలో మొట్టమొదటి వాడు భరతుడు. ఆ కారణంగానే ఈ దేశానికి ఆయన పేరు పెట్టబడింది. ఈ విధంగా దేశానికి పేరుపెట్టడం గమనిస్తే ఆనాటి రాజకీయ నీతివేత్తలు, దేశం మొత్తానికి రాజకీయంగా ఏకత్వం సాధించడానికి ఎంతటి ప్రాధాన్యం ఇచ్చినారో స్పష్టమవుతుంది.

అయితే సంపూర్ణమయిన ఈ ఏకత్వం సర్వకాలాలలోనూ సాధ్యం కాలేదనేది చారిత్రక సత్యం. తరుచుగా ఈ దేశం "జనపదాల" రూపంలో విభజింపబడుతూ ఉండేది. ఈ జనపదాలలో కొన్నింట రాచరిక వ్యవస్థ నెలకొని ఉండగా, మరికొన్నింట గణతంత్ర వ్యవస్థ నెలకొని ఉండేది. ఈ దేశంలో ఆంగ్లేయులు రాజకీయంగా ఏకత్వం సాధించినా గూడా, రాచరిక వ్యవస్థ గల దాదాపు 500 సంస్థానాలనూ, వాటి సర్వాధిపత్యాన్నీ వారికి మన్నింపక తప్పలేదు. దాని ఫలితంగా ఈ దేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు, కొన్ని ఆంగ్లేయ పాలిత రాష్ట్రాలూ, వందలకొద్ది స్వతంత్ర సంస్థానాలూ ఉండటం జరిగింది. అయితే దూరదృష్టి, రాజకీయ నీతిజ్ఞత గల సర్దార్ వల్లభాయి పటేల్ కృషి ఫలితంగా అనేక స్వతంత్ర సంస్థానాలు దేశంలో విలీనం కావడం మూలంగా వీటి సంఖ్య చాలా వరకు తగ్గింది. ప్రస్తుత రాజ్యాంగం అమలులోకి వచ్చిన మొదట్లో స్థాయీ భేదాలు గల రాష్ట్రాలు దాదాపు 30 ఉండేవి. ఆ తరువాత రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సంఘం సూచనల ననుసరించి దేశంలో ఈ రాష్ట్రాల సంఖ్య 14కు తగ్గింది. మళ్ళీ 17కి పెరిగింది. ఇంకా తెలంగాణా, విదర్భ మొదలయినవి గూడా ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడితే మళ్ళీ ఈ సంఖ్య 30 దాకా పెరగవచ్చు. ఈ విధంగా రాజకీయంగా పాలనా సంబంధంగా ఎన్నో రకాల విభజనలు సంభవించినా గూడా భారత దేశం ఏకదేశంగానే నిలిచి ఉన్నది. ఈ విషయంలో భారత దేశాన్ని USAతో గానీ USSRతో గానీ పోల్చిచూడటం తప్పు. USA అనేది ఒక సంయుక్త రాష్ట్రం. ఉత్తర అమెరికాలోని 13 వలస రాష్ట్రాల మీద లండన్‌లోని బ్రిటిష్ ప్రభుత్వం తన అధికారాన్ని స్థిరపరుచుకొనే యత్నాన్ని నిరోధించగల సంఘటిత శక్తి కోసం ఆ 13 రాష్ట్రాలు 1774లో ఒక కూటమిగా ఏర్పడేదాక, USA అంటూ ఒక దేశానికి రూపురేఖలు లేవు. ఆ తరువాత ఆ కూటమిలో రాష్ట్రాల సంఖ్య క్రమంగా పెరగడం మూలాన ఈనాటికి 50 రాష్ట్రాల కూటమిగా USA రూపొందింది. USSR విషయంలో గూడా ఇంతే. ఈ విస్తరిస్తున్న కమ్యూనిష్టు సామ్రాజ్యంలో రష్యా అన్నది చాలా చిన్న

భాగం. సైబేరియా, తుజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్ క్రొత్తగా అందులో చేర్చబడినయి. జార్ చక్రవర్తులూ, వారి వారసులయిన కమ్యూనిస్టులూ వీటిని జయించి రష్యన్ సామ్రాజ్య భాగాలుగా చేసుకున్నారు. ఇంతకుమించి వాటికి రష్యాతో మరే విధమయిన సంబంధమూ లేదు. అందువల్ల సోవియట్ యూనియన్ గూడా ఒక సంయుక్త రాష్ట్రం మాత్రమే.

భారతదేశ స్థితి వీటికి పూర్తిగా విరుద్ధం. ఈదేశం వందలాది జనపదాలు – అంటే, రాష్ట్రాలుగా విభక్తమయి ఉన్నకాలంలో గూడా ఈదేశాన్ని, కేవలం ఈ దేశ ప్రజలే గాక విదేశీయులు గూడా ఒకే ఒక ఏకదేశంగానే గుర్తించినారు. జనపదాల సంఖ్యలో పరిమాణంలో గూడా లెక్కలేనన్ని పరిణామాలు కలిగినయి. అయినా భారతదేశం ఒకటిగానే ఉన్నది. భారతీయాకరణను గూర్చి ఆలోచించేటప్పుడు భారతదేశానికి సంబంధించిన ఈ మౌలికాంశాన్ని గుర్తుంచుకొనడం చాల ముఖ్యం.

ఈ దేశానికి చాలా కాలంగా వ్యాప్తిలోకి వచ్చిన పేర్లు మరో రెండున్నాయి. ఒకటి హిందుస్థాన్, రెండు ఇండియా. “భారత” అన్న పేరు వలేగాక, ఈ రెండు కూడా ఈ దేశపు భౌగోళికాంశాన్ని పురస్కరించుకొని విదేశీయుల ద్వారా వ్యవహారంలోకి వచ్చినయి. హిందుస్థాన్ అన్న పేరు పర్షియన్లు మనకిచ్చిన కానుక. క్రీ.పూ. 5వ శతాబ్దంలో పర్షియన్లు మొదటిసారిగా ఈ దేశంలో ప్రవేశించి, ఈ దేశపు వాయువ్యభాగంలో కొంత తమ సామ్రాజ్యంలో కలుపుకున్నారు. ఆ సందర్భంలో వారు ఈ దేశంలో ప్రవహించే సింధూనదీ వైభవాన్ని దర్శించి ముగ్ధులయిపోయినారు. పడమటినుంచి మనదేశంలోకి ఎవరు ప్రవేశించినా, వారి దృష్టిని సింధునదీ వైభవం ఆకట్టుకుంటుంది. సంస్కృత భాషలోని సకారం, పర్షియన్ భాషలో హకారంగా ఉచ్చరించబడుతుంది. ఆ కారణంగా “సింధు” అన్నది “హిందు” అనీ అది ప్రవహించే దేశం హిందుస్థాన్ అనీ, అక్కడ నివసించేవారు “హిందువు”లనీ వారు వ్యవహరించడం జరిగింది.

పర్షియన్ల తరువాత క్రీ.పూ.4వ శతాబ్దంలో అలెగ్జాండర్ నాయకత్వాన ఈ దేశంపై గ్రీకులు దండయాత్ర చేసినారు. వారి ఉచ్చారణలో “సింధు” అన్న పదం “ఇండస్ “అని మారింది. అందువల్ల “ఇండస్” ప్రవహించే దేశం “ఇండియా” అయింది. అక్కడి ప్రజలు “ఇండియన్” లు అయినారు. ఈ విధంగా హిందూ, ఇండియన్ అన్న పదాలకు – వికృతి పదాలకు – మూల ప్రకృతి పద్యం మాత్రమే కాదు అని ఉద్దేశించిన అంశం కూడా ఒకటే సమానమే.

పశ్చిమాసియా ప్రజలకు మనదేశాన్ని గూర్చి ఏమైనా తెలిసిందంటే, అది పర్షియన్లు వారి సారస్వతం ద్వారా మాత్రమే. అందువల్ల పశ్చిమాసియా వాసులకు ఈ దేశం హిందుస్థాన్ అన్న పేరుతో మాత్రమే పరిచితం. ఈ దేశం మీద దండయాత్ర చేసి దేశానికి ప్రభువులయిపోయిన తురుష్కులు–టర్కీవారు–మొగలులూ ఈ దేశాన్ని హిందుస్థాన్ అన్న పేరుతోనే వ్యవహరించినారు. అయితే యూరోపు వారికి మాత్రం ఈ దేశాన్ని గూర్చి ప్రధానంగా గ్రీకులు, గ్రీకు సారస్వతం ద్వారానే పరిచయం కలిగింది. అందువల్ల వారందరూ ఈ దేశాన్ని ఇండియా అనీ, ఈ దేశీయులను ఇండియన్లు అనీ వ్యవహరించినారు. కొలంబస్ ఇండియాకు క్రొత్త సముద్ర మార్గాన్ని ఆవిష్కరించడానికి బయలుదేరినాడు కాబట్టి అమెరికా ప్రధాన భూభాగ సమీపంలోని దీవులను చూచి వెస్ట్ఇండీస్ అని పేర్కొన్నాడు. అంతేకాదు అక్కడి వారిని ఇండియన్లు అని గూడా అన్నాడు. అందువల్లనే, యూరోపు నుంచి వలస వచ్చిన వారి కారణంగా పదోవంతుకు తగ్గిపోయినా గూడా అమెరికాలోని ఆదిమ వాసులు ఈనాటికీ “ఇండియన్లు” అనే వ్యవహరింపబడుతున్నారు. అయితే భారతీయులయిన ‘‘ఇండియన్ల’’ నుంచి అమెరికా ఆదిమవాసులను విభేదించి చూపడానికి మాత్రమే వారికి “రెడ్” అన్న విశేషణం ఆ తర్వాత చేర్చి “రెడ్ ఇండియన్లు” అన్న వ్యవహారం కలిగింది. అందువల్ల భారత – హిందుస్తాన్ – ఇండియా అన్నవి నిశ్చితం ప్రత్యేకమూ అయిన భౌగోళిక సీమలు గల ఒకే దేశం యొక్క వేరు వేరు పేర్లు అనేది స్పష్టం. ఈ దేశంలోని వివిధ జనపదాల పరిమాణాలు వివిధ కాలాల్లో ఎంత మారినా గూడా ఈ దేశీయుల దృష్టిలోనే గాక, విదేశీయుల దృష్టిలోనూ ఈ దేశపు ఏకత్వాన్ని గూర్చి ఏ విధమయిన మార్పు రాలేదు. దేశం ఏక మొత్తంగానే గుర్తించబడింది. భారత– హిందుస్తాన్ – ఇండియా అని వేరు వేరు పేర్లతో వ్యవహరింపబడుతున్న ఈ దేశం, హిమాద్రి, వింధ్య, నీలగిరి మొదలయిన పర్వతాలతో, సింధు, బ్రహ్మపుత్ర, గంగా, కావేరి మొదలయిన నదులతో మధుర, మాయా, (హరిద్వార్) కాశీ, కాంచీ మొదలయిన నగరాలతో విలసిల్లే ఈ దేశం మిగిలిన ప్రపంచం నుంచి స్పష్టంగా గుర్తింపబడే ఒకే ప్రజలకు నివాస భూమి. వీరందరికీ భౌతిక రూపంలో నివాసభూమిగా ఉపయోగపడుతున్న దేశం మాత్రమే ఒకటి కాదు, సంస్కృతీ సంప్రదాయాలు, చరిత్ర గూడా ఒకటే. వీరందరిలో ఏకాత్మత ఉన్నది. ఇవన్నీ ఈ భౌతిక నివాస భూమికి ప్రాణం పోయడమే కాదు, ఈ దేశాన్ని విస్పష్టంగా, విశిష్టంగా సజీవ మూర్తిగా కూడా చేసినయి.

యుగాలతరబడిగా, ఆ సంఖ్యాకులైన ఋషులను, యోధులను, త్యాగులను ఉత్తేజపరిచిన భారత మాతృ స్వరూపాన్ని అర్థం చేసుకోడానికి భారతీయులయిన ఈ ఏకాత్మత, సంస్కృతి సాంప్రదాయాలను, ప్రేరక శక్తిని గూర్చిన స్పష్టమైన పరిజ్ఞానం మరింతగా అవసరం.

సాంఘిక వ్యవస్థ, సంస్కృతి పెంపొందడానికి భారతదేశం ఒక మూలాధారం కలిగి ఉన్నదనే అంశాన్ని ఈ సందర్భంలో మొట్ట మొదట గుర్తించవలసి ఉన్నది. ఆ మూలాధారం నుంచే భారతీయ సంస్కృతి ప్రారంభమయింది. ఇంకా అదే కేంద్రంగా సాగుతున్నది.

అన్నిదేశాల విషయంలోనూ ఇట్లాగే జరుగుతుంది. బ్రిటన్‌లో ఆ దేశాన్ని 5,6వ శతాబ్దాలలో ఆక్రమించిన ఆంగ్లో సాక్సన్లు ఆధునికాంగ్ల జాతికి ఇట్లాంటి మూలాధారమయినారు. అంతేగాని బ్రిటన్‌ను జయించి 4 శతాబ్దాలకాలం తమ చెప్పుచేతల్లో ఉంచుకున్న రోమనులకన్నా ముందు నుంచే అక్కడ ఉన్న ప్రాచీన బ్రిటన్లు మాత్రం కాదు. USSRలో తెల్ల రష్యన్లూ, USAలో అక్కడికి వలస వచ్చి అక్కడి జనాభాలో చిన్న భాగంగా మాత్రమే ఉన్న ఆంగ్లం మాట్లాడే ప్రజలూ ఈ మూలాధారం పొందడానికి కారకులయినారు.

భారతదేశంలో జాతీయతా స్వరూపం, సంస్కృతీ సంప్రదాయాల వికాసం కలగడానికి వైదికార్యులు మూలాధారమయినారు. సింధులోయ నాగరికత ఎవరి ద్వారా రూపొందిందో ఇప్పటికీ తెలియరావడం లేదు. అయితే అది కూడా వైదికార్యుల నాగరికతా సంస్కృతులలోనే విలీనమయిపోయింది. ఇండస్ లిపిని గూర్చి అత్యాధునికంగా జరిగిన పరిశోధనలవల్ల ఆ లిపికి బ్రాహ్మీలిపితో దగ్గరి సంబంధం ఉన్నదనీ బహుశః, ఇండస్ లిపి కుటుంబం నుంచే బ్రాహ్మీలిపి విడివడి ఉంటుందనీ తెలుస్తున్నది.

ఈ సందర్భంలో వైదికార్యుల ఆదిమ నివాసభూమి ఏది? అన్న అంశం అంతగా ప్రధానమయినదేమీ కాదు. అయినా దాన్ని గూర్చి ఒకటి రెండంశాలు చెప్పుకోవచ్చు. వైదికార్యులను గూర్చిన అతి ప్రాచీన సమాచారం ఋగ్వేదంలో లభిస్తున్నది. ఋగ్వేదం బహుశః మానవీయ సాహిత్యంలోనే ఆదిమమయింది. ఆ ఋగ్వేదంలోని అంశాల గూర్చి జరిగిన ఆధునిక పరిశోధనల వల్ల వైదికార్యుల నివాసం మొట్టమొదట సప్త సైంధవమని తెలుస్తున్నది. వేద సాహిత్యంలో వివరింపబడిన పరిస్థితుల బట్టి, అంతరిక సాక్ష్యాలను బట్టి సింధూనదీ వేణికలు- కాబూల్ (కుబ్) స్వత్(సర్వస్తు)లతో సహా ప్రవహించే ప్రాంతం మరియు ఆధునిక భౌగోళిక స్థితిని బట్టి చూస్తే పంజాబ్, కాశ్మీర్, ఆఫ్ఘనిస్తాన్ల భూభాగం వైదికార్యుల ఆదిమనివాసంగా నిరూపితమవుతున్నది. అక్కడి నుంచే మిగిలిన భారత దేశంలోనూ, ఇరాన్, మధ్యాసియా యూరోపులకు క్రమంగా వ్యాపించినారు. ఆర్యుల ఆదిమనివాసం మధ్యాసియా ప్రాంతమన్న సిద్ధాంతాన్ని సర్ విలియం జోన్స్, ప్రొఫెసర్ గిల్స్ ప్రతిపాదించారు. కానీ అందులో నిజం లేదని తేలిపోయింది. వేదసాహిత్యంలో తరచుగా పేర్కొనబడిన కొన్ని చెట్లూ, చేమలూ, జంతువులూ మధ్యాసియాలో, హంగేరి, స్కాండనేవియా మైదానాలలో విరివిగా కల్పించడమే వారి సిద్ధాంతానికి ప్రధానాధారం. ఆ ఆధారంలో భారతీయార్యులు మధ్యాసియా – యూరోపియన్ కుటుంబంవారన్న సిద్ధాంతాన్ని వారు రూపొందించినారు. అయితే వారు చెప్పే ఆ చెట్లూ, చేమలూ, జంతువులూ భారతదేశంలోని సప్త సైంధవ ప్రాంతంలోనూ విరివిగా ఉండనే ఉన్నాయి. మరొకటి వేద సాహిత్యంలోని అంతరిక సాక్ష్యాన్ని బట్టి, భౌగోళిక సమాచారాన్నిబట్టి, వేదభాషా స్వరూపాన్ని బట్టీ ఆర్యుల ఆదిమనివాస భూమి భారతదేశ వాయువ్యప్రాంతం కాకుండా మరొక ప్రాంతమవుతుందనడంలో ఏ విధమయిన న్యాయంగానీ, సామంజస్యంగానీ లేదు. ఋగ్వేదంలో ఉన్న, పేర్కొనబడిన నదులన్నీ ఆ ప్రాంతంలోనే ప్రవహిస్తున్నయి. ఈ సందర్భంలో గమనించవలసిన మరొక ప్రధానాంశం ఉన్నది. ఉత్తర భారతదేశంలోని భాషలన్నింటికీ వైదిక సంస్కృతమే మాతృక. ఇంతకన్నా ప్రధానాంశం మరొకటి ఉన్నది. ఈనాటికీ పంజాబ్ దాని పొరుగున హిమాద్రి ప్రాంతాలలో మాట్లాడబడే భాష వేద భాషాస్వరూపానికి మిక్కిలి దగ్గరగా ఉన్నది. అందువల్ల, గ్రీకులూ, స్కీథియన్లూ మొదలయిన వారి వలె ఆర్యులు గూడా ఈ దేశానికి విదేశీయాక్రమణదారులుగా వచ్చి ఉంటారన్న వాదం నిజానికి నిరాధారమయింది. కేవలం వాదంకోసం ఆర్యులు ఎక్కడి నుంచో ఈ దేశానికి వచ్చి ఉంటారని ఒప్పుకున్నా గూడా, భారతీయ సంస్కృతి నాగరికతలకు వారే మూలాధారమయినారనడంలో వైరుధ్యం ఏమీ ఉండనక్కరలేదు. బ్రిటన్‌ను ఆక్రమించిన ఆంగ్లో సాక్సన్లు ఆధునికాంగ్లజాతి సంస్కృతీ నాగరికతలకు మూలాధారమయినట్లే, భారతదేశంలోనూ ఆర్యులు మూలాధారమయినారనవచ్చు. **(సశేషం)**



**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు–**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

(ప్రపంచ పదులు
– డా. సి. నారాయణ రెడ్డి)

# సుదూర పయనం

స్వప్నావశిష్ట సుదూర బాటసారినై
ఊహాలోక సౌందర్య లోకాన
కానరాని తీరాల్లో
మధురాతి మధురాన
జీవిత మాధుర్య డోలికల్లో
ఊగుతూ
సాగుతూ
వెన్నెల లోకాన విహరిస్తున్నాననుకున్నా
మృగతృష్ణలో మునిగిపోతున్నా
అరిషడ్వర్గాల తమస్సులో
నన్ను నేను అర్పిస్తూ –
గర్విస్తూ –
పైకి నటిస్తూ
ఒక్క కన్నీటి చుక్క
నా బుగ్గన తడుస్తూ జారుతున్న వేళ
నేను ఉలిక్కిపడిన వేళ
కొత్తగా తెలుసుకున్న జీవిత సత్యం
యవ్వన సౌందర్యాదులు మరుగౌతున్న సమయాన
ముదిమిని ముద్దాడుతున్న నేను
కోల్పోయిన సర్వస్వం
ఆబగా కౌగిలించుకోవాలనుకుంటున్నాను
నా గతాన్ని, బాల్యాన్ని
అమ్మని, నాన్నని, కన్న ఊరిని...
ఆనవాలు వెతుక్కుంటూ
ఉన్న ఊరిని వెతుక్కుంటూ
నాగత చిహ్నపు జాడలను
తడుముకుంటూ
పయనమయ్యా బాటసారిలా
ఉన్న ఊరికోసం...
కన్నతల్లి కోసం
మూసిన రెప్పలతో
గాలితో పోటీపడుతూ
మట్టిని ముద్దాడడం కోసం
వేగంగా
శూన్యంలోకి...





డా. జి. వెంకట లక్ష్మి
ఇబ్రహీం పట్నం, ఫోన్ : 99490 59179


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022

# కలోనియల్ (COLONIAL) ఆలోచనా సరళికి అతీతంగా...

**రోచిష్మాన్,** ఫోన్ : 9444012279

భారతావనిలో ప్రణాళికాబద్ధమైన విద్యావిధానం ఇంగ్లిష్ పాలకుల ప్రతినిధి మకాలి (Macaulay, మెకాలె కాదు)కి వేల యేళ్ల పూర్వమే మొదలయింది. గురుకులాలలో విద్యను అభ్యసించడమూ, ఉపాధ్యాయులు, గురువుల దగ్గర కావ్య, వ్యాకరణాలు నేర్చుకోవడమూ, పౌరోహిత్యం, అర్చకత్వం వంటివి నేర్చుకోవడమూ, వృత్తి విద్యలు అభ్యసించడమూ కాకుండా మన దేశంలో విశ్వవిద్యాలయ స్థాయిలో వేలయేళ్ల క్రితమే ప్రణాళికాబద్ధమైన విద్య నేర్పబడింది. కొందరు గుడ్డిగా అనుకుంటున్నట్టుగానూ, చెబుతున్నట్టుగానూ అది ఇంగ్లిష్ వాళ్ల వల్ల మొదలవలేదు.




తక్షశిలా విశ్వవిద్యాలయం 2,500యేళ్ల క్రితంది. ప్రపంచంలోనే మొట్టమొదటి విశ్వవిద్యాలయం. ఈ వ్యావహారిక శకానికి (క్రీస్తుశకం అనడం వాడుకకు దూరమౌతున్నది) పూర్వం 5వ శతాబ్దిలో గాంధార రాజ్యంలో, ఇప్పటి కాందహార్, పాకిస్తాన్ సరిహద్దులో ఈ విశ్వవిద్యాలయం ఉండేది. ఇది మన దేశ విశ్వవిద్యాలయం. ఇందులో వేలాది మంది విద్యార్థులు ఉండేవారు. ఇక్కడ 64 వేర్వేరు విషయాల (subjects) బోధన, అధ్యయనం ఉండేవి. వాటిల్లో శస్త్రచికిత్స, వైద్యం, యుద్ధకళ, రసాయనశాస్త్రం, గణితం, విలువిద్య, ఆర్థిక శాస్త్రం, వ్యాకరణం, సాహిత్యం, సంగీతం, నృత్యం, భౌతికశాస్త్రం, జ్యోతిషం, ఖగోళశాస్త్రం, సైనిక విజ్ఞానం వంటివి ఉన్నాయి. పాణిని, చాణక్యుడు, పంచతంత్రం రాసిన విష్ణుశర్మ ఇక్కడే చదువుకున్నాడు. చంద్రగుప్త మౌర్యుడు ఇక్కడే చదివాడు. కొందరు గ్రీకులు, రోమనులు ఇక్కడ చదివారు. ఈ విశ్వవిద్యాలయాన్ని వ్యావహారిక శకం 5వ శతాబ్దిలో చొరబడ్డ హూణులు ధ్వంసం చేశారని పరిశీలకులు రాశారు. తక్షశిలా విశ్వవిద్యాలయాన్ని ఎవరు నిర్మించారు అన్న విషయంలో స్పష్టత లేదు. పుష్పగిరి విశ్వవిద్యాలయం, దీన్ని వ్యావహారిక శకానికి పూర్వం 2వ శతాబ్దిలో అశోకుడు నిర్మించాడు.

నలందా విశ్వవిద్యాలయం, దీన్ని వ్యావహారిక శకం 5వ శతాబ్దిలో కుమారగుప్తుడు నిర్మించాడు. వేలాదిమంది విద్యార్థులు, వందలాది మంది బోధకులు, వందలాదిమంది ఉపబోధకులు ఉండేవారు ఈ విశ్వవిద్యాలయంలో. ఇక్కడ వైద్యం, విజ్ఞానం, జ్యోతిషం, సాహిత్యం, కళలు, మహాయానబౌద్ధం వంటివి నేర్పబడేవి. 30 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. నాగార్జున, ధర్మపాల, దిఙ్నాగ, శీలభద్ర, కమలకేయ వంటివారు ఇక్కడ ఉపకులపతులుగా ఉండేవారు. 7వ శతాబ్దిలో చైనీస్ యాత్రికుడు షాన్‌జాంగ్ (XuanZang) ఈ విశ్వవిద్యాలయాన్ని సందర్శించాడు. ఇతడి మరోపేరు హ్యూయన్ సాంగ్ (Hiuen Tsang, హువాన్‌త్సాంగ్ కాదు). 1193లో టర్కీ ముస్లిమ్ చొరబాటుదారుడు ముహమ్మది బఖ్తయర్ ఖిల్జీ ఈ విశ్వవిద్యాలయానికి నిప్పంటించి నాశనం చేశాడు అనీ, నిద్రిస్తున్న బౌద్ధసన్యాసుల్ని తలలు నరికి చంపేశాడని చరిత్రకారులు చెప్పారు. ఈ ఖిల్జీ విక్రమశిలా, ఒదంతపురి విశ్వవిద్యాలయాల్ని కూడా ధ్వంసం చేసేశాడు. (మన దేశంలో బౌద్ధాన్ని పూర్తిగా నాశనం చేసింది కూడా ఇతడే) ఇతడికి పూర్వమే 1027లో జగద్దల విశ్వవిద్యాలయం ముస్లిమ్ చొరబాటు దారుల దాడికి ధ్వంసం అయింది.

వల్లభి విశ్వవిద్యాలయం వ్యావహారిక శకం 475 –1200లలో సౌరాష్ట్రలో ఉండేది. ఇక్కడ చట్టం, ఆర్థికశాస్త్రం, వ్యవసాయం, జ్యోతిషం వంటివి బోధింపబడేవి. 12వ శతాబ్ది కాలానికి కాంచిపురం లోనూ ఒక విశ్వవిద్యాలయం ఉండేది. ముస్లిమ్‌ల దాడులలో దాదాపుగా భారతావనిలో 20 విశ్వవిద్యాలయాలు ధ్వంసం అయ్యాయి.

మనదేశంలో 12వ శతాబ్ది వరకూ విశ్వవిద్యాలయాల్లో సాగిన ప్రణాళికాబద్ధమైన విద్యావిధానం ముస్లిమ్ చొరబాటుదారుల దాడుల వల్ల ఒక దశలో లేకుండా పోయింది. ముస్లిమ్ రాజుల పాలనలో దేశంలో అప్పటివరకూ చలామణిలో ఉన్న సాంస్కృతిక, సాంప్రదాయిక విధానాలూ, విద్యావిధానాలూ అల్లకల్లోలం అయిపోయాయి. అటు తరువాత ముస్లిమ్ రాజుల పరిపాలన నుండి దేశంలోని భాగాలు బ్రిటిష్ ప్రభుత్వంలోకి వెళ్లాయి.

"శారీరికంగా భారతీయులే అయినా మానసికంగా వాళ్లను ఇంగ్లిష్ వాళ్లను చెయ్యాలి..." అని అప్పటి ఈస్ట్ ఇండియా పాలకులకు మకాలి ప్రతిపాదన చేశాడు. ఆ ప్రతిపాదన ప్రాతిపదికగా 1835లో మన దేశంలో ఒక విద్యావిధానం అమలులోకి తీసుకు రాబడింది. ఇంగ్లిష్ వాళ్ల విద్యాప్రణాళిక మన ఆలోచనావిధానంపై వాళ్లకు కావాల్సిన ప్రభావాన్ని తీసుకొచ్చింది.

ISSN 2457-0796

UGC Care List Approved Journal

మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022




ఇవాళ మనదేశంలో చదువుకున్నవాళ్లు అని అనబడుతున్నవాళ్లు విద్యావిషయంగా, సాంస్కృతికంగా, ఆపై చారిత్రికంగా కలోనియల్ (colonial) ఆలోచనాసరళితో వ్యవహరిస్తున్నారు. ఇంగ్లిష్ వాళ్లు చూపిన తప్పుడు విధానానికి బలై, వాళ్లు చూపించిన విధానంలో మనల్ని మనం చూసుకుంటూ పెద్ద తప్పు చేస్తున్నాం. ఈ కలోనియల్ ఆలోచన వల్ల మన చరిత్ర మనకు కనిపించదు. అందువల్ల అసలు మనకు చరిత్రే లేదని ప్రగాఢంగా నమ్ముతాం. శోచనీయం ఇది. చైనీస్ యాత్రికుడు షాన్‌జాంగ్ కంచి వరకూ ప్రయాణించి భారతావనిలో నెలకొని ఉన్న విస్మయకరమైన విద్యావిధానాన్ని ప్రస్తుతించాడు. ఇక్కడి సంస్కృతిని ప్రశంసించాడు.

తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాల కాలానికి ఇంగ్లిష్ రాజ్యం లేదు. మకాలి లేదు. మనకు విద్య మకాలి వల్ల రాలేదు. మకాలి వల్ల ఇంగ్లిష్ వాళ్లకు కావాల్సిన విద్య మనకు వచ్చింది. రామకృష్ణ మఠానికి చెందిన స్వామి హర్షానంద వంటి వాళ్లు కొన్ని దశాబ్దుల క్రితమే ఈ విషయంపై అవగాహన కలిగించేట్టు తెలియజెప్పారు. ఇవాళ్టికీ మనలో కొందరు ఇంగ్లిష్ పాలన వల్లే మనకు విద్య వచ్చింది అనీ, అసలు మనదేశంలో చదువు అనేదే లేదు అనీ అనుకోవడం, అనడం వాస్తవ విరుద్ధం. ఆపై అవగాహనారాహిత్యం. మన దేశంలో విద్య ఒక వర్గానికి మాత్రమే పరిమితం కాలేదు. పైన చెప్పబడిన విశ్వవిద్యాలయాల్లో శ్రద్ధ ఉండే అన్ని వర్గాల ప్రజలూ విద్యను అభ్యసించేవారు.

స్వామి వివేకానంద మన దేశంలో ఇంగ్లిష్ వాళ్లు ప్రవేశపెట్టిన విద్యావిధానంలోని ఆంతర్యాన్ని బయట పెట్టారు. ఈ విద్యావిధానంపై స్వామి వివేకానంద చెప్పినవి ప్రతి ఒక్కరూ చదవాలి. ఈ విద్యావిధానంలోని అపాయం అర్థమవుతుంది.

మనల్ని మనకే కాకుండా చెయ్యడానికీ, మన మధ్య చిచ్చు పెట్టడానికి విద్య ద్వారా ఆర్య, ద్రావిడ భేదాన్ని సృష్టించారు. సరైన ఆధారం చూపకుండా ఆర్య, ద్రావిడ ఆలోచనను మనలో కలిగించింది ఇంగ్లిష్ మేధ. ఆర్య, ద్రావిడ భేదం ఒక అబద్ధం అని మొదట గుర్తించింది స్వామి వివేకానంద. అటు తరువాత బాలగంగాధర తిలక్ విస్తృతమైన పరిశోధనలు చేసి ఆర్య, ద్రావిడ భేదం కల్పితం అని సహేతుకంగా తెలియజేశారు. ఈ ఆర్య, ద్రావిడ అసత్యాన్ని బట్టబయలు చేస్తూ ఎన్నో గొప్ప రచనలు వచ్చాయి. Aryan Dravidian theory ఒక abandoned theory అని Oxford Dictionary స్పష్టంగా చెప్పింది. కాలంలో వాస్తవాలు నమోదయ్యాక ఇంగ్లిష్ వాళ్ల Oxford Dictionary వాస్తవాన్ని తెలియజేస్తోంది.

మకాలి విద్యావిధానం వల్ల మనం పెడత్రోవ పట్టాం. మకాలి ఒక విద్యావిధానాన్ని మనదేశంలో ప్రవేశపెట్టి మానసిక బానిసల్ని సాధించగలిగాడు. దేశానికి స్వతంత్రం వచ్చినా మానసికమైన, ఆపై ఆలోచన పరమైన స్వతంత్రం పొందలేక, ఇంకా చింతన పరంగా బానిసత్వాన్ని నింపుకున్న వాళ్లు ఉన్నారు అంటే అది మకాలి విద్య ఫలితమే. సరైన వాటిని చదవకపోవడం, సరిగ్గా చదవకపోవడం, చదివిన వాటిని అర్థం చేసుకోలేకపోవడం మన మేధావులకు ఇతడి వల్లే వచ్చింది. బ్రిటిష్ పాలనలో మనపై రుద్దిన విద్యా ప్రణాళికకు రూపశిల్పి, ఇవాళ్టి మన మేధావుల్ని మానసిక బానిసల్ని చేసిన మకాలికి ఇంగ్లండ్‌లోనే వాస్తవాల్ని వక్రీకరించినందుకుగాను చట్టపరంగా శిక్ష పడింది! Macaulay, Thomas Babington, 1st Baran Maculay (1800- 59) a convicted historian.

మనదేశంలో ఉద్యోగ విరమణ చేసి (1848) ఇంగ్లండ్ వెళ్లి స్థిరపడ్డాక ఒక దశలో ఇతడు చేసిన లేదా చెప్పిన తప్పులకు ఇతడికి ఇంగ్లండ్‌లోనే శిక్షపడింది. చారిత్రిక తప్పులకూ, సత్యాన్ని బలిచేసినందుకూ శిక్షపడిన చరిత్రకారుడు మకాలి. “Macaulay has been convicted of historical inaccuracy, of sacrificing truth ....” అని ‘Chambers Biographical Dictionary’ లో చెప్పబడింది. ఇతడు తన దేశంలోనే వాస్తవాల్ని వక్రీకరించినందుకు గాను చట్టపరమైన శిక్షను అనుభవించాడు అంటే ఇతడు ఎలాంటివాడో తెలిసిపోతుంది. దీనిని బట్టి మనదేశంలో విద్యావిషయంగా ఇతడు ఏం చేసుంటాడో అర్థం చేసుకోవచ్చు.

మనవాళ్లు మానసికంగానూ, విద్యావిషయంగానూ ఇంగ్లిష్ బానిసత్వం నుంచి విముక్తులవాలి. కాలం చెల్లిన పాత తప్పుల నుంచి మనం బయటపడాలి. కలోనియల్ ఆలోచనాసరళికి అతీతంగా వాస్తవాల్ని మనం మెదడుకు ఎక్కించుకోవాలి. మన భావితరాల్ని మనలా సాంస్కృతిక, చారిత్రిక అనారోగ్యం బారిన పడకుండా మనం రక్షించుకోవాలి. మన దేశ భవిష్యత్తు సరిగ్గానూ, క్షేమంగానూ ఉండాలి.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022

# భాషావేత్తల స్రష్ట ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మ

డా. కాచాపురం దుర్గాదేవి, ఫోన్ : 78930 93495

ప్రముఖ విమర్శకులు, ప్రసిద్ధాంధ్ర సంస్కృత విద్వాంసులు, కవి, వైయాకరణులు, బహుముఖ ప్రజ్ఞాశాలి, చరిత్ర పరిశోధకులు , జ్యోతిష పండితులు, న్యాయవాది, ప్రాచ్య విద్యాపరిషత్ వ్యవస్థాపకులు, కాకతీయ విశ్వవిద్యాలయంలో డీన్‌గా వ్యవహరించి, ఉస్మానియా యునివర్సిటీలో తెలుగు శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ పొందినవారు డా॥ ఆచార్య యోగిరాజ అమరేశం రాజేశ్వరశర్మ గారు.

1930లో కామారెడ్డిలో జన్మించిన డా॥ రాజేశ్వర శర్మగారు 1951లో అధ్యాపకత్వాన్ని ప్రారంభించి మొన్నమొన్నటి వరకు తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిష పాఠాలను బోధించి, వారు విద్యనభ్యసించిన కొవ్వూరు సంస్కృతాంధ్ర విద్యాపీఠంలో 92 ఏళ్ల వయస్సులో నేటికీ అధ్యాపకత్వాన్ని స్వచ్ఛందంగా, నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు.

వీరి 28వ ఏట 1958లో **"నన్నెచోడుని కవిత్వము"** అనే పేరుతో కుమారసంభవ కావ్య విమర్శను రచించారు. ఇది ఆనాటి సిద్ధాంత గ్రంథాలకు ఏమాత్రం తీసిపోనిది. నన్నెచోడుని మతమూ, ఆనాటి మత స్థితులూ, భాషా స్థితులూ, ప్రబంధలక్షణాలు, వస్తు కవిత, జానుతెలుగు, షష్ఠ్యంతాలు, పూర్వ సంస్కృత కవుల ప్రభావము మొ॥ అంశాలు సమగ్రంగా వర్ణించినారు.

నన్నెచోడుని కుమార సంభవం దశమాశ్వాసంలోని **'దారిద్ర్య నిద్రావణా'** అను మకుటంతో గల పది పద్యాలు తెలుగులో శతక వాఙ్మయానికి ప్రారంభమని సాధికారంగా ప్రకటించినారు. **"కుమార సంభవము ఆంధ్రభాషలోని ప్రథమ ప్రబంధము"** అని 'మహాకావ్యము' అని విద్యార్థి దశలోనే నిర్ధారించి ప్రకటించిన తీరు పండితులతో ప్రశంసలనందుకున్నది. లక్ష్మణయతీంద్రుల వారు **"ఒక కావ్యాన్ని సమగ్రంగా విశ్లేషించడం ఎలాగో చూపించిన ఒజ్జబంతి"**గా పేర్కొన్నారని బేతవోలు రామబ్రహ్మం గారు తెలిపినారు.

**వేదం వేంకటరాయశాస్త్రి రూపక సమాలోచనం** వీరి విశిష్ట రచన. ఇందులో నాటక భాష, ప్రతాప రుద్రీయ ఇతివృత్తము, సంభాషణలు నడిపిన విధానము, శాస్త్రిగారి కవితా ప్రతిభ, ఉషా నాటకము, బొబ్బిలి యుద్ధములను విమర్శించినారు. **వేదం వేంకటరాయశాస్త్రి వ్యాఖ్యానములు** వీరి మరొక రచన. శాస్త్రిగారి వ్యాఖ్యానాలను కూలంకషంగా విమర్శించిన పుస్తకమిది. ఇందులో సందర్భోచితంగా మల్లినాథసూరి వ్యాఖ్యాన విధానానికి మల్లినాథుడే పేర్కొన్న మూడు విధానాలను విశేషంగా వివరించారు.

సంస్కృతాంధ్ర వ్యాకరణాలలో అసామాన్య పరిజ్ఞానం గల వీరి డాక్టరేటు పట్టా సిద్ధాంత గ్రంథం **ఆంధ్రవ్యాకరణ వికాసం.** ఆంధ్ర



శబ్ద చింతామణి మొదలు వ్యావహారిక భాషా వ్యాకరణం వరకు అన్ని రకాల వ్యాకరణాలను పరిశోధించి రచించిన ఈ గ్రంథం రెండు సంపుటాలుగా ప్రచురితమై ప్రామాణిక గ్రంథంగా నిలిచింది. **అహోబల పండితీయాంధ్ర వివరణము, వైకృత చంద్రికాంధ్ర వివరణము** గ్రంథాలు వీరికి వ్యాకరణంపై గల మక్కువకు పాండిత్యానికి సాక్ష్యాలుగా నిలుస్తాయి.

ప్రక్రియాపరంగానూ, వస్తుపరంగానూ విభిన్నమైన వీరి రచన **'సాయి సచ్చరిత్ర ముక్తావళి'.** ముత్యాలసరాలలో కూర్చిన గేయ ప్రబంధం. అన్నాసాహెబుదభోల్కర్ (హేమాదిపంతు) మరాఠీలో రచించిన సాయి సచ్చరిత్ర దీనికి మూలాధారం. ఈ గేయ ప్రబంధం ఏ సంగీత పరిజ్ఞానం లేకపోయినా ఒంటిరిగాను, సాముహికంగాను పాడుకోవడానికి పారాయాణ నియమానికి అనుకూలమైనది. ఇంతటి వైయాకరుణులు అద్వితీయ భాషా ప్రాభవ పాండిత్యం కలిగిన వీరు జ్ఞాన భక్తి పారవశ్యాలను కలిగించేదిగా ఉన్న సుబోధక సరళ గేయ ప్రబంధాన్ని అందించడం ఆశ్యర్యాన్ని కలిగిస్తుంది.

నాలుగు రూపకాల చారిత్రక గ్రంథము **చరిత్రపుటలు.** చిన్నదిగానే అనిపించినా పలు కోణాలలో ఎన్నో ఆధారాలతో చారిత్రక లోతులను, సత్యాలను ఆవిష్కరించిన పుస్తకమిది. 'పొదనం' నాటకంలో పోదనం బోదనం-బోధన్‌గా మారినట్లు క్రీ.పూ. ఒకటి రెండు శతాబ్దాలలో జైనముని రచించిన 'దసభత్తి' అను ప్రాకృత గ్రంథంలో పోదనపురం పవిత్ర తీర్థ స్థలమని తెలిపినట్లు నిరూపించినారు. ఋషదేవునికి బోధను రాజధాని యని జైన తీర్థకరుల్లో మొదటివాడయిన ఋషభదేవుని రెండవ కుమారుడు బాహుబలి పోదన

పూరాధీశుడని మహాబలి తరువాత బకాసురుడు ఈ ప్రాంతాన్ని పాలించాడని బకాసురుడిని భీముడు చంపింది ఇక్కడేనని తెలిపినారు.

'ఇందూరు' నాటికలో విష్ణుకుండిన ఇంద్రవర్మ నిర్మించిన నగరం ఇంద్రపురి. ఇంద్రపురమే క్రమంగా ఇందూరుగా మారడాన్ని విష్ణుకుండినుల రాజధాని అమరావతి కాదని, తుమ్మలగూడెం శాసనం మొ॥వాటి ఆధారంగా చర్చించినారు. చివరి రూపకం 'కౌలాసం' గురించి కాకతి రుద్రమదేవి పాలనలో కాకతి రాజ్యాంతర్గతమైన కౌలాసకోట సైనిక స్థావరంగా ఉండేదని కాకతీయ రాజ్య పతానానంతరం ఢిల్లీ సుల్తానుల పాలనలో కొంతకాలం ఉండి తిరిగి ముసునూరి కాపయ నాయకుని ఆధీనంలోకి వచ్చిన విషయాన్ని విద్యానాథుని ప్రతాపరుద్రీయంలోని శ్లోకాలను ఉటంకిస్తూ శాసనాధారాలతో రచించారు.

రాజేశ్వరశర్మగారి ఆత్మకథ **ఆత్మనివేదనం.** ఆనాటి విద్యావిధానాలు సామాజిక చిత్రణ జీవన విధానాలు ఉద్యమాలు మొ॥ అనేక అంశాలతో తక్కువ నిడివిలోనే విస్తృత విషయాలను అందిస్తుంది.

వినోబా వంటి ఉద్యమకారులు పి.వి.నరసింహారావు వంటి రాజకీయవేత్తలు ఉద్దండ పండితులు సాహితీదిగ్గజాలు మొదలుకొని పాలేరుమల్లయ్య ఆసామి మాదిగ రాజయ్యల వరకు ఎందరినో పాఠకులు చదువుతారు. 1930 నుండి 1951వరకు బాల్యం విద్యాభ్యాసాలను ఆత్మనివేదనం – ఆదిపర్వంగాను, 1951 నుండి 1989 వరకు ఉపాధ్యాయునిగా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించి ఉస్మానియాలో శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ పొందేవరకు ఆత్మనివేదనం– ఉద్యోగపర్వంగాను వెలువరించారు. ఉత్కంఠ భరిత ఘట్టాలు వీరు దాటిన మైలురాళ్లు సాహసోపేత నిర్ణయాలతో వారిని వారు మలుచుకున్న తీరు ఆసాంతం అలవోకగా చదివించి రాబోయే ఆత్మనివేదనం శాంతిపర్వ భాగానికై ఎదురుచూసేలా చేస్తుంది.

ఇవే కాకుండా అముద్రితాలయిన సంస్కృత రచనలు రేడియో ప్రసంగాలు, సెమినార్ పేపర్లు పత్రికావ్యాసాలు అసంఖ్యాకాలు. వీరి రచనలలో సాహిత్య చారిత్రక వ్యాసాలతో పాటు "వ్యవసాయికుల నిత్యజీవితంలో జ్యోతిషం" వంటి జ్యోతిష సంబంధ వ్యాసాలు ఉండడం విశేషము.

ఆచార్యుల జ్ఞానతృష్ణకు బహుముఖీన కార్యరంగాలకు నిదర్శనంగా నిలిచేది వీరు న్యాయవాదిగానూ కొనసాగడం. యూనివర్సిటీ ఆచార్య పదవిలో ఉన్నప్పుడే ప్రత్యేక అనుమతితో 55 ఏళ్ల వయసులో యల్.యల్.బి డిగ్రీని పొందినారు. వారు స్థాపించిన ప్రాచ్య కళాశాలకు సంబంధించిన ఒక కేసు విషయంలో తానే వకీలుగా హైకోర్టులో హాజరయినారు. పదవీ విరమణానంతరం కామారెడ్డిలో హైదరాబాద్‌లోను లా ప్రాక్టీసు చేసినారు.

1945లో వరంగల్‌లో గాంధీని దర్శించుకొని గాంధేయ మార్గానికి అనునాయులయినారు. 1946లో ప్రప్రథమంగా ముందుండి కామారెడ్డిలో గణపతి వనరాత్రోత్సవాలను ప్రారంభించడం సాహసోపేతమయినది. 1955–56లలో తాండూరు, కొడంగల్ తాలుకాలను కర్ణాటకలో కలుపవద్దని ఉద్యమించి మెమోరాండమ్‌లను సమర్పించడం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం మొ॥వి రాజేశ్వర శర్మగారి రాజకీయ ఉద్యమాల ప్రధాన ఘట్టాలు.

శారదా మంజీరము, పోతనభాగవత పంచశతి నీరాజనము, పోతన పంచశతి స్మారికలకు సంపాదకత్వం వహించినారు. డా॥ యన్.గోపి, డా॥ కీ.శే.అవధానం రంగనాథ వాచస్పతి మొ॥సాహితీ ప్రముఖులు వీరి పర్యవేక్షణలో వ్యాసరచన చేసి డాక్టరేటు పట్టాను పొందినవారిలో ఉన్నారు.

రాజేశ్వర శర్మగారి కార్యరంగంలో ప్రధానమయినది తెలంగాణలో తెలుగు భాషను ప్రదీప్తం చేసిన ప్రాచ్య విద్యా పరిషత్తు, అత్యంత ప్రభావవంతమై తెలంగాణలోని అధిక ప్రాంతాలలో సాహితీ ప్రాభవాన్ని సుస్థిర పరిచిన ప్రాచ్య విద్యా పరిషత్తును 1968 నుండి విరామ మెరుగని కృషి చేసి1971లో వీరి స్వగ్రామమయిన కామారెడ్డి పట్టణంలో స్థాపించినారు. వీరు స్థాపించిన పరిషత్తు ప్రాచ్యకళాశాల, ఓరియంటల్ హైస్కూల్‌లను నడపడంతో పాటు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం గ్రంథాల ప్రచురణ కూడా చేస్తున్నది. సాయం ప్రాచ్య కళాశాలలో విద్యనభ్యసించిన వారు కోకొల్లలుగా రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాషోపాధ్యాయులుగాను ఇతర ప్రభుత్వ ఉద్యోగాలలోను స్థిరపడ్డారు. రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షులు అయాచితం శ్రీధర్ సాహితీవేత్తలు డా॥వి.ఆర్. శర్మ, ఈ కళాశాలలోనే విద్యనభ్యసించి చాలాకాలం కళాశాల ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన సాహితీమూర్తి అమరేశం ప్రభాకర్‌రావు, మెంగవరం పవన్, అవధానులుగా ప్రసిద్ధులయిన డా॥ బెజగామ రామమూర్తి, డా॥ గణపతి అశోకశర్మ, డా॥ బ్రోచ్కుర్ ఓంప్రకాశ్, కవయిత్రి తిగుళ్ళ అరుణకుమారి, తల్లావజ్జల మహేశ్‌బాబు, టి.యస్.పి.యస్.సి. సభ్యురాలు సుమిత్రానంద్. యువసాహితీవేత్తలు డా॥ అట్టెం దత్తయ్య, మల్లెగోడ గంగా ప్రసాద్, మేకల రామస్వామి మొ॥లు వారెందరినో ఈ కళాశాల అందించింది.

ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మగారు సాయం ప్రాచ్య కళాశాల స్థాపన, అధ్యాపనము, రచనా వ్యాసంగాల ద్వారా తెలుగుభాషకై చేసిన కృషి సారస్వత సేవల గురించి ఎంత చెప్పినా స్థాలీపులాక న్యాయమే అవుతుంది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022

# తెలంగాణ దేవాలయాలు – పుట్టుపూర్వోత్తరాలు : విభజన

**ఆర్. నరహరి,** పరిశోధక విద్యార్థి, చరిత్ర విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9985109791

ప్రపంచంలోని మరే దేశానికి లేని విశిష్టత భారతీయ దేవాలయ వ్యవస్థకు ఉంది. తెలంగాణలో కూడా దేవాలయ వ్యవస్థ ప్రజా జీవనంపై బలంమైన ప్రభావం చూపింది. ఒక్క మాటలో చెప్పాలంటే **"తెలంగాణలో బడి లేని ఊరు ఉండవచ్చుగాని, గుడి లేని ఊరు మాత్రం చూడలేము!"** అనేంతగా దేవాలయ వ్యవస్థ ప్రభావితం చేసింది. తెలంగాణలో ముఖ్యంగా క్రీ.శ. 8 నుంచి 13 శతాబ్దాల మధ్య దేవాలయాలు అనేక మార్పులకు, చేర్పులకు గురై కాలగమనంలో పరిణామం చెంది నేటిదశకు చేరుకున్నాయి. ముఖ్యంగా మధ్యయుగ తెలంగాణ జీవన సరళి, సంస్కృతి – నాగరికత, సమస్త కార్యకలాపాలు, దేవాలయాల చుట్టు పరిభ్రమించాయి అంటే అతిశయోక్తి కాదు. దేవాలయాలు ఆనాడు ఆధ్యాత్మిక కేంద్రాలే గాక ఆట పాటలు లాంటి వినోదాలతో పాటు విజ్ఞానాన్ని అందించే సాంస్కృతిక కేంద్రాలుగా, విద్యను అందించే విద్యాలయాలుగా, సభలను జరిపే సభ వేదికలుగా, నేరాలను విచారణ చేసే న్యాయస్థానాలుగా మొదలైన కార్యకలాపాలతో తెలంగాణ జీవన విధానంపై ఎంతగానో ప్రభావితం చేసిన, తెలంగాణ దేవాలయాలు పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడం ఎంతో ఆసక్తిని కలిగిస్తుంది.

## తెలంగాణ దేవాలయాలు పుట్టుపూర్వోత్తరాలు

భారతదేశానికి మూల నాగరికతగా భావించబడుతున్న సింధూ నాగరికతలో అమ్మ తల్లి మరియు పశుపతి వంటి మొదలైన ఆరాధించే కళాఖండాలు చెక్కడంతోనే దేవాలయాల నిర్మాణం పురుడు పోసుకుంది. **"లిపి పుట్టుకతో నాగరికత ఆరంభమైనదని"** ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ పురాతత్త్వవేత్త గార్డెన్ చైల్డ్ చెప్పాడు. అట్లాగే ఆరాధించే కళాఖండాలు చెక్కడంతోనే దేవాలయాల నిర్మాణం ఆరంభమైనదని చెప్పవచ్చును. ఉదాహరణకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన క్రీ.శ.8వ శతాబ్దానికి చెందిన ఎల్లోరాలోని కైలాస నాథ దేవాలయం ఒక పెద్ద కొండరాయిని దేవాలయంగా చెక్కడం గమనించదగ్గ విషయము.

తెలంగాణలో బృహత్ శిలాయుగ సంస్కృతితో నిర్మాణ వ్యవస్థకు పాదులు పడ్డాయి. తెలంగాణలో బృహత్ శిలాయుగ నిర్మాణాలు అనేకం ఉన్నాయి. చనిపోయినవారిని భూమిలో పాతిపెట్టి, గుంతను పూడ్చి పెద్ద పెద్ద రాళ్ళను అమర్చడం వలన బృహత్ శిలాయుగం అన్నారు. నాటి వరంగల్ ప్రాంతం కాటారం, నాటి ఖమ్మం ప్రాంతం గలభగూడెం వద్ద క్రీ.పూ.5వ శతాబ్దానికి చెందిన శిలువ ఆకారపు శిల్పాలను ఇటీవల కనుక్కోవడం జరిగింది. అయితే నాటి మహబూబ్‌నగర్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని చిన్న మారురు వద్ద ఒక సమాధి రాతిపై చనిపోయిన ఒక వ్యక్తిని పాతిపెట్టే ముందు తాళ్ళతో కట్టినట్లున్న బొమ్మను చెక్కిన విషయం ఉన్నది. ఇది క్రీ.పూ. 8 నుంచి 5 శతాబ్దాల నాటి బొమ్మ [i]. బృహత్ శిలాయుగ నిర్మాణాలలో భాగమైన స్మారక శిలాలు నిలువు రాళ్ళుగా పిలిచే 'మెన్‌హీర్స్' నిర్మాణాలు మొదలైనవి కాలపరిణామక్రమంలో తెలంగాణలో దేవాలయాల నిర్మాణాలకు నాంది పలికినవి. తెలంగాణలో దేవాలయాల నిర్మాణాలకు నాంది పలికినవి అని చెప్పడానికి కొన్ని ఋజువులు కలవు. అవి :

1) మహబూబ్‌నగర్, కృష్ణానది సమీపం మూడుమాల్ ప్రాంతంలో బృహత్ శిలాయుగ నిర్మాణాలు నిలువురాళ్ళుగా పిలిచే మెన్‌హీర్స్‌ను వ్యవసాయపనులు ప్రారంభించే సమయంలో ఆరాధించే సంస్కృతి నేటికి చూడవచ్చు (చిత్రం 1.1).

(చిత్రం 1.1) చెప్పులను ప్రక్కకు వదిలి నిలువు రాళ్ళను నమస్కరించే దృశ్యము, మూడుమాల్, మహబూబ్ నగర్

(V6 మీడియా సౌజన్యం) (https://youtu.be/VIWIH0ZFahk/Standing Stones History in Telangana)




2) తెలంగాణలో దాదాపు అన్ని గ్రామాలలో గ్రామ దేవతలను వివిధ పేర్లతో పిలిచినప్పటికీ, రాళ్ళను వివిధ రూపాలుగా మల్చి గొప్పగా ఆరాధించే సంస్కృతి తెలంగాణ అంతటా నేటికి చూడవచ్చు (చిత్రం 2.1 మరియు 2.2).

(చిత్రం 2.1) గ్రామ దేవత గుడి బయట భాగం దృశ్యము, జాన్సింగ్ లింగాపూర్, మెదక్

(వికీమీడియా సౌజన్యం) (https://www.wikiwand.com/te/జాన్సింగ్ లింగాపూర్)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  UGC Care List Approved Journal
హైదరాబాద్ జూన్ : 2022



(చిత్రం 2.2) గ్రామ దేవత గుడి లోపల భాగం దృశ్యము, జాంసింగ్ లింగాపూర్, మెదక్

(వికీమీడియా సౌజన్యం) (https://www.wikiwand.com/te/ జాంసింగ్ లింగాపూర్)



3) వరంగల్, మేడారం ప్రాంతం సమ్మక్క, సారక్క (కాకతీయుల కాలం నాటి వీర వనితలు) గద్దెలరూపంలో ఉన్న నిర్మాణాలను గొప్పగా ఆరాధించే సంస్కృతి కలదు. ఆసియా ఖండంలో ప్రసిద్ధిగాంచిన మరియు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన మేడారం జాతరలో నేటికి చూడవచ్చు.

(చిత్రం 3.1) సమ్మక్క, సారక్క గద్దెల వద్ద అశేష భక్తజన సందడితో ఉన్న దృశ్యము, వరంగల్, మేడారం

(TV 5 మీడియా సౌజన్యం) (https://youtu.be/GW7sJeR20rw/Sammaka - Saralamma History)




## దేవాలయం పదం ఆవిర్భావం

దేవాలయం యొక్క పదం మరియు అర్థం పరిశీలిస్తే, "దేవాలయం అనే పదానికి దేవుడు ఉండే స్థానం అని, దేవుని ఇల్లు అని అర్థాలున్నాయి. ఇంకా దేవాలయానికి దేవళం, గుడి, కోవెల అని కూడా పర్యాయ పదాలున్నాయి. గుడి అనేది ద్రావిడ భాషాపదం. ద్రావిడ భాషలలో ప్రాచీనమైన తమిళంలో కుటి అనే పదం ఉంది. కుటి అంటే ఇల్లు. తెలుగు కన్నడ, తుళు మొదలైన ద్రావిడ భాషల్లో గుడి అనే పదముంది. కన్నడ తెలుగు భాషలలో గుడిసె అంటే ఇల్లు. మనిషి నివాసానికి దేవుని నివాసానికి కూడా ఒకే పదం వాడారు. ఇంటిలో పడమర గదిని ఏర్పాటు చేసుకొని అందులో ఈశాన్యమూలన దేవుని పీఠాన్ని ప్రతిష్ఠించే ఆచారం నేటికీ తెలంగాణలో కొనసాగుతుంది. కావున మానవ నివాసాన్ని దేవుని నివాసాన్ని గుడి, కుటి, గుడిసె అనే పదాలతో ద్రావిడ జాతులు వాడాయి. మొత్తంమీద అన్ని ద్రావిడ భాషలలో గుడి అంటే దేవుని ఇల్లు లేదా దేవుడు నివసించు స్థలం అనే అర్థంలో ఈ పదాన్ని ఉపయోగించారు. ప్రాచీన కాలంలో దేవాలయాలను హర్మ్యం, ప్రసాదం, మందిరం, దేవయానం, విమానం, దేవాలయం అని అనేక పేర్లతో పిలిచేవారు. మొదట ఈ పదాలన్నింటికీ ఒకే అర్థం ఉండేవి. కాని కాలక్రమేణా ఈ పదాలు మారిపోయి వీనిలో కొన్ని పదాలను వేరే అర్థంతో వాడసాగారు.

చివరకు దేవాలయం పేరు ఒక్కటే దేవుని గుడికి పర్యాయపదంగా స్థిరపడింది" [ii]. దేవుడి ఆవాసంగా భావిస్తూ ఆరాధించే ఆలయమే దేవాలయముగా ఆవిర్భవించింది.

## తెలంగాణలో మొట్టమొదటి దేవాలయం

భారతదేశంలో దక్కన్ పీఠభూమి అతి పురాతనమైనది. కావున తెలంగాణ అనేక ప్రాచీన దేవాలయాలకు ప్రసిద్ధి. మహబూబ్ నగర్, కృష్ణానది తీరంలోని బ్రిడ్జి రంగాపూర్ అనే గ్రామంలో క్రీ.శ. 1వ శతాబ్దం నాటి శివాలయం బయటపడింది. గద్వాల చౌరస్తా దాటి

హైదరాబాద్ వస్తుండగా శ్రీశైలం ప్రాజెక్టు నీటిముంపునకు గురైన ప్రాంతంలో త్రవ్వకాలు జరుపుతుండగా లభించిన ఆధారాలను బట్టి తెలంగాణలో మొట్టమొదటి దేవాలయంగా పేర్కొనవచ్చు. "నాటి రాష్ట్ర పురావస్తు శాఖ (నేడు డిపార్టుమెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణగా పిల్వబడుతుంది) ఇక్కడ తవ్వకాలు జరుపుతుండగా, క్రీ.శ. 1వ శతాబ్దానికి చెందినటువంటి శివాలయం బయటపడింది. అది కూడా పునాది వరకే. అతి సాధారణ నిర్మాణంతో ఉన్న ఈ ఆలయం మధ్యలో శివలింగం అతి ప్రస్ఫుటంగా కానవచ్చింది. ఆ దేవాలయ నిర్మాణానికి వాడిన రాళ్ల కొలతలను చూస్తే 50 సెం.మీ. పొడవు, 25 సెం.మీ.ల వెడల్పు, 7 సెం.మీ.ల మందం కలిగి శాతవాహన వాస్తు శైలికి అద్దం పడుతున్నాయి. ఇవి శాతవాహనులవే అనడానికి ఇంకా ఆధారాలేమిటంటే నలుపు, తెలుపు, ఎరుపు మట్టిపాత్రలు ఆ దేవాలయం చుట్టుపక్కల జరిపిన తవ్వకాలలో బయటపడ్డాయి. వీటన్నిటి ఆధారంగానూ, ఇటుకల సైజుల ఆధారం గానూ చూస్తే క్రీ.శ.1వ శతాబ్దం నాటికే ఈ ప్రాంతంలో శైవం వేళ్లూనుకుందని చెప్పవచ్చు" [iii].

## తెలంగాణ దేవాలయాలు విభజన

ఆరాధించే ప్రదేశమే దేవాలయం. ప్రదేశాన్ని బట్టి దేవాలయాలు ప్రధానంగా మూడు రకాలుగా అధ్యాయ సౌలభ్యం కోసం విభజించవచ్చు. అవి :

I. స్థల దేవాలయాలు

II. జల దేవాలయాలు

III. స్థల – జల మిశ్రమ దేవాలయాలు

## I. స్థల దేవాలయాలు

స్థల దేవాలయాలను ప్రధానంగా మూడు రకాలుగా విభజించి, పరిశిలించవచ్చు. అవి

1. భూప్రాంత దేవాలయాలు
2. కొండ ప్రాంత దేవాలయాలు
3. అరణ్య ప్రాంత దేవాలయాలు

## II. జల దేవాలయాలు

జల దేవాలయాలు ప్రధానంగా రెండు రకాలుగా విభజించి, పరిశీలించవచ్చు. అవి

1. జలతీర దేవాలయాలు
2. నీటిలో ఉన్న దేవాలయాలు

## I. స్థల దేవాలయాలు

1. భూప్రాంత దేవాలయాలు

భూప్రాంతంలో ఉండే దేవాలయాలు సాధారణంగా భూ ఉపరితల మరియు భూగర్భంలో ఉన్న దేవాలయాలుగా చూడవచ్చు.

2. కొండ ప్రాంత దేవాలయాలు

కొండ ప్రాంతంలో ఉండే దేవాలయాలు సాధారణంగా కొండపైన మరియు కొండ గుహలలో ఉన్న దేవాలయాలుగా చూడవచ్చు.

3. అరణ్య ప్రాంత దేవాలయాలు

అర్యణ ప్రాంతంలో ఉండే దేవాలయాలు సాధారణంగా దట్టమైన అర్యణలతో పాటు చిన్న చిన్న అడవులలో మరియు చెట్ల సమూహాల దగ్గర ఈ దేవాలయాలు చూడవచ్చు.

## II. జల దేవాలయాలు

1. జలతీర దేవాలయాలు

జలతీరంలో ఉండే దేవాలయాలు సాధారణంగా నది తీరం వెంబడి, చెరువుల ప్రక్కన, లోయల ప్రక్కన మరియు జలపాతాల ప్రక్కన ఈ దేవాలయాలు చూడవచ్చు.

2. నీటిలో ఉన్న దేవాలయాలు

నీటిలో ఉండే దేవాలయాలు సాధారణంగా నదులలో, నదుల సంగమ స్థానంలో (కొన్ని నదులు కలిసే చోటు), కోనేరు (మెట్లు కలిగి నీటితో నిల్వ ఉండే చోటు) మరియు నీటి అంతర్భాగంలో కూడా చాలా అరుదుగా ఈ దేవాలయాలు చూడవచ్చు.

## III. స్థల – జల మిశ్రమ దేవాలయాలు

భూ ప్రాంత, కొండ ప్రాంత, అరణ్య ప్రాంత, జలతీర మరియు నీటిలో ఉన్న దేవాలయాలు మిశ్రమంతో కూడి ఉంటే, వాటిని స్థల – జల, మిశ్రమ దేవాలయాలుగా పరిగణించవచ్చు.

దేవాలయాల విభజన సాధారణంగా నగరా, ద్రావిడ మరియు వేసర శైలి అని దేవాలయాల నిర్మాణశైలిని ఆధారం చేసుకుని విభజించారు. అదే విధంగా రాజ్యాలపరంగా లేదా ప్రాంతాలపరంగా అనగా చాళుక్య శైలి అని, పల్లవ శైలి అని, దక్కన్ శైలి అని వివిధ రకాలుగా విభజించారు. అతి పురాతనమైన దక్కన్ పీఠభూమిలో తెలంగాణ కొండలు, లోయలు, నదులు, అడవులు వంటి వాటితో విస్తరించి ఉన్నది. అందుచేత తెలంగాణ భౌగోళికానికి తగ్గట్లుగా దేవాలయాలను ప్రధానంగా మూడు రకాలుగా విభజించి, పరిశీలించడం జరిగింది. ఈ విధంగా దేవాలయాలను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించి, పరిశీలించడం అనే భావన మొట్టమొదటిసారిగా ఈ పరిశోధక వ్యాసంలో పరిచయం చేయడం జరిగింది.

## ముగింపు

తెలంగాణ అంతటా తరతరాల నుండి దేవాలయ వ్యవస్థ పూజనీయము. తెలంగాణ నుండి మొట్టమొదటిసారిగా కాకతీయుల కాలం నాటి రామప్ప దేవాలయం తరతరాల చరిత్రకు అజారామరం అనే సంకేతాన్ని నేడు యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చడంతో తేటతెల్లమైంది. నాటి నుండి నేటి వరకు సమాజంపై

తనదైన ప్రాబల్యాన్ని దేవాలయ వ్యవస్థ పోషిస్తూ వస్తుంది. నేటికి సామాన్యుల నుండి పాలకుల వరకు దేవాలయాల నిర్మాణాలు ఏదో ఒక రూపంలో ఆసక్తిగా చేపట్టడం గమనించదగ్గ విషయం. ఇంతటి ప్రాబల్యం ఉన్న దేవాలయ వ్యవస్థను చర్చించడం సమంజసమైనది.

**పాద సూచి**

1. ఈమని శివనాగిరెడ్డి (2012), తెలుగు శిల్పులు, లఘు గ్రంథం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, పే.1
2. ముప్పాళ్ళ హనుమంతరావు (2012), ఆంధ్రదేశంలో శిల్పకళా వైభవం, లఘు గ్రంథము, తెలుగు అకాడమి, హైదరాబాద్, పే. 31–32
3. పల్లెబోయిన సుబ్రమణి మరియు ఈమని శివనాగిరెడ్డి (2012), తెలుగువారి దేవాలయాలు, లఘు గ్రంథం,పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, పే.11

## మాతకు సాష్టాంగ ప్రణామమ్

**(ఉరసా శిరసా దృష్ట్వా మనసా వచసా తథా**
**పద్భ్యాం కరాభ్యాం కర్ణాభ్యాం ప్రణామోష్టాంగముచ్యతే)**

వడి నురమున జో కొట్టుచు
నొడి నూయల జేయు తల్లి యుర్వికి వెలుగౌ!
తొడ సెజ్జ పయిన బిడ్డను
సడిసేయక నిద్రపుచ్చు చక్కగ తానే!

తలకును నూనెల నంటుచు
తలపై స్నానమ్ము బోసి తనయుల దీర్చున్!
తలగడగా మేను మలచి,
తలపుల మేలును దలచెడి తల్లిని గొలుతున్!

కంటికి రెప్పల వోలెను
ఇంటను పిల్లల నరయును! ఇల్లాలుగ వా
ల్గంటియె చిరు కోపమదే
కంటను చూపించు తాను కమనీయముగన్!

మనసా నవనీతమదియె
మనసారగ ప్రేమ జూపి మమతను బంచున్!
మనసంతయు 'సంతు' దలచి
మన సంతా వృద్ధిగోరు మాతకు జోతల్!

మాటలు నేర్పించు, పుడమి
ధీటుగ వెలుగొంద దీర్చి ధీధితులందున్!
మాటలు మాట్లాడ మురిసి
యాటలతో పాటనేర్పు నమ్మల గొలుతున్!



పదములు తడబడకుండా
పదపదమని నడక నేర్పు పావన హృదయన్!
పదమంటి గొలుతునెపుడును
పదపడి! మేల్గోరు తల్లి పాదాంబుజముల్!

ఏ కరములు భువి సేవల
కాకరములు! దివ్య రస సుధాకరములయెన్!
శ్రీకరమగు వాత్సల్య వ
శీకరములు! నీ కరముల చెన్నుగ గొలుతున్!

చెవులారగ తల్లి మురియు
చవులూరెడి మాట బలుక చక్కగ శిశువుల్
ఛవి నిండగ మోమంతట
చెవి నిండుగ కథలు జెప్పు చిన్మయమదియే!!

**(ఉరసా శిరసా దృష్ట్వా మనసా వచసా తథా**
**పద్భ్యాం కరాభ్యాం కర్ణాభ్యాం ప్రణామోష్టాంగముచ్యతే)**

**అవుసుల భానుప్రకాశ్**
పద్య సారస్వత పీఠం, తెలంగాణ,
ఫోన్ : 96032 04507

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 (35) హైదరాబాద్ జూన్ : 2022

గ్రంథాంతరంగం 13

# తంజాపురాంధ్రనాయక రాజ చరిత్రము

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

తెలుగు సాహిత్య చరిత్రలో 1600–1775 సంవత్సరాల కాలావధి దక్షిణాంధ్ర యుగంగా ప్రసిద్ధి పొందింది. శ్రీ కృష్ణదేవరాయల యుగం (1500–1600)లో తెలుగు కవిత్వం రసవంతంగా వర్ధిల్లినా, విజయనగర సామంతులైన మధుర, తంజావూరు, జింజి, పుదుక్కోట పాలకుల కాలంలో వెలుగు జిలుగులు కోల్పోయి, కవిత్వ దీపశిఖలు మందంగానే ప్రకాశించాయి. అయినా ఈ దక్షిణాంధ్రయుగ తెలుగు సాహిత్య పరిశోధన, పరిశీలన, విమర్శలు విస్తృతంగా, లోతుగా జరిగినట్లు కనపడదు.

దక్షిణాంధ్రయుగ నాయకరాజుల చరిత్ర, సాహిత్య పోషణల గురించి పరిశోధన చేసి, దానికి ఇనాలోక యోగం కల్పించిన సిద్ధపురుషుల్లో ప్రథమగణ్యులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. ఆ మహనీయుడు మద్రాసు ప్రాచ్య పరిశోధనా వ్రాత ప్రతుల గ్రంథాలయంలోని మెకంజీ కైఫియత్తులు, ఇతర లిఖిత, తాళపత్ర గ్రంథాల్ని అధ్యయనం చేసి తంజావూరులోని సరస్వతీ మహలు గ్రంథాలయంలోని ప్రాచీన సంస్కృతాంధ్ర కావ్యనాటకాదుల్ని గాలించి 1914లో 'తంజావూరి యాంధ్రనాయక చరిత్ర'ను రచించి పాఠక లోకానికి అర్పించారు. దక్షిణాంధ్రయుగ చరిత్ర, సాహిత్యాల్ని అంచనా వేసిన తొలి విమర్శనా గ్రంథం ఇదే.

ఈ యుగ రాజుల చరిత్ర, సాహిత్య సేవల గురించి వెలువడ్డ ద్వితీయ గ్రంథం కురుగంటి సీతారామయ్య గారి (1889–1959) 'తంజాపురాంధ్రనాయక రాజచరిత్రము'. కురుగంటి వారు తంజావూరు సరస్వతీ మహలు గ్రంథ భండారంలో ఉపద్రష్టగా పని చేసిన సరస్వతీ పుత్రులు. ఆయన కఠోర, గాఢ అధ్యయన, అనుశీలనల సత్ఫలమే ఈ గ్రంథం.

కురుగంటి సీతారామయ్యగారు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ఆధ్వర్యంలో 1931వ సంవత్సరం డిసెంబరు 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విశాఖపట్టణంలోని ఎ.వి.ఎన్. కళాశాల సభాంగణంలో మామిడిపూడి వెంకట రంగయ్య గారి అధ్యక్షతలో ఆరు రోజుల పాటు ఇచ్చిన ఉపన్యాసాల పరిష్కృత, పరివర్ధిత రూపమే ఈ 'తంజాపురాంధ్ర నాయక రాజ చరిత్రము'. కారణాంతరాల వల్ల ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ప్రకటించ వలసిన ఈ పుస్తకం కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారి ఔదార్యం వల్ల వారి ఆంధ్ర గ్రంథమాల పదిహేడవ పుష్పంగా 1932లో ఆంధ్ర పత్రిక ముద్రణాలయంలో అచ్చయి వెలుగు చూసింది. సీతారామయ్య గారు తమ గురువు, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ఉపాధ్యక్షులైన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారికి ఈ అమూల్య గ్రంథాన్ని అంకితం చేశారు. ఈ విలువైన పుస్తకానికి 'తొలిపలుకు' పలికిన నాగేశ్వరరావుగారు తమ శుభాశంసల నీ విధంగా ప్రకటించారు– "గ్రంథాలయము (తంజావూరు సరస్వతీమహల్ గ్రంథ భాండాగారం) కుపద్రష్టయైన సీతారామయ్యగారు తమ లక్ష్యము నాంధ్ర రాజ్య వ్యాపన చరిత్ర లక్ష్యమునకు వలెనే, యాంధ్ర సాహిత్య చరిత్ర రచనకును మరల్చి ఆంధ్ర సాహిత్య చరిత్ర యందీ యజ్ఞాతాధ్యాయమును సువ్యక్తము చేయుదురుగాక."(పేజీ:10) కాశీనాథుని వారు "దక్షిణ దేశ రాజ్యముల చరిత్రము 17, 18 శతాబ్దములందు దుఃఖభూయిష్ఠమై, అంధకార బంధురముగ నున్నది." (పేజీ:8) పైగా తంజాపురాంధ్ర రాజ్య చరిత్రము "విస్మృతమును, వివాదగ్రస్తమును నైన" దని చెప్పారు. (పేజీ: 11–12) కురుగంటి వారు అనాదృతమూ, అస్పష్టమూ అయిన తంజాపురాంధ్ర చరిత్ర, సాహిత్యాలపై తమిళం,


ఆంధ్రగ్రంథమాల పదునేడవ కుసుమము 35

శ్రీరస్తు

తంజాపురాంధ్రనాయకరాజ
చరిత్రము

(ఆంధ్రవిశ్వవిద్యాలయపక్షమున నిచ్చిన యుపన్యాసముల సారము)

151

"యద్దృశ్యతే లుప్యతే యత్పరోక్ష్యతే,
శతతమిా స్తా తనూ ర్మే బభూవ"

గ్రంథకర్త :
కురుగంటి - సీతారామయ్య, యం. ఏ.,
ఉపద్రష్ట, సరస్వతీమహాల్ పుస్తకాలయము,
తంజాపూరు

౧౯౩౨] [రు. ౨-౦-౦.

తెలుగు, సంస్కృతం, ఆంగ్ల భాషా గ్రంథాల కూలంకష అధ్యయనం ద్వారా యథాశక్తిగా వెలుగు ప్రసరింప చేశారు.

దక్షిణాంధ్ర యుగ చరిత్ర, సాహిత్యాలపై విస్తృతంగాను, లోతుగాను అధ్యయనం చేసి పరిశోధనా గ్రంథాలు ప్రకటించిన విద్వాంసుల్లో వేటూరి ప్రభాకర శాస్త్రి, కురుగంటి సీతారామయ్య, నేలటూరి వేంకట రమణయ్య, నిడదవోలు వెంకటరావు, డా. కె. వి. ఆర్. నరసింహం, యండమూరి సత్యనారాయణరావు (శ్రీవాత్సవ) ప్రభృతులు పేర్కొనదగినవారు.

'తంజాపురాంధ్ర నాయక రాజ చరిత్రము' ఆరు ఉపన్యాసాల సంగ్రహం. కురుగంటివారు మొదటి ఉపన్యాసంలో ఈ గ్రంథరచనకు తోడ్పడ్డ ముద్రిత, అముద్రిత గ్రంథాల్ని, శాసనాల్ని పేర్కొన్నారు. సీతారామయ్య గారు ఈ గ్రంథరచనకు ఉపకరించిన సుప్రసిద్ధ చరిత్రకారులగు డా. ఎన్. కృష్ణస్వామి అయ్యంగార్, దివాన్ టి.వెంకాసామి బహద్దూర్ రావు, యస్.సత్యనాథ అయ్యర్, ఫాదర్ హెరాస్, ఎఫ్. డబ్లు, హెమింగ్వే మొదలైన వారి గ్రంథాల్ని

ఉల్లేఖించారు. పైగా రఘునాథ నాయకుడు, విజయ రాఘవ నాయకుడు, చేమకూర వేంకట కవి, రామ భద్రాంబ, రంగాజమ్మ, ముద్దు పళని వగైరా విద్వాంసులు, విదుషీమణులు రాసిన సంస్కృతాంధ్ర కావ్యాల సహకారాన్ని స్మరించారు. అక్కడక్కడ శాసనాల తోడును స్వీకరించారు. కురుగంటివారు ఎన్నో గ్రంథాల ఉపకారాన్ని ఉల్లేఖిస్తూ–**"పైవాని నన్నింటిని పరిశీలించి, నాకు తోచినట్లీ చరిత్రము నల్లితిని. ఏ తచ్చరిత్రము నందు నాది తుదిమాట కానేరదు. తప్పొప్పులను తజ్ఞులరగు తమకు వదిలి వేయుచున్నాను."** (పేజీ:18) అని విన్నవించుకొన్నారు.

సీతారామయ్యగారు **'చోళమండలము– తంజాపురము'** గురించి ప్రస్తావిస్తూ తుంగభద్రానదికి దక్షిణాన వుండే హిందూదేశం పాండ్య, చోళ, చేర మండలాలు మూడు భాగాలై వేర్వేరు రాజులచే పాలింపబడు చుండెడివని చెప్పారు. 'చోళ' శబ్దము ప్రాచీన తమిళంలో 'శోరన్'గా పిలువబడేదనీ, ఆ ప్రాంతంలో చోరులు విపరీతంగా ప్రజల్ని దోచుకుతినేవారనీ, ఈ చోళుల (చోరుల) మహానాయకుడే చోళరాజు అని సాక్ష్యాధారాల ద్వారా నిరూపించారు గ్రంథకర్త. చోళ, పాండ్య, చేర రాజులు పరస్పరం యుద్ధాలు చేస్తూ వుండేవారని చెప్పారు. వీటిలో చోళమండలం కావేరీ నదీ ప్రాంతమవడం వల్ల సుభిక్షంగా వర్ధిల్లిందన్నారు. తంజావూరు రాజధానిగా ఈ చోళ మండలం కాలక్రమంలో సంగీత సాహిత్య నృత్య శిల్పకళా కేంద్రంగా విరాజిల్లిందని చెప్పారు కురుగంటివారు.

రచయిత రెండవ ఉపన్యాసంలో ఢిల్లీ సుల్తాను అల్లాయుద్దీన్ ఖిల్జీ సేనాపతి మాలికాఫర్ దక్షిణ భారతంలోని తమిళ ప్రాంతాన్ని జయించి మధుర రాజధానిగా కొంత కాలం పాలించినట్లు తెలిపారు. ఆ కాలంలో మహమ్మదీయులు మధుర ప్రాంతాన్ని మత పరంగా, సాంస్కృతికంగా ధ్వంసం చేశారు. విజయనగర సామ్రాజ్యాధిపతి బుక్కరాయలు తన కుమారుడు కంపరాయల్ని విశాల సైన్యంతో పంపి తరుష్కుల నోడించి మధుర ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పారు.

విజయనగర రాజ్యం సంగమ, సాళువ, తుళువ వంశరాజుల చేతుల్లోకి వచ్చి, శ్రీ కృష్ణదేవరాయల పాలనలో సువర్ణయుగంగా పేరు మోసింది. కృష్ణరాయలు 1529లో తన సేనాపతి నాగమ నాయకుని కుమారుడైన విశ్వనాథ నాయకుని తన ప్రతినిధిగా మధురలో నాయకరాజ్య మేర్పరచాడు. కురుగంటి వారు మూడవ ఉపన్యాసంలో తంజావూరు నాయక రాజ్య సంస్థాపనం గురించి వివరంగా చెప్పారు. అచ్యుత దేవరాయలు తన తోడల్లుడగు చిన చెవ్వప్ప నాయకుని తంజావూరు రాజధానిగా చోళమండలానికి రాజుగా 1535లో నియమించాడు. చెవ్వప్ప నాయకుని కొడుకైన అచ్యుత నాయకుని (1561–1614) సుపుత్రుడైన రఘునాథ నాయకుడు పరాక్రమశాలి. ఇతను 1614లో తంజావూరు సింహాసనమెక్కి నాయక వంశ కీర్తి చంద్రికల్ని దూర ప్రాంతాల వరకు వ్యాపింప చేసినాడు. కురుగంటి వారీ ఘనుని గూర్చి ఇలా వ్రాశారు– "అచ్యుతుని రాజ్యాంత్య కాలమున మాత్రము తంజావూరు చుట్టును చీకటులు గ్రమ్మి యుండెను. రఘునాథ సూర్యుడు వానిని పటాపంచలు చేయవలసి యున్నది." (పేజీ: 188)

కురుగంటి సీతారామ భట్టాచార్యుల వారు ఇంతవరకు తంజావూరు, మధుర రాజుల కాలం నాటి రాజకీయ నేపథ్యాన్ని వివరించి, తెలుగు, సంస్కృత పోషకులైన రఘునాథ నాయకుడి, విజయ రాఘవ నాయకుడి పాలనా కాలం నాటి పూర్వ రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక స్థితిగతుల్ని పాఠకుల కళ్లముందు నిలిపారు. దక్షిణాంధ్ర యుగ నాయక రాజుల గురించి ఇంత సాకల్యంగా వెలువడ్డ తెలుగు గ్రంథాల్లో దీన్ని మొదటి రచనగా పేర్కొనవచ్చు.

కురుగంటి సీతారామయ్యగారు నాలుగవ ఉపన్యాసంలో తంజావూరి పాలకుడైన రఘునాథ నాయకుని (1614–1633) శౌర్య పరాక్రమాల్ని, సాహిత్య పోషణను, సంస్కృతాంధ్ర కావ్యాలను ఆంగ్ల చరిత్ర గ్రంథాలను సాక్ష్యాలుగా స్వీకరించి సుస్పష్టంగా వెల్లడించారు. ఆయన రఘునాథ నాయకుని ప్రశస్తమైన సేవను ఈ విధంగా ప్రస్తుతించారు – **"ఈ చరిత్రమునకు రఘునాథుడు నాయకమణి, ఈయనను కృష్ణరాయలతో నన్ని విషయములలో బోల్చవచ్చును. లక్ష్మీ సరస్వతులిర్వురును తంజానగరము తమకు రాజధానిగా చేసికొని నిరంతర నృత్యము గావించిరి. ఆంధ్ర భాషామతల్లికి ముద్దుకుమారుడై, యాంధ్ర కవితా వధూటికి ప్రేమాస్పదుడైన నాయకుడై యీయన వరలెను. విద్యానగరమున కృష్ణరాయ భోజుని కాలమున నాంధ్ర కవితా వధూటి యెట్లు పల్లకిలో నూరేగింపబడెనో యట్లె రఘునాథుని కాలమున శారదా ధ్వజాది రాజ చిహ్నములతో వరలెను."** (పేజీ: 194)

రఘునాథ నాయకుడు సంస్కృతాంధ్ర కవి పండితుల్నీ, సంగీతకారుల్నీ పోషించిన రసిక చక్రవర్తి ఈయన ఆస్థానంలో గోవింద దీక్షితులు, ఆయన కుమారులైన యజ్ఞనారాయణ, వేంకటమఖి, మరియు రాజ చూడామణి దీక్షితుడు, కృష్ణాధ్వరి, తాతాచార్యులు, మధురవాణి, రామభద్రాంబ మొదలైన సంస్కృతకవులు, కవయిత్రులు రాజిల్లారు. విజయవిలాస ప్రబంధ కావ్యకర్త చేమకూర వేంకటకవి ఈయన సభకు ఎనలేని కీర్తి తెచ్చిన మహాకవి.

ఐదవ ఉపన్యాసం విజయ రాఘవ నాయకుని (1633–1673) అసమర్థ పాలకునిగా, భోగలాలసునిగా చిత్రించే రచన. ఈయన రాజగురువైన తాతాచార్యుల చెప్పుడు మాటలు విని వైష్ణవేతరుల్ని, ఇతర మతస్థుల్ని వేధించిన రాజు. ఈతని పిరికితనం, దుశ్చర్యల్ని విప్పి చెప్పి, చరిత్రకారుల అభిప్రాయాల్ని ఉటంకించి కురుగంటి వారు **"వేంకటేశ్వర మఖి యీయన దుష్కృత్యమునకు సాయ మొనర్చుట నిజమేయైన యెడల తంజాపుర రాజ్యమున కాయన ధూమకేతువనియే చెప్పవలెను."** (పేజీ: 275) అని అంటారు.

తంజావూరు నాయకరాజుల సాహిత్య పోషణ గురించి మాత్రమే ఎక్కువగా తెలుసుకొని, వాళ్ల వ్యక్తిత్వం గురించి తక్కువగా విన్న సాహిత్య ప్రియులకు విజయరాఘవ నాయకుని గురించి కురుగంటి సీతారామయ్య గారు అన్న ఈ మాటలు ఎవరికైనా ఏహ్యాభావం కలిగించుక మానవు. **"ఈ స్త్రీ లౌల్యమును, సుఖాసక్తియు నీయనను తుదకు పిరికి పందనుగా నొనర్చెను. ఈయన సామాన్యముగా యుద్ధము చేసినట్లు కానరాదు. క్షాత్ర ధర్మమునే మరచెను. ఎప్పుడు బాహుబలము చూపవలసిన యవసరము తటస్థించిన నీయన పిక్కబలము నుపయోగించినట్లు ముందు మనకు తెలియగలదు."** (పేజి: 284).

పిరికిపంద విజయరాఘవ నాయకుడు మధుర రాజు చొక్కనాథ నాయకుని సేనలు తంజావూరు కోటలో ప్రవేశించినప్పుడు కూడా మన్నారుదాస పూజలో మునిగి మంత్రపూరిత తులసి తీర్థాన్ని శత్రుసేనలపై చల్లమని ఆజ్ఞాపించెనట. (పేజి: 327) అంతఃపుర స్త్రీలను అగ్నిగుండంలోనికి దూకి ప్రాణత్యాగం చేయమని చెప్పి, కారాగృహంలో బంధింపబడ్డ కుమారుడైన మన్నారు దేవునితో కలిసి శత్రుసైన్యాలతో పోరాడుతూ మరణించిరట. ఈ విధంగా 1673లో తంజావూరు మధుర నాయకుల పాలై, అళగిరి నాయకుడు రెండేళ్లు చెంగమలదాసుడు ఒక సంవత్సరం పాలించిరి. తర్వాత ఛత్రపతి శివాజీ తమ్ముడైన ఏకోజి తంజావూరు గద్దెపై ఎక్కాడు. ఇంతటి తంజావూరు నాయక రాజుల కథ కంచికి వెళ్లింది.

కురుగంటి సీతారామ భట్టాచార్యుల వారు 'ఉపసంహారము'లో తంజావూరు నాయక రాజుల కాలంలో సంస్కృతాంధ్ర సాహిత్య పోషణ సుష్ఠుగా జరిగిందన్నారు. విజయరాఘవ నాయకుని కాలంలో రచింపబడ్డ 'రఘునాథాభ్యుదయము'ను తెలుగులో మొదటి నాటకమన్నారు. (పేజి: 360) గద్య పద్యాత్మకమైన ఈ రచనలో నాటక లక్షణాలేవి పాటింపబడ లేదనీ, వాటిని యథాతథంగా ప్రదర్శింపలేమనీ, కాని కొన్ని మార్పులతో ప్రయోగించేందుకు అవకాశముందని సీతారామయ్యగారు అభిమతం వెలిబుచ్చారు. (పేజి: 361). ఈ యుగం ప్రక్రియా వైవిధ్యానికి పేరు మోసిందన్నారు.

కురుగంటి వారు పుస్తకం చివరి 'అనుబంధా'ల్లో నాయక రాజుల చరిత్రకు ప్రబల సాక్ష్యాలుగా వున్న చరిత్రకారుల ఇంగ్లీషు, తెలుగు రచనాంశాల్ని గుది గుచ్చారు. తంజావూరు వైభవాన్ని తలపింప చేసే అందమైన ఫోటోలు ఈ గ్రంథ సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తాయి. తంజావూరు నాయక రాజుల చరిత్రను తెలియచేసే ఈ గ్రంథం ఆనాటి సంస్కృత, తెలుగు సాహిత్య సృష్టి మూలాల్ని అవగాహన చేసుకొనేందుకు భూమికగా తోడ్పడ గలదు. (ఈ పుస్తకం జెరాక్స్ ప్రతి పంపి, సహకరించిన డా. బడిగె ఉమేశ్ గారికి కృతజ్ఞతలు).

# నేటి స్థితి

సీ. చెప్పలేడుగ నొజ్జ నొప్పుగ పాఠంబు
తరగతి గదులన్ని తకిట తకిటె.
గౌరవంబును గాలి గల్పుచు న్వికవిక
ల్పక పకల నగెడి పాడు బుద్ధి
చూచిరాతల జోరు సూటి మాటల హొరు
వెకిలి చేష్టల గతు ల్వివిధ స్థితుల
చదువు గాంచగ రాదు జగడముల్దుర్మతుల్
కరతలామలకమే గజ్జి గతిన
బడికి రాదువాడెన్నడు పాసు మాత్ర
మగును పొగరు పోటెక్కగన్ మకిలి మనసు
వాడు మైలవాడు సమాజ వైరి వాడు
దేశ మందు చీడ చెదల ధీరు డతడు .

సీ. మార్కులు వేయాలి మాట్లాడ కుండనే
ముసి ముసి నవ్వాలి మొగము జూసి
తిట్టరాదెప్పుడు కొట్టరాదెన్నడు
చూడవలెను వాడి చోద్యములను
ఏది రాసిన సరి యేది జెప్పిన సరె
ఊకొట్టు తలనూపి చూడవలెను
బడికి వచ్చిన రాని, దడను బుట్టెడి పని
చేసిన, క్రొవ్వెక్కి చిఱ్ఱు మనిన
గాని వాడేది జేసిన గాని జయుడు
వాడె విజయుడు వాడె పో ! వాని ముందు
గురువు నిలిచి గెలువ లేడు పరువు తోటి,
బ్రతుగ నొజ్జ ఘనుడె నేటి పాడు విధిన

కం. భయభక్తులు గాంచవెచట
దయ వెతికిన దొరకదేమి? ధర్మము తొలగన్
జయముకొరకు వక్ర గతులె
నయమని నడువ గురువేమి నడకలు నేర్పున్

డా. వొజ్జల శరత్ బాబు
హైదరాబాద్, ఫోన్ : 9494183937

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 (38) హైదరాబాద్ జూన్ : 2022

# 'సంతూర్' పండిత్ శివకుమార్ శర్మ కు అశ్రునివాళి

**సామల రాజవర్ధన్,** ఫోన్ : 96529 50959



హిందుస్తానీ వాద్య సంగీత విద్వాంసులు నలుగురు కలిసి జుగల్బందీ యేర్పాటు చేసుకొని ఒక ఆల్బం విడుదల చేసినారు. ఆ ఆల్బం పేరు 'కాల్ ఆఫ్ వ్యాలీ'. ఇది 1967వ సంవత్సరంలో జరిగింది. ఆ ఆల్బం సంగీత రసజ్ఞులను విపరీతంగా అలరించింది. ఆ రికార్డులు హాట్ కేకుల వలె అమ్ముడుపోయి రికార్డు సృష్టించినాయి. తమ సంగీతంతో ఒక తరాన్ని అలరించిన సంగీత ప్రపంచంలోని ఆ నలుగురు దిగ్గజాల్లో ఒకరు స్వర్గస్థులైనారు. అంటే ఆ నాలుగు స్తంభాలలో ఒక స్తంభం కూలిపోయింది.

పండిత్ శివకుమార్ శర్మ సంతూర్, పండిత్ హరిప్రసాద్ చౌరసియా వేణువు, పండిత్ బ్రిజ్ భూషణ్ కాబ్రా గిటార్, ఈ ముగ్గురికి తబ్లా సహకారమందించినవారు ఉస్తాద్ జాకిర్ హుస్సేన్. ఈ నలుగురి వల్లనే "కాల్ ఆఫ్ వ్యాలీ" నిలబడింది. అందులోనుండి పండిత్ శివకుమార్ శర్మ మే నెల 10వ తేది 2022న పరమపదించినారు.

మైహర్ ఘరానాకు చెందిన విఖ్యాత వాద్య సంగీతజ్ఞుడు బాబా అల్లాయుద్దీన్‌ఖాన్ సాహెబ్ కుమార్తె అన్నపూర్ణాదేవి వద్ద వేణువాద్యాన్ని నేర్చుకొని ఈనాడు అద్వితీయుడుగా పేరుగాంచిన పండిత్ హరిప్రసాద్ చౌరాసియా, గిటార్ వాయిద్యాన్ని హిందుస్తానీ సంగీతంలో శాస్త్రీయ సంగీతం వాయించడానికి అనువుగా తయారు చేసుకొని సంగీత సభల్లో గిటార్‌కు ప్రత్యేకస్థానాన్ని కల్పించిన పండిత్ బ్రిజ్ భూషణ్ కాబ్రా, సంతూర్‌ను తొలిసారి హిందుస్తానీ సంగీతంలో ప్రవేశపెట్టి సంతూర్ అనగానే శివకుమార్ శర్మనే అని అన్పించేట్లుగా ఆ వాద్యం మీద పట్టు సాధించిన పండిత్ శివకుమార్ శర్మ. ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు సృష్టించినారు. ఈ సంగీత త్రయానికి తబ్లా సహకారాన్నందించి బంగారానికి తావి అబ్బించినట్లు చేసినవారు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్. ఈ చతుష్టయంలో నుండి ఒక ధ్వజస్థంభం కూలిపోవడం బాధాకరం.

**"తమన్నా జో పూరీ హెూ ఖ్వాబ్ మె**
**హఖీకత్ బన్ జాయె తో క్యా బాత్ హై"**

కోరికలు అందరికీ వుంటాయి. అయితే వాటిని సాకారం చేసుకోవడానికి ఎంతటి కష్టాన్నయినా భరించగల ఓర్పు అవసరం. అప్పుడే అది మన సొంతమవుతుంది. అటువంటి కఠోరదీక్షతో కాశ్మీరు ప్రాంతానికి చెందిన ఒక జానపద వాద్యాన్ని శాస్త్రీయ సంగీతపు వేదికనెక్కించి ఔరా! అనిపించుకొని భారత ప్రభుత్వం చేత అత్యున్నత పురస్కారమైన "పద్మభూషణ' బిరుదు పొందిన వ్యక్తి పండిత్ శివకుమార్. ఇప్పుడు చెప్పుకున్న షేర్ అతని జీవితానికి సరిగ్గా సరిపోతుంది.

సంతూర్ వాద్యాన్నే తన గుర్తింపుగా మార్చుకున్న పండిత్ శివకుమార్ శర్మకు ఆ వాద్యం అంత సులభంగా లొంగలేదు. అసలతనికి అది ఇష్టం కూడా లేకుండె. కానీ ఎవరు ఏమవుతారని నిర్ణయించేది వారి వారి చేతుల్లో వుండదు కదా!

పండిత్ శివకుమార్‌శర్మ 13 జనవరి 1938వ సంవత్సరం జమ్మూలో జన్మించినాడు. అతని తండ్రి పండిత్ ఉమాదత్తశర్మ. పేరెన్నికగన్న గాయకుడే గాక ఆకాశవాణిలో సంగీత నిర్దేశకునిగా పని చేసినాడు. అతను బనారస్ ఘరానాకు చెందిన విఖ్యాత పండిత్ బడే రామదాస్ వద్ద శాస్త్రీయ సంగీతాన్ని నేర్చుకున్నాడు.

శివకుమార్‌శర్మకు ఐదు సంవత్సరాల చిరుప్రాయంలోనే సంగీతశిక్షణ ప్రారంభించినాడు. ఒక్క గాత్రమే కాదు 'లయ' మీద కూడా పట్టు వుండాలనే ఉద్దేశంతో తబ్లా కూడా నేర్పించినాడు. అయితే అతనికి గాత్రం కంటే తబ్లా వాయించడంలోనే ఎక్కువ ఆనందం పొందేవాడు. తండ్రి ఆకాశవాణిలో పనిచేస్తున్నందున తరచుగా ఆకాశవాణిలో చిన్నారిలోకం కార్యక్రమాల్లో శివకుమార్‌శర్మ తబ్లా వాయించి బాల కళాకారునిగా పేరు సంపాదించినాడు.

పండిత్ ఉమాదత్తశర్మ శ్రీనగర్ రేడియోస్టేషన్లో పనిచేసినప్పుడు అక్కడి జానపద కళాకారులు సంతూర్ వాయించడం గమనించి దానిని శాస్త్రీయ సంగీత వాద్యంగా మారిస్తే ఎట్లా వుంటుంది అని ఆలోచించినాడు.

సంతూర్ చాలా ప్రాచీనమైన వాద్యం. దానికి వంద తీగెలుంటాయి. కనుక శతతంత్రీ వీణ అనేవారు. శతతంత్రీ వీణ భ్రష్టరూపమే సంతూర్. శతతార్ లేదా సౌతార్ అన్నమాట. 'తార్' అంటే తీగ. 'సౌ' అంటే వంద అని అర్థం కదా! కాశ్మీర్ ప్రాంతంలో ఈ వాద్యాన్ని జానపద వాద్యంగానే చెప్పుకునేవారు. "సూఫీకలామ్" అంటే సూఫీయోగుల ఆధ్యాత్మిక గీతాలకే ఈ వాద్యం పరిమితమై వుండేది. తద్వారా వెలువడ్డ సంగీతాన్ని సూఫియానా సంగీతం అన్నారు.

సంతూర్‌ను కాశ్మీర్ ప్రాంతంలో విరివిగా లభించే అఖ్రూట్ చెట్టు కలపతో తయారుచేస్తారు. దీన్ని వాయించడానికి ఉపయోగించే పుల్లలు కూడా అఖ్రూట్ చెట్టు కొమ్మలే. వాటిని 'కలం' అంటారు. సంతూర్ తంత్రీవాద్యమే అయినప్పటికీ విలక్షణమైనది. వేళ్లతో వాయించడానికి వీలు లేదు. 'మిజ్రాబ్' అవసరం లేదు. అఖ్రూట్ పుల్లలతో బిగించి వున్న తీగలపై చిన్నగా తడుతూ వుంటే నాదం బయలు వెడుతుంది. ఈ పద్ధతి జలతరంగ్‌తో పోల్చవచ్చు. జలతరంగ్‌లో గిన్నెల్లో నీళ్లుంటాయి. ఇక్కడ తీగలుంటాయి. అంతే భేదం.

పండిత్ శివకుమార్ శర్మకు 13 సం॥ల వయస్సులో అతని తండ్రి సంతూర్‌ను కానుకగా ఇస్తూ దీనిమీద శాస్త్రీయ రాగాలను పలికించమని చెప్పినప్పుడు అదతనికి అంతగా నచ్చలేదు. కానీ ఇచ్చినవాడు తన తండ్రీ, గురువు కూడా! నిశ్శబ్దంగా ఆ వాద్యాన్ని స్వీకరించినాడు. అదతని జీవితానికి దిశానిర్దేశం చేసింది. ఆ క్షణమెంతటి అపురూపమైనదో!

సంతూరే తన గుర్తింపుగా మార్చుకున్న పండిత్ శివకుమార్‌శర్మ ఆ వాద్యాన్ని అభ్యసిస్తూ అందులో తనకు, తన సంగీతానికి అనుకూలమైన మార్పులను చేసుకుంటూ విమర్శలకు కుంగిపోకుండా ప్రశంసలకు పొంగిపోకుండా ధైర్యంగా నిలబడి భారతీయ వాద్య సంగీతంలో ఏకైక సంతూర్ విద్వాంసునిగా ఎదిగిన శివకుమార్‌శర్మ 1955వ సం॥లో అనగా తన 17 సం॥ల వయస్సులో తొలి కచేరీ చేసి మెప్పించినాడు. తర్వాత 22 సం॥ల వయస్సులో అంటే 1960లో తొలి సోలో ఆల్బం విడుదల చేసినాడు.

పండిత్ శివకుమార్‌శర్మ ప్రాచీన శతతంత్ర వీణను పూర్తిగా మార్చి కొత్తరూపాన్నిచ్చినాడు. సంతూర్‌పై 'మీండ్' వాయించే నేర్పును సాధించినాడు. ఠుమ్రీ, ఖయాల్లను గూడా వాయించే నైపుణ్యాన్ని సంపాదించినాడు. తాను చిన్ననాట నేర్చిన గాత్ర సంగీతం, తబ్లా, తాను సంతూర్‌ను శాస్త్రీయ సంగీత వాయిద్యంగా మార్చుకోవడానికి పనికి వచ్చిందని, తద్వారా తన పని సులువయిందని చెప్పుకుంటాడు.

కర్ణాటక సంగీతంలో వాద్యానికి వేరు, గాత్రానికి వేరు అనే పద్ధతి లేదు. కృతులవే వుంటాయి. కానీ హిందుస్తానీ సంగీతం అట్లా కాదు. గాత్ర సంగీతపు బందిషులు వేరుంటాయి. వాద్య సంగీతంలో మీండ్ – జోడ్ – జాలా అనే పద్ధతిలో వాయిస్తారు.



అయితే వాద్యాన్ని గాత్ర సంగీతం వలె వాయిస్తే అది 'గాయకీ అంగ్' అవుతుంది. ఉస్తాద్ భిస్మిల్లాఖాన్ సాహెబ్ వాయిస్తే షహనాయి పాడుతున్నట్లుంటుంది. అతని శిష్యురాలు విదుషి సోమాఘోష్ పాడుతుంటే ఉస్తాద్ భిస్మిల్లాఖాన్ సాహెబ్ షహనాయి వింటున్నట్లుంటుంది. అట్లాగే విదుషి ఎన్.రాజం వాయిలీన్ వాయిస్తుంటే ఆమె గురువుగారు పండిత్ ఓంకార్‌నాథ్ ఠాకూర్ పాడుతున్న భ్రమ కలుగుతుంది. ఇదీ గాయకీ అంగ్. పండిత్ శివకుమార్ శర్మది కూడా గాయకీ అంగ్ అనవచ్చు.

పండిత్ శివకుమార్ శర్మ సొంతంగా అసంఖ్యాకమైన కచేరీలు చేసి ఆల్బంలు విడుదల చేయడమే గాక పండిత్ హరిప్రసాద్ చౌరసియాతో కలిసి శివ – హరి పేరిట జుగల్‌బందీలు కూడా చేసి ఆల్బంలు విడుదల చేసినాడు. వీరితో పండిత్ బ్రిజ్ భూషణ్ కాబ్రా గిటార్ వాద్యంతో కలిసినాడని, వారికి ఉస్తాద్ జాకిర్‌హుసేన్ తబ్లా సహకారం అందించేవాడని ఇదివరకే చెప్పుకున్నాం.

ఒక సంగీత సభలో పండిత శివకుమార్‌శర్మ సంగీతాన్ని విన్న పండిత్ జస్‌రాజ్ భార్య మధురా జస్‌రాజ్ శివకుమార్ శర్మను తన తండ్రిగారయిన వి. శాంతారామ్ గారికి పరిచయం చేసింది. అతనప్పుడు 'ఝనక్ ఝన్ పాయల్ బాజే' చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఆ చిత్రానికి వసంత్ దేశాయి సంగీతం సమకూర్చుతున్నాడు. పండిత్ శాంతాప్రసాద్ తబ్లా. విఖ్యాత కథక్ నర్తకుడు గోపీకృష్ణ కథానాయకుడు. ఆ చిత్రానికి టైటిల్ సాంగ్ ఉస్తాద్ అమీర్‌ఖాన్ సాహెబ్ పాడుతున్నాడు. అందరూ హేమాహేమీలే! అయితే రత్న పరీక్షకుడైన వి. శాంతారామ్ పండిత్ శివకుమార్‌శర్మకు ఒక చిన్న అవకాశం ఇచ్చినాడు. గోపీకృష్ణ నాట్యానికి ఒక చిన్న బందిష్‌కు పండిత్ శివకుమార్ శర్మను బాణీ కట్టమన్నాడు. ఆ చిత్రానికి ఆ చిన్న బందిష్ చాలా జనాదరణ పొందింది.

అప్పటినుండి పండిత్ శివకుమార్ శర్మకు హిందీ చిత్రసీమలో సంగీత సారథ్యం వహించమని ఆహ్వానాలందడం మొదలయింది.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8

హైదరాబాద్ జూన్ : 2022



పండిత్ హరిప్రసాద్ చౌరసియాతో కలిసి శివ హరి జోడీతో మొత్తం ఎనిమిది చిత్రాలకు బాణీలు కూర్చినాడు. కానీ ఇది తనకు సరిపడదని తొందరగానే గ్రహించి చిత్రసీమను వదిలిపెట్టి తన శాస్త్రీయ సంగీత ప్రపంచంలోకి వెళ్లిపోయినాడు. అయితే వారిద్దరూ కలిసి పనిచేసిన చిత్రాల గీతాలు విపరీతంగా జనాదరణ పొందినాయి.

సిల్‌సిలా – చాందిని చిత్రాలకు గాను ప్లాటినమ్ డిస్క్, ఫాస్లే చిత్రానికి గోల్డ్ డిస్క్ అందుకున్నారు. ఝనక్ ఝనక్ పాయల్‌బాజే, సిల్‌సిలా, చాందిని, ఫాస్లే, విజయ్, లమ్‌హే, డర్, పరంపర అనే ఎనిమిది చిత్రాలకు సంగీతం సమకూర్చినాడు. కోట్లాది రూపాయల బడ్జెట్‌తో యశ్‌చోప్రా నిర్మించిన 'సిల్‌సిలా' చిత్రానికి పండిత్ శివకుమార్ శర్మ సంగీతదర్శకుడు అంటే చాలామంది విమర్శకులు ముక్కు విరిచినారు. పెద్దపెద్ద నటీనటులతో నిర్మించబడుతున్న చిత్రం ఇతని వలన విజయవంతమవుతుందా? అనేది వారి అనుమానం. అయితే ఒక్క టైటిల్ సాంగ్‌తోనే వారందరి అనుమానాలను పటాపంచలు చేసినాడు శివకుమార్ శర్మ.

**"దేఖ్ ఏక్ ఖాబ్‌తో యె సిల్‌సిలే హుయే**
**దూర్ తక్ నిగాహెమె హై గుల్ ఖిలే హుయే"**

ఈ గీతంలో పన్నీరు చికలరించినట్లు సంతూర్ స్వరాలు ఎంత మధురంగా వుంటాయో వింటే అర్థమవుతాయి. ఇంకా చాందిని చిత్రంలో "తేరె మేరే హటోంపే మితె మితే గీత్ మిత్‌వా ఆగె ఆగే చలే హమ్ పిఛె పిఛే ప్రీత్ మితువా" ఈ పాట ప్రారంభంలో పండిత్ హరిప్రసాద్ చౌరసియా వేణుగానం, దాన్ననుసరిస్తూ పండిత్ శివకుమార్ శర్మ సంతూర్ స్వరాలు అలరిస్తూ సాగుతాయి. అంతేకాదు 1965లో గైడ్ చిత్రానికి సంగీతం సమకూర్చుతున్న ఎస్.డి.బర్మన్ ఒక పాటకోసం పండిత్ శివకుమార్ శర్మతో తబ్లా వాయింపజేసినాడు. 'మోసే ఛల్ కియా జాయే' అనే లతామంగేష్కర్ పాడిన పాటలకు తబ్లా అందించింది పండిత్ శివకుమార్ శర్మనే!

పండిత్ శివకుమార్ శర్మ అందుకోని పురస్కారం లేదు. అధిరోహించని శిఖరం లేదు. భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మ విభూషణ్ పురస్కారాలతో గౌరవించింది. సంగీత నాటక పురస్కారం – మహారాష్ట్ర గౌరవ పురస్కారాలను అందుకున్నాడు. దేనికీ కొరత లేదు. కుమారుడు తనంతవాడయినాడు. యువ సంతూర్ వాదకులలో పండిత్ శివకుమార్‌శర్మ కుమారుడు రాహుల్‌శర్మ పేరన్నికగన్నాడు. తొలుత తండ్రితో కలిసి కచేరీలు చేసేవాడు. ప్రస్తుతం సొంతంగా కచేరీలు చేస్తూ పురస్కారాలందుకుంటున్నాడు.

ఉస్తాద్ జాకీర్ హుసేన్ అనగానే సాధారణంగా తటాలున గుర్తుకు వచ్చేది 'వాహ్ తాజ్!'. అయితే అది గతం. ఇప్పుడు అదే స్థానంలో మరో యువకుడు కూర్చుని సంతూర్ వాయిస్తూ 'వాహ్ తాజ్' అంటున్నాడు. అతడెవరో కాదు పండిత్ శివకుమార్‌శర్మ కుమారుడు రాహల్‌శర్మ!

నిరంతరం సంగీత సాధనలో మునిగితేలే పండిత్ శివకుమార్‌శర్మ విరామ సమయంలో ఏం చేస్తారో తెలుసా? విదుషి కిశోరీ ఆమోణ్‌కర్ సంగీతం వింటూ తన్మయులవుతూవుంటారు. ఆమె స్వరాలను వినాలనుకొని స్వర్గానికి తరలి వెళ్ళిపోయినారు. పండిత్ శివకుమార్ శర్మ భార్య మనోరమ. కుమారుల్ రాహుల్‌శర్మ, రోహిత్‌శర్మలను వదిలి వెళ్లిపోయినాడు. రాహుల్‌శర్మ ఇంకా కొంతమంది శిష్యుల వలన అతని సంగీతం సజీవంగానే వున్నది. వుంటుంది కూడా!

దశాబ్దాల పాటు శివకుమార్‌కు తోడుగా నిలచి అతని సంతూర్ స్వరాలకు తన వేణువాదన స్వరాలను జోడిస్తూ జుగల్‌బందీలు చేసి శివ – హరి జోడి అనిపించుకున్న పండిత్ హరిప్రసాద్ చౌరసియాను వదలి వెళ్ళిపోయినాడు పండిత్ శివకుమార్‌శర్మ.

అతని పార్థివదేహం వద్ద, హరిప్రసాద్ చౌరసియా విషణ్ణవదనంతో కూర్చుని వున్నచిత్రాలు అంతర్జాలంలో కనబడుతున్నాయి. పండిత్ శివకుమార్‌శర్మను తన గురువుగా భావించుకొని, పెద్దన్నగా గౌరవించి, వందలాది కచేరీలకు తబ్లా సహకారమందించిన ఉస్తాద్ జాకిర్ హుసేన్, పండిత్ శివకుమార్‌శర్మ పార్థివ శరీరానికి భుజమందించి, మోసి, కొంతలో కొంత ఋణవిముక్తుడినయినానను కున్నాడేమో! అంత్యక్రియలన్నీ అయిపోయినా, దహన సంస్కారం జరుగుతున్న సమయంలో చేతులు కట్టుకొని అట్లాగే చూస్తూ నిలబడిపోయిన ఉస్తాద్ జాకీర్ హుసేన్ ఫోటోలు అంతర్జాలంలో వైరలవుతున్నాయి. మత విద్వేషాలను రెచ్చగొడుతూ మానవుల మధ్య అగాథాలు సృష్టిస్తున్న సమాజానికి ఈ దృశ్యం కారుచీకటిలో కాంతిరేఖ వంటిది కాక మరేమిటి? ఈ సందర్భంలో మహాకవి గురజాడ అప్పారావుగారి పంక్తులు యాదికి రావడంలో తప్పు లేదనుకుంటాను.

**"అన్నదమ్ముల వలెను జాతులు**
**మతములన్నియు మెలగవలెనోయి"**

ఈ ఆశావహ దృక్పథంతోనే పండిత్ శివకుమార్‌శర్మగారికి అశ్రు నివాళి సమర్పించుకుంటూ....

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 41 హైదరాబాద్ జూన్ : 2022

# సామెతలు – శాస్త్రాంశాలు

**డా. అట్టెం దత్తయ్య,** తెలుగు అధ్యాపకులు, నిజాం కళాశాల, ఉ.వి. ఫోన్: 9494715445

సామెతలు అన్నిరకాల మనుషుల మాటలలో మిళితమైనాయి. భాషలో భాగమైనాయి. భావవ్యక్తీకరణలో కీలకపాత్ర పోషించే పదాలైనాయి. సామెతలు ఎందరో జీవితాల కష్టసుఖాలనుండి అనుభవపూర్వకంగా అందించిన సందేశాత్మక గుణపాఠాలు. ఎమర్సన్ చెప్పినట్లు ''Proverbs are the literature of reason or statements of absolute truth, without qualification. Like the sacred books of each man, they are sanctuary of its institution'' సామెతలు సంపూర్ణ సత్యాన్ని తెలిపే భాషా వాక్యాలుగా, పవిత్ర గ్రంథాలవలె ప్రతివ్యక్తికి ఉపయోగపడుతుంటాయి. సామెతలలో అన్ని రకాల సందేశాలు, సమాధానాలు, ప్రశ్నలు, చలోక్తులు, సూక్తులు నిండి వున్నాయి. అందులోనుండి సామాజిక శాస్త్రాంశాలను పరిశీలిద్దాం. సామాజిక శాస్త్రాలన్ని సామాజిక ప్రపంచాన్ని పరిశీలించే శాస్త్రాలుగా చెప్పుకోవచ్చు. ఇందులో తత్త్వశాస్త్రం, రాజనీతి శాస్త్రం, మనస్తత్వ శాస్త్రం, సమాజ శాస్త్రం, నీతి శాస్త్రం, ధర్మ శాస్త్రం, ప్రభుత్వ పాలన శాస్త్రం, నిర్వహణ శాస్త్రం మొదలైనవుంటాయి. ఈ శాస్త్రాలు సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను, ఆయా అంశాల అంతర్ సంబంధాలను, కార్యకారణ వివరణలను అన్వేషిస్తాయి. ఈ సామాజిక శాస్త్రాలన్ని మానవ ప్రవర్తన సరళికి సంబంధించినవని చెప్పవచ్చు. ఇవి ఒక్కొక్క విభాగాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయడం ద్వారా ఒక సామాజిక శాస్త్రం మరొక సామాజిక శాస్త్రానికి భిన్నంగా ఉన్న విషయం అర్థమౌతుంది. అయినప్పటికీ ఈ శాస్త్రాలన్ని ఒకదానికొకటి పరస్పర ఆధారాలు, పరస్పర పూరకాలని చెప్పవచ్చు. ఆయా శాస్త్రాలు తమ తమ విభాగాలలో జరిపే పరిశోధనల వల్ల ప్రత్యేకీకరణ పెరిగి అవి మాతృశాస్త్రం నుండి వేరుపడి, శాఖోపశాఖలుగా విడిపోయి ఒక్కొక్క శాఖ తిరిగి ఒక్కొక్క ప్రత్యేకమైన శాస్త్ర పరిధిని, ఉనికిని సంపాదించు కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ కోణంలో చూసినప్పుడు శాస్త్రాలు అనేకంగా దర్శనమిస్తాయి. **''అనేకాని శాస్త్రాణి స్వల్పాయు ర్విఘ్నకోటయః తస్మాత్సారం విజానీయాత్ హంసః క్షీరమివాంభసి''** శాస్త్రాలు అనంతం. ఆయుస్సు అత్యల్పం. దీనిలో కోట్లకొద్ది విఘ్నాలు. కనుక శాస్త్రసారము మహాత్ములను ఆశ్రయించి గ్రహించదగింది. ఎట్లనగా హంస పాలునీళ్లు కలిసున్న పాలను మాత్రమే గ్రహించినట్లని శ్లోకం చెప్తున్నట్లు అన్ని శాస్త్రాలను తెలుసుకోవడం కష్టమైన విషయమే. పూర్వకాలంలోనే ఈ శ్లోకంద్వారా ఆ విషయాన్ని వెలిబుచ్చారు అంటే అప్పట్లోనే అసాధ్యంగా ఉండేదని తెలుస్తుంది. కాని ఇప్పుడు సాంకేతిక పరికరాల వినియోగంలో మునిగిపోతున్న సమాజం ఏ శాస్త్రాన్ని శ్రద్ధగా చదవగలదు అనేది పెద్ద ప్రశ్న. **''ఇదం జ్ఞానదం జ్ఞేయం యత్సర్వం జ్ఞాతుమిచ్ఛతి అపి వర్ష సహస్రాయుః శాస్త్రాంతం నాధిగచ్ఛతి''** ఇది జ్ఞానము, ఇది జ్ఞేయము అని యిట్లు సమస్త శాస్త్రాలను తెలిసికొనుటకై ప్రయత్నించినచో, వేయి సంవత్సరాలైన చాలదు. అన్నట్లు ఎంతటి శాస్త్రాన్ని అయిన పూర్తిగా చదవడం కష్టం. అందులో ముఖ్యవిషయాలను సమాజానికి చేరువకావాలనే ఉద్దేశ్యంతో కొన్ని మంచి మాటలను ప్రచారంలోకి తీసుకువచ్చారు. అటువంటి వాటిలోనివే సామెతలు. ఈ సామెతలలో నుండి కొన్ని శాస్త్రాలకు సంబంధించిన వాటిని తీసి విశ్లేషించే ప్రయత్నం ఈ పత్రం ఉద్దేశం.

**ధర్మశాస్త్రం :** ధర్మమంటే విశ్వశ్రేయస్సుకు ఆధారభూతమైన ఆదర్శమని పెద్దలంటారు. ధర్మాన్ని గురించి భారతం చాలాచోట్ల వివిధ రకాల ధర్మాలను ప్రస్తావించినప్పటికీ అందరికి పనికివచ్చే, పాటించాల్సిన పద్యం.

**''ఒరులేయవి యొనరించిన**
**నరవర యప్రియము తన మనంబున కగుదా**
**నొరులకు నవి చేయ కునికి**
**పరాయణము పరమధర్మ పథముల కెల్లన్ (శాం.5-220)**

వేరేవారు చేసినపని నీకు నచ్చనపుడు ఆ పనిని తిరిగి నీవు చేయకుండా ఉండడమే ధర్మం అని పై పద్యం తెలపుతుంది. ధర్మం అనిర్వచనీయమైనది. ధర్మం ఏకరూపతకానిది. ధర్మం కొన్నిసార్లు కాలానుగుణంగా మారుతుంది. ఇలాంటి ధర్మాన్ని గురించి తక్కువ వాక్యాలలో చెప్పడం అసాధ్యం. ఈ ధర్మానికి సంబంధించి వాడుకలో ఉన్న కొన్ని సామెతలు. ***'ధర్మార్థ కామమోక్షాలను ఇచ్చేది విద్య'*** అంటుంది ఈ సామెత. విద్యలేనివాడు వింతపశువు అన్నారుగా. కొంతైనా జ్ఞానవంతుడు కానివానికి ధర్మం గురించి తెలువడం కష్టం. ఉత్తమ ధర్మమంటే ఏమిటో కూడా భారతంలో కనిపిస్తున్న సామెత తెలియజేస్తుంది. ***'అహింసయే యుత్తమ ధర్మంబగు'*** (భా.ఉ ద్యో.1.335). ***ధర్మానికిబోతే, కర్మం చుట్టుకున్నదట'*** చాలాసార్లు ధర్మం చేయబోతే అది వారిమేడకు శాపమై పడుతుంది. సహాయమో, న్యాయమో చేయబోయిన వారే సమస్యల్లో పడడం వంటిది. ఈ భావాన్ని వ్యక్తపరిచే సామెత ఇది. కాని ఎప్పుడైనా ధర్మమే గెలుస్తుంది. ఈ విషయాన్ని ***ధర్మో జయతి'*** అనే సామెత తెలుపుతుంది. ***'ధర్మానికి దండుగలేదు, వెట్టికి పైసలేదు'*** వెట్టి అంటేనే పైసలు ఇవ్వకపోవడం. ఈ సామ్యాన్ని తెలుపూ ధర్మమంటే ఎప్పుడు దండుగలేనిది, దండుగ తేనిది అని తెలియపరుస్తుంది. కొన్నిసార్లు ధర్మం వృత్తినిబట్టి,

వయసునుబట్టి, జాతినిబట్టి ప్రాంతాన్ని బట్టి ఉంటుంది. వీటన్నిటికి సంబంధించిన సామెతలు కూడా దర్శనమిస్తాయి. ***'సంగ్రామంబు రాజులకు ధర్మంబు'*** సంగ్రామంలో యుద్ధం చేయడం రాజుకు మాత్రమే ధర్మం. ఇది సామాన్యుడు చేయవలిసిన పనికాదు. ***'ధర్మోరక్షతి రక్షితః'*** ఇలాంటి ధర్మానికి సంబంధించిన సామెతలు మనకు తెలియకుండానే ధర్మాన్ని నేర్పిస్తున్నాయి.

**అర్థశాస్త్రం** : అన్ని శాస్త్రాలల్లో కీలకమైనది అర్థశాస్త్రం. సమాజాన్ని తన చుట్టు తింపుకుటున్న శాస్త్రం. ***'ధనమేరా అన్నిటికి మూలం'*** అనే సామెత తెలిపుతున్నట్లు అన్నిటికి ధనమే ప్రధానం. అర్థం లేని జీవితాలు కొన్నిసార్లు వ్యర్థం కూడా. ***'ధనానికి దాపరికము సేద్యానికి వెల్లడి'*** అనే సామెత తెలుపుతున్నట్లు ధనానికి దాపరికం చాలా అవసరం. పైసాపైసా పోగుచేయని వాడు పైకిరాలేదని శాస్త్రాంశం తెలుపుతుంది. మరో సామెతకూడా ఇదే చెప్తుంది. ***'ధనమొస్తె దాచుకోవాలి, రోగమొస్తె చెప్పుకోవాలి'*** అని. ఈ సామెత సామ్యం గమనిస్తే రోగాన్ని ఉన్నది ఉన్నట్లు ఏ మాత్రం దాచుకోకుండా చెప్పాలని, ధనాన్ని కొంచం కూడా తెలియకుండా దాచుకోవాలి ఎరుకపరుస్తుంది. ఎందుకంటే ***'పైసా లేనివాడు పరస్త్రీ వర్జితుడు'*** అర్థిక దరిద్రుడు అన్నిచోట్ల అందరిచేత విడువబడుతాడు. వారు మిత్రులైనా, కళత్రులైనా చాలామంది ధనంకొద్దీ ప్రేమను పంచేవారుంటారు. కాని పైసా అనేకసార్లు చాలామందిని దూరం చేస్తుంది. పైసతో మిత్రులుగా మారారంటే వారిలో స్వర్థముంటుంది. ఆత్మీయ మిత్రులనుకూడా దూరం చేయడానికి వెనుకడదని తెలిపే సామెత ***'పైసా పైసా ఏం జేస్తావంటే, ప్రాణం వంటి మిత్రుణ్ణి పగ చేస్తానందట'*** దీని ద్వారా తెలుసుకోవల్సిందేమంటే ప్రాణంవంటి మిత్రుల మధ్య వీలైనంత ఆర్థిక వ్యవహారాలు లేకుండా ఉండడం చాలా మంచిది. ఇంతటి చక్రాన్ని తిప్పే ఈ ధనం మీద ప్రతిమనిషికి ఎప్పుడో ఒకప్పుడు వైరాగ్యం రాకుండా ఉండకపోదు. ఎందుకంటే ఎంత సంపాదించినా ఏది రాదనే విషయం ఎప్పటికైనా నేర్చుకోవాల్సిందే. ***'ధనము లెచటికేగు, దానేగు నెచటికి'*** ఇలాంటి ఆర్థిక వ్యవహార సామెతలు ***'దోచుకున్నోడికి దోచుకున్నంత'***గా దొరుకుతాయి.

**కామశాస్త్రం** : ప్రాణికోటిలో ధర్మానికి విరుద్ధము కాని (అనుకూల మైన) కామమును నేను అని స్వయంగా కృష్ణభగవానుడు గీతలో "ధర్మా విరుద్ధో భూతేషు కామోస్మి భరతర్షభ..." (శ్లో.7.11) అని చెప్పుకున్నారు. పురుషార్థాలలో 'కామం' ఒకటి. 'కామేశ్వరీ', 'కామరూపిణీ' వంటి పేర్లుగల శక్తిరూపాలను ఆరాదిస్తున్నారు. అంటే కామం అనేది ఆరాధనీయమైనది, ఆచరణీయమైనది. కానీ పైన శ్లోకంలో చెప్పుకున్నట్లు ధర్మానికి విరుద్ధం కాకుండా ఉండాలి. కామానికి ఉన్న అర్థాలలో కోరిక కూడా ఒకటి. ***'కామము కాలమెరుగదు'*** అనే సామెత ప్రకారం కామం నిరంతరం మనిషిని పరితాపం చెందిస్తూనే ఉంటుంది. మరో సంస్కృత సామెత ***'కామా తురాణాం నభయం, నలజ్జ'*** అని తెలుపుతుంది. కాలమెరుగక పోవడం మాత్రమే కాదు భయాన్ని, సిగ్గును కూడా ఎరుగదు. కోరిక తీవ్రతరం అయినప్పుడు సమయంతో, భయంతో, సిగ్గుతో పనిలేకుండా తెగిస్తాడు మానవుడు అని తెలుపుతాయి. మరో సామెత కామం ఎంత గుడ్డితో తెలుపుతుంది. ***'కామానికి కళ్ళులేవు, గుడిసేటికి గుణము లేదు'***. అట్లని కామాన్ని పరిత్యజించుమని కాదు. ఎందుకంటే ***'కామిగాని వాడు మోక్షగామికాడు'*** మోక్షమార్గంలో పయణించే వానికి కూడా కామం అవసరమే. కామం బారిన పడనివారు బహుశ ఉండరేమో. అందుకే భారతంలో ఒక సామెత ***'కాముశక్తి నోర్వగలరె జనులు'*** ( భారతం-ఆది. 3,38)' అంటుంది. కామాన్ని భరించిన వారు, జయించినవారు అరుదు. అందుకేనేమో **"ఎంతవారలైనా కాంతాదాసులే...."** అన్నట్లుగా సౌంగధర చరిత్రము లో ***'పరవశాత్ముల్ గారె కామాతురుల్'*** (తృ.ఆ.63 ప) కామేష్టు లందరు పరవశాత్ములే అంటుంది. కోరిక నెరవేరాలంటే మరొకరికి దాసులు కావల్సిందే. కొన్నిటికి మాత్రం కామం ఆటంకాన్ని కలిగిస్తుంది. ఈ విషయాన్ని తెలిపే భాగవతంలో గల సామెత ***'కామంబు భక్తి యోగంబునకు నంతరాయంబు'*** (7,371) అని తేల్చి చెపుతుంది. అతి కామం ఎక్కడ, ఎవరికి పనికిరాదు.

**నీతి శాస్త్రం** : ధర్మానుకూలంగా నడుచుకోవడమే నీతి, న్యాయం. 'నయతి ఇతి నీతిః' అని నీతి శబ్దానికి అర్థం. లోకాన్ని ముందుకు నడిపించేదని అర్థం. అట్లే 'నయనా'నికి, 'నేత్రా'నికి కూడా ఇదే అర్థం కనిపిస్తుంది. కళ్ళు ప్రాణిని నడిపించేవి. ఇక్కడ నీతి అంటే సమాజానికి కళ్ళు. కళ్ళుండి మూసుకున్నా కళ్ళు లేకపోయినా మనం ఏమీ చేయలేము. ఉన్నచోట ఉండడం కూడా కష్టమే. నీతి అలాంటిదే. సమానికి కళ్ళవంటిది. కాని ఇప్పుడు సమాజం ***'నిజమాడితే నిష్ఠూరం'*** అన్నట్లుగా ఉంది. నిజం మాట్లాడిన వానికి చోటులేదు అనే స్థాయిలోకి జారుకుంది. అయినప్పటికి ఎప్పుడూ ***'నిజము నిలుకడమీద తెలుస్తుంది'***. నిజానికి చాలాసార్లు నిందలు రావచ్చు. కాని అవి తిరిగి వాస్తవాన్ని తెలుసుకుంటాయి. ఎప్పటికి నీతి అవమానం మాత్రం రాదు. ఈ విషయాన్నే ***'నిజముకు నింద వచ్చునుగాని అవమానము రాదు'*** ఈ సామెత తెలియజేస్తుంది. నిజం నీరులాంటిదని సామ్యం చెపుతూ నీరు పల్లానికి వెళ్ళినట్లు నిజం సరైన మార్గంలోనే ఉంటుంది దానిని దేవుడు తెలుసుకుంటాని **'నిజము దేవుడెరుగు నీరు పల్లమెఱుగు'** అనే సామెత వివరిస్తుంది. నీతితో మాట్లడటం అందరికి సాధ్యంకాదు. కాని రెండు రకాల వారు కచ్చితంగా నిజం మాట్లాడుతారనే విషయాన్ని **'నిజం చెప్పేది పసిబిడ్డలు, తప్పుతాగినవాళ్ళు'** ఈ సామెత వివరిస్తుంది. ఇవేకాకుండా **'న్యాయం అమ్మువాడు, తోవలు దోచువాడు ఒకటే', 'న్యాయము తప్పినవాడికి ఆచార్య కటాక్షమెందుకు?'** వంటి వాటిని గమనించ

| సామెత | వివరణ |
|---|---|
| ❖ అంబలి తాగే వాడికి మీసాలు ఒత్తేవాడు ఒకడు | ❖ చేస్తున్న చిన్న పనికి అధిక సహాయాన్ని కోరడం |
| ❖ అడవిపంది చేను మేస్తే, ఊరపంది చెవులు కోసినట్లు | ❖ తప్పు చేసిన వారిని శిక్షించలేక, నిరపరాధిని శిక్షించడం |
| ❖ గుడ్డికన్న మెల్ల మేలు | ❖ అసలేమీ లేనిదాని కంటే, ఏదో ఒకటి ఉండడం మంచిది |

వచ్చు. ఈ నీతికి సంబంధించిన సామెతలు భారత, భాగవత, రామాయణాది గ్రంథాలలో చాలాచోట్ల దర్శనమిస్తాయి. ప్రత్యేకంగా 'చాణక్యనీతి', 'విదురనీతి', 'కణికనీతి' వంటి వ్యక్త్యాధారిత నీతులు కూడా కనిపిస్తున్నాయి.

**వైద్య శాస్త్రం** : 'వైద్యో నారాయణో హరిః' అని అందరికి తెలిసిందే, అందరు నమ్మేదే. కాని ఇప్పటి వైద్యులందరినీ ఆ దృష్టితో చూడలేం. అందుకే పూర్వంనుండి అనేక శాస్త్రాలు వైద్యులకుండవల్సిన లక్షణాలను తెలుపుతూనే ఉన్నాయి. గొప్ప వైద్యులకు ప్రణమిల్లుతూనే ఉన్నాయి. చరకుడు **"యేతు శాస్త్ర విదో దక్షాః శుభయః కర్మకోవిదాః / జితహస్తా, జితాత్మానస్తేభ్యో నిత్యం కృతం నమః"** దీని అర్థం **"వైద్య శాస్త్రంలో పరిపూర్ణ జ్ఞానాన్ని ఆర్జించిన వాడు, వైద్యం చేయడంలో నైపుణ్యం గలిగి బాహ్యాభ్యంతర శుచి, శుభ్రత కలిగి వైద్యసేవలందిచే ఉత్తమ వైద్యులకు నిత్యం నమస్కరిస్తున్నాను"** అంటాడు. వైద్యశాస్త్రం, వైద్యుడు సర్వదా వందనీయులు. ఈ శాస్త్రానికి సంబంధించిన సామెతలు కొన్నిటిని గమనించినపుడు వైద్యుడి గురించి, వైద్యం గురించి, మందుల గురించి, పథ్యం గురించి తెలియజేసేవి కనిపిస్తాయి. **'వైద్యం నేర్వనివాడు వానకు తడియని వాడు లేడు'** ఏదో ఒకరకమైన వైద్యం ఇంచుమించు అందరికి వస్తుంది. దానికి చెప్పిన సామ్యంతోనే అర్థం చేసుకోవచ్చు. ప్రతివ్యక్తి ప్రథమ చికిత్స చేసేవాడే. వైద్యుడు వైభవంగా బతకాలి అంటే వ్యాధులను కోరుకోవాల్సిందే. ఈ భావాన్నే అందిస్తున్న సామెత **'వైద్యులు రోగాలు కోరు, వైశ్యుడు కరువుకోరు'**. ఎవరి లాభాన్ని వారు కోరుకుంటారు. ఎంతటి వైద్యుడికి మరణం తప్పదు అనే అర్థంలో వాడుకలో ఉన్న సామెత **'వైద్యుడి పెండ్లాము కూడా ముండమోసేదే అన్నాడట'**. **'వ్యాధి వచ్చినవాడు వెట్టిబట్టినవాడు ఒకటే'** ఈ సామెత రోగికి నిరంతరం అదే చింత అనే విషయాన్ని తెలుపుతుంది. రోగాన్ని దాచుకోకూడదు, ధనాన్నో, సంసారాన్నో దాచుకోవాలి అని తెలుపుతూ ప్రసిద్ధమైన సామెత **'వ్యాధి రట్టు సంసారం గుట్టు'**. ఇలాంటి సామెతలెన్నో వైద్యశాస్త్రాన్ని గురించి బోధించేవే.

సామెతలకు శాస్త్రం అనే పేరుకూడా ఉంది. సామెతలలో అధికభాగం శాస్త్రాంశాలను బోధించేవిగానే కనిపిస్తుంటాయి. పైన పేర్కొన్న శాస్త్రాంశాలతో పాటు తర్కశాస్త్రం గురించి తెలిపే సామెతలను కూడా గమనించవచ్చు. **'మనిషికి మాటే అలంకారం'**, **'నాలుక దాటితే నరకము'**, **'నాదముంటే గంట, వాదముంటే తంట'**, **'మనిషి పేదయితే మాట పేదా?'** వంటివి ఆలోచనీయమైనవి. ఖగోళశాస్త్రానికి సంబంధించిన సామెతలలో **'ఆకాశం పొడువు ఆకాశమే ఎరుగు'**, **'ఆకాశంలో గొఱ్ఱెతొక్కుడు పడితే, అతిసమీపంలో వర్షం'**, **'భరణి కురిస్తే ధరణి పండును'**, **చిత్తలో వానలు పడే చింతలు కాస్తయి'** మొదలైనవి సామాన్యులకు సహితం కంఠస్థంగా నిలిచిపోయాయి. పరిపాలన శాస్త్రానికి సంబంధించిన అనేక సామెతలు కనిపిస్తాయి. పాలన అనేది వ్యక్తి నుండి వ్యవస్థ వరకు అన్ని రంగాలలో ఉంటుంది. అందులో ఎందరో అనుభవాలు ఈ సామెతలు **'రాజుల సొమ్ము రాళ్ళ పాలు'**, **'రాజులు పోతే రాజ్యాలు పోతాయా?'**, **'రాజు కత్తికి రెండువైపులా పదునే'**, **'రాజు ఎంతో ప్రజలు అంతే'** మొదలైనవి. వాణిజ్యశాస్త్ర సంబంధ సామెతలు కూడా **'వ్యాపారం జోరుగా సాగిపోతున్నది. రెండో బత్తెను అమ్మి డబ్బు పంపమన్నట్లు'**, **'వ్యాపారి విత్తంబు వారకాంతల పాలు, కల్జుని విత్తము రుంజకాని పాలు'** వంటివి. **'మనో వ్యాధికి మందులేదు'** వంటి సామెతలు మచ్చుకు మానసిక శాస్త్రాన్ని తెలియజేస్తాయి. వీటితో పాటు వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం ఇలా అనేక శాస్త్రాలకు సంబంధించిన సామెతలను చూడవచ్చు. ఏ సామెతను తడిమిన ఒక శాస్త్రాన్ని గుర్తుచేస్తుంది. ప్రతి సామెత ఒక శాస్త్రీయతను సంతరించుకుందనే చెప్పవచ్చు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 (44) హైదరాబాద్ జూన్ : 2022

# సమీక్ష ఉద్యమ ప్రస్థానాన్ని పలికించిన 'బ్లూ స్కార్ఫ్' నవల

**ఇమ్మిడి మహేందర్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9505645706

సమాజ పరిణామక్రమాన్ని ఒడిసిపట్టి అక్షరీకరించడం అందరికి సాధ్యమయ్యే పని కాదు. సృజనాత్మకంగా అక్షరీకరించడం మరింత కష్టసాధ్యమైన పని. జీవితం సంఘర్షణల మయం. సంఘర్షణ లేనిదే వికాసం లేదు. ప్రజల జీవన సంఘర్షణను కళాత్మకంగా వ్యక్తీకరించడం వర్తమాన సాహితీకారుల బాధ్యత. ఈ నేపథ్యం నుంచి ప్రొఫెసర్ కాశీం "జానకి విముక్తి నవల – ప్రాసంగికత" అనే వ్యాసంలో రాసిన మాటలను గుర్తుచేసుకోవచ్చు. **"ఏ కాలంలోనైనా సాహిత్యం సమాజ నిర్మాణాన్ని ఆధారం చేసుకుంటుంది. ఆయా సమాజాలలోని వ్యక్తుల జీవితంలో పెనుగులాట ఉంటుంది. ఆ పెనుగులాటనే సామాజిక జీవితంలో నూతనత్వాన్ని వికసింప చేస్తుంది. ప్రతి సమాజం తనకు కావలసిన ఉత్పత్తి శక్తులను తయారు చేసుకుంటుంది. అదే విధంగా ఆ సమాజపు రీతిలోనే ఉత్పత్తి సంబంధాలు నిర్ణయమవుతాయి. ఉత్పత్తి సంబంధాలకు ఆవల ఏ మనిషిని ఊహించలేము. కనుక సమాజంలోని ఉత్పత్తి సంబంధాల సృజనాత్మక వ్యక్తీకరణనే సాహిత్యంగా ఉంటుంది"** (కాశీం, సి. సూర్యాధనంజయ్ (సంపా) వివేచన 28వ సంచిక: 35) సమాజంలోని పెనుగులాటకు ప్రజల్లో ఉండే చైతన్యమే చమురు. ఆ చైతన్యమే సమాజ మార్పుకు దోహదం చేస్తుంది. ఇలాంటి మార్పుకు దోహదం చేసే అనేక సామాజిక క్రియల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రచయిత పాల్గొంటాడు. ప్రభావితం అవుతాడు. ఒక్కో రచయిత తన సమీప కాలంలో లేదా జీవన పథంలో తాను చూసిన సంఘటలను అక్షరీకరించే ప్రయత్నం చేస్తాడు. సరిగ్గా ఈ కోణంలోనే రచయిత విప్లవ కుమార్ రాసిన బ్లూ స్కార్ఫ్ నవలను చూడాలి.

కథతో పోలిస్తే నవలకు విస్తృతి ఎక్కువ. జీవితంలోని అనేక పార్శ్వాలను స్పృశించేందుకు ఇందులో వీలు ఉంటుంది. కథ రాద్ధామని ప్రారంభమైన ఈ రచన నవలగా రూపుదిద్దుకుంది. దానికి కారణం వస్తువుకున్న విస్తృతే. విశాల సమాజం అందులో భాగం కావడం. చెప్పేదాన్ని సృజనాత్మకంగా వ్యక్తీకరించేందుకు ప్రయత్నించడం ఇందుకు కారణం కావచ్చు. మానవ స్పందనలు, ప్రేమ, కోపం, ఆలోచన, ఆచరణ వంటి అనేక భావనలు పొందుపరిచేందుకు నవల బాగా పనికి వస్తుంది. **"నిప్పులు కురిసే చరిత్రను కూడా సృజనాత్మకంగా, కల్పనగా సమాజం ముందు ఉంచగలిగే వెసులుబాటు నవలకు ఉంటుంది. ఒక సమాజపు రాజకీయార్థిక చరిత్రను ఉన్నది ఉన్నట్టుగా చిత్రించి ప్రత్యక్షం చేయగలుగుతుంది నవల. సమాజ జీవితంలోని వైరుధ్యాల్ని, ఘర్షణను కళాత్మకంగా చిత్రించిన నవలలు కాలాతీతంగా ఉంటాయి."** (పైదే: 36) సరిగ్గా ఈ దృష్టితోనే రచయిత ఈ కథను చెప్పడానికి నవలా ప్రక్రియను ఎన్నుకున్నాడు.

21వ శతాబ్దపు ప్రారంభంలో, తెలుగు నేలలో జరిగిన మహత్తర పోరాటం విద్యుత్తు ఉద్యమం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరెంట్ చార్జీల పెంపుకు నిరసనగా వామపక్ష పార్టీలు, ప్రతిపక్ష పార్టీల సారథ్యంలో ఈ ఉద్యమం జరిగింది. రాజకీయంగా ఈ ఉద్యమంపై అనేక రకాల డాక్యుమెంటేషన్ జరిగింది. వార్తలు, ప్రత్యేక కథనాలు, కవితలు వచ్చాయి. కానీ, నవల వంటి ప్రక్రియల రూపంలో విద్యుత్తు ఉద్యమం తాలుకూ చరిత్ర రాలేదు. ఆ లోటును విప్లవ కుమార్ తీర్చాడు. ఈ నవల విద్యార్థి ఉద్యమ కోణం నుంచి విద్యుత్తు ఉద్యమాన్ని సృజనాత్మకంగా చిత్రించింది. చరిత్రకు, సాహిత్యానికి ఉన్న భేదాన్ని రచయిత పట్టుకున్నాడు. చరిత్రను సృజనాత్మకంగా మనకందించాడు. విద్యార్థి సంఘాల పనితీరు, నిర్వహణ, పోరాటాల వ్యక్తీకరణ చోటు చేసుకున్న నవల బ్లూ స్కార్ఫ్. నవలా రచయిత విద్యార్థి నాయకుడు కావడం, అందునా పోరాటాల జిల్లా నల్లగొండవాడు కావడం వల్ల ఉద్యమ జీవిత చిత్రణలో సఫలమయ్యాడు.

నవల ప్రారంభమే ఛలో హైదరాబాద్ కార్యక్రమంతో ప్రారంభమవుతుంది. యుద్ధ వాతావరణంలో బ్లూ స్కార్ఫ్ ప్రస్తావన తెచ్చి, పాఠకులను గతంలోకి తీసుకెళ్తాడు. ఈ నవల విద్యార్థి నాయకుడు రావణ్ చుట్టూ తిరుగుతుంది. రావణ్ విద్యార్థి నాయకుడు కావడం అందులో రచయిత ప్రతిఫలించడం సహజంగానే పాఠకునికి స్ఫురణలోకి వస్తుంది. విప్లవ కుమార్ విద్యార్థి నాయకుడు. అందులో మార్క్సిస్టు దృక్పథం ఉండటంతో నవలలో చాలాచోట్ల మార్క్సిస్టు అవగాహనలు కన్పిస్తాయి. అవి ఆచరణ రూపంలో వ్యక్తమవుతాయి. స్నేహ రావణ్ పాత్రలు స్నేహానికి మరోపేరుగా ఉంటాయి. స్నేహ పాత్రని చిత్రించడంలో స్త్రీల పట్ల మార్క్సిస్టుల అవగాహనలు కన్పిస్తాయి. నవల ప్రారంభంలోనే యుద్ధ వాతావరణంలో సైతం స్నేహ అసమాన పోరాటాన్ని చిత్రించడం దీనికి మొదటి ఉదాహరణ. పోరాటం, యుద్ధాలలో స్త్రీలు కూడా సగభాగమే. తర్వాత జరిగిన అనేక విద్యార్థి పోరాటాల్లో స్త్రీగా స్నేహ ప్రాతినిధ్యం, విద్యార్థి సంఘ రాజకీయ తరగతుల సందర్భంగా జరిగిన సంభాషణల్లో స్నేహ, విజయల సంభాషణలు, వారిని రావణ్ ప్రోత్సహించడం వంటి అనేక సంఘటల ద్వారా రచయిత మార్క్సిస్టులకు స్త్రీల పట్ల ఉండాల్సిన అవగాహనను తెలియజేశారు.

నవల ప్రారంభమే యుద్ధ వాతావరణాన్ని చిత్రించి తర్వాత నవలలోకి తీసుకెళ్లడం నవల ఎత్తుగడ. ఆ చిత్రణలోనే స్కార్ఫ్ ప్రస్తావన వస్తుంది. "అవునా ఈ స్కార్ఫ్ నీ దగ్గరకెలా వచ్చింది".

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 (45) హైదరాబాద్ జూన్ : 2022




అసలు ఈ స్కార్ఫ్ ఏంటి?, ఎవరిది?. స్నేహ దగ్గరికి ఎందుకు వచ్చింది?. ఈ నవలలో ఆ స్కార్ఫ్‌కి ఎందుకు ప్రాధాన్యత ఉంది? వంటి అనేక ప్రశ్నలు పాఠకుల్లో ఉదయిస్తాయి. యుద్ధ సమయంలో తుపాకుల మోత, రాళ్ల వర్షంలో కూడా స్నేహ లాంటి తోటి కామ్రేడ్స్ చేసిన అసమాన పోరాటాన్ని చిత్రించడం మార్క్సిస్టు అవగాహనలో భాగమే.

శివయ్య, శివమ్మల పాత్రల పరిచయంతోనే ఈ నవలకు అవసరమైన నేపథ్యం చెప్పడం నవలా శిల్పం. పాఠకుడిని నవలలోకి నెమ్మదిగా లాగేసుకునే ప్లాన్.

గ్రామాల్లో ఈనాడు సెల్‌ఫోన్ వచ్చి అన్ని ఆటలను మింగేసింది. కలయికలకు దూరం చేసింది. కానీ, ఆనాడు గ్రామాల్లో ఈత ప్రధాన ఆట. అందులో డైవ్ కొట్టడం, గడ్డ పారేయడం, గుమ్మడి పండు కొట్టడం వంటివి కూడా ఉండేవి. ఈ నవల పాఠకుడు ఊరి నుంచి వచ్చినట్లయితే అతడు ఈత కొట్టిన రోజులను గుర్తు చేసుకోక మానడు. ఇప్పటి వరకు అందరికి ఉన్న సాధారణ అవగాహననే ఉంటుంది. కానీ రచయిత నవలకు మూల సరుకైన కరువును సూచించడం చందు అనే పాత్ర ద్వారా చెప్పిస్తాడు. అది కలలో వస్తుంది. **"కరువు పాడుగాను. ఈ కరువొచ్చి ఆకలి, దూపకు, ఆనందాలకు ఎడబాసిపోతిమి. ఏం జేద్దాంర మరీ"** అని చెప్తూ కరువు ప్రాంతం అని స్ఫురణలోకి తెస్తాడు. పోలికలు కూడా ఆ ప్రాంతం తాలూకా స్వభావం నుంచే ఎన్నుకున్నారు రచయిత. కరువు కావడంతో ఆకులు రాలిన చెట్లు, టీబీ వచ్చి బాధ పడుతున్న మనిషిలా చూస్తున్నాయి వంటి వర్ణనలను సైతం గ్రామీణ, రైతు, వ్యవసాయ నేపథ్యం నుంచి వర్ణించారు. అమ్మాయిని వర్ణిస్తూ **'విశాలమైన నుదురు', 'నల్ల రేగడి కళ్లు', 'నైలూ నదిలాంటి జడ', 'పైరు మొక్క పంజాబీ డ్రెస్సులో వచ్చినట్లనిపించింది', 'పాల నవ్వుల పూల వెన్నెలలా అడుగులేస్తుంది', 'యాసంగి దాటినంక వాన కోసం ఎదురు చూస్తున్న రైతులా', 'వర్షాకాలంలో నిండిన చెరువు అలుగు దుంకి పరిగెత్తుతున్నట్లు', 'పచ్చని పొలాల మధ్య పారే కాలువలా'** వంటి వర్ణనలు ఉన్నాయి. పోలికలు ఉన్నాయి. వానల కోసం కప్పల పెండ్లి, వరద పాశం, పాటలు పాడటం వంటి అంశాలను కూడా చిత్రించారు. ఈ కప్పల పెండ్లి సందర్భంలోనే రచయిత సామాజిక బాధ్యత మనకు కన్పిస్తుంది. మూఢ నమ్మకాలు, వాటిపై తన అభిప్రాయాన్ని చెప్తూ,

**"కప్పల పెండ్లి చేసి, వరద పాశం పోసినట్లయితే ఇలా చేస్తే వానలు పడితే దేశమెప్పుడో బాగుపడేది కదా రావణ్. ఇది అనాదిగా వస్తున్న నమ్మకమే కానీ, నిజం కాదు చందు."** అని ఇక్కడితో ఆగిపోవడం లేదు. కారణం చెబుతున్నాడు. **"వాళ్లకు వ్యవసాయం మీద ఉన్న ప్రేమతో చేసారు"**. ఇంకా ఇక్కడితో ఆగిపోలేదు. మరికొంత ముందలికి పోయి **"ప్రభుత్వాలకు రైతుల మీద ఎలాంటి కన్సర్న్ లేదు. వ్యవసాయాన్ని పట్టించుకోని పాలకులతో పోలిస్తే ఈ మహిళలు చేసిందాన్ని నిందించలేం కదా చందు"** అంటూ ఒక విద్యార్థి నాయకుడికి ఉన్న సదావగాహన తీసుకువస్తారు.

ఏ ఉద్యమాలకైనా పాట ప్రజా వాహిక. అది ప్రజలకైనా, ఉద్యమకారులకైనా, పెట్టుబడిదారులకైనా, నయా భూస్వామ్యులకైనా, మనువాదులకైనా పాట వాహికగా పనిచేస్తుంది. అనుకున్న భావాలను, రాజకీయాలను ప్రజలకు తెలియజెప్పడంలో పాటది ప్రధాన పాత్ర. ఈ నవలలో సహజంగానే పాట ప్రస్థావన ఉంది. ఈ నవలా నేపథ్యం ఉద్యమ చిత్రణ కావడం, అందులో విద్యార్థి ఉద్యమం, విద్యుత్ ఉద్యమం తాలుకూ చైతన్య పోరు గీతాలు ప్రజా నాట్యమండలి అనే సాంస్కృతిక విభాగం కట్టిన పాటలు మనకు కన్పిస్తాయి. సందర్భానుసారంగా వినిపిస్తాయి. అదే సమయంలో ప్రజాకవుల జీవితాన్ని ఆర్ద్రంగా కళ్లముందర ఉంచుతుంది ఈ నవల.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థి ఉద్యమాలను గమనిస్తే విద్యార్థులు సమాజంలో జరిగే ప్రగతిశీల మార్పులకు తమదైన ప్రాతినిధ్యాన్ని ఇచ్చారు. ప్రపంచ పోరాటాల్లో విద్యార్థుల రక్తం చిందని పోరు లేదు. ఈ నవలా వస్తువైన విద్యుత్తు ఉద్యమంలో కూడా విద్యార్థుల పాత్ర గొప్పది. విద్యార్థి విభాగాలు రైతు ఉద్యమాలకు చేయూతనివ్వడం ఇందులో ప్రధానంగా కన్పిస్తుంది. విద్యార్థుల స్లోగన్స్ క్రియేటివ్‌గా, మోడ్రన్ గా ఉంటాయి. స్లోగన్స్ "గన్స్"గా ఎలా పనిచేస్తాయో విద్యార్థి సంఘాల్లో పనిచేసిన కార్యకర్తలకు బాగా అనుభవంలోకి వస్తాయి. మరీ ముఖ్యంగా స్లోగన్స్ క్రియేటివ్‌గా చెప్పడంలో రావణ్‌ది అందెవేసిన చేయి. విద్యార్థి సంఘాల్లో పనిచేసిన వారికి స్లోగన్స్ ఎంత ఉత్సాహపరచగలవో తెలుస్తుంది.

ఈ నవల విద్యార్థి ఉద్యమ నేపథ్యంలో విద్యుత్తు ఉద్యమాన్ని చిత్రిస్తుందని ముందే చెప్పుకున్నాం. విద్యార్థి సంఘ నేపథ్యం కావడంతో సంఘ కార్యక్రమాల

వరుసలో వికాసం కన్పిస్తుంది. సందర్భం వచ్చినప్పుడల్లా ఛాయ్ ప్రస్థావన వస్తుంది. విద్యార్థి సంఘాల్లో పనిచేసే కార్యకర్తలకి ఛాయి తాగడం ప్రధాన వ్యసనం. ఈ వ్యసనాన్ని చెప్తూనే మాడే కడుపులకు ఆకలి రుచిని మరిచిపోయేలా చేసే ఔషధం అని ఛాయ్ ఎక్కువగా తాగడం అనే దానికి కారణం అని చెప్తాడు. గర్ల్స్ కన్వెన్షన్లో అశ్లీల చిత్రాలకు వ్యతిరేకంగా పోరాటాలు, వివిధ సమస్యలపై సెమినార్ నిర్వహించడం, స్టడీ క్యాంపు, ప్రేమ వివాహాలు, యుక్త వయస్సు ఆదర్శ వివాహాలు వంటి అంశాల ప్రస్తావన ఈ నవలలో చోటు చేసుకున్నాయి. ప్రేమ వివాహాలు చేసుకున్న వారిని పరువు హత్యల పేరిట చంపేస్తున్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో వీటి సంఖ్య పెరిగింది. దీనికి కారణం ప్రజల్లో పోగవుతున్న కుల స్వభావం. కులాన్ని గొప్పదానిగా భావించడం. దీన్ని పెంచి పోషిస్తున్నవి మతోన్మాద భావజాల సంస్థలు. ప్రేమ వివాహాలు చేసుకున్న వారికి రక్షణగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఒక ఆలోచన ఇందులో కన్పిస్తుంది.

గ్రామాల్లో వ్యవసాయ సంక్షోభం, వృత్తుల సంక్షోభం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడం, కరువు, పాలకుల ఎత్తుగడలు, విద్యార్థుల పోరాట ఎత్తుగడలు, వాగ్గేయకారుల పాటలు, విద్యార్థి నాయకుల ప్రసంగాలు వారి సమస్యలతో పాటు వాటి మూలాలను అన్వేషించే తత్త్వం, సామాజిక, రాజకీయార్థిక అవగాహనలు గల నాయకుల ప్రసంగాలు ఉండటం, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు చేసిన విధ్వంసాన్ని ఎదుర్కోవడంలో విద్యార్థి సంఘాలు పని చేసిన తీరు, వివాహం సందర్భంలో కులాల ప్రస్తావన, పరువు పేరుతో పిల్లల కోరికలపై నీళ్లు చల్లడం వంటి అనేక జీనవ సంఘర్షణలు ఇందులో ఉన్నాయి.

ఈ నవలలో రావణ్‌కి మూడు సందర్భాల్లో గాయాలు అవుతాయి. మొదటి గాయంతో సీతతో పరిచయం బలపడుతుంది. రెండవ గాయంతో సీత ప్రేమ బయటపడుతుంది. మూడవ గాయంతో సీతకు రావణ్ శాశ్వతంగా దూరమవుతాడు. ఈ గాయాల సందర్భంగా రచయిత అంతస్సూత్రంగా లాల్ నీల్ ఐక్యతను సృజనాత్మకంగా, గూఢంగా ప్రతిపాదిస్తాడు. ఇట్లాంటి గూఢత కలిగి, ఆర్ద్రతతో విషయాన్ని పాఠకుని గుండెను తాకే సన్నివేశాలు, ఆలోచనలకు పదును పెట్టే సంభాషణలు అనేకం ఉన్న ఈ విద్యార్థి, విద్యుత్తు ఉద్యమ చరిత్ర సాహిత్యంగా మారింది. హృదయాన్ని ద్రవింపజేసే సంఘటనలు అనేకం. రచయితకున్న ప్రాపంచిక దృక్పథాన్ని నవలలో ప్రతిసందర్భంలో వ్యక్తం అయ్యేలా చూసాడు. సందర్భానుసారంగా మార్క్సిస్టు అవగాహనలు వ్యక్తం చేసాడు.

విప్లవ కుమార్ మొదటి రచన ఇది. రచనలో ఇంకాస్త జాగ్రత్త వహించాల్సి ఉంది. కొన్నిసార్లు రాజకీయ ప్రబోధ ఎక్కువగా ఎక్కువగా చేసినట్లు అనిపించింది. వస్తువే రాజకీయాలు అయినప్పుడు ఇలాంటి అవగాహన సహజం. సందర్భం వచ్చినప్పుడల్లా తనకున్న విషయావగాహనను అర్థం చేయించేందుకు ప్రయత్నించినట్లు పాఠకునికి అనిపిస్తుంది. మొత్తానికి పాఠకునికి శ్రమను తగ్గించే పనులు విప్లవ కుమార్ ఎక్కువగా చేసాడు. రచనను చదివిన తర్వాత రచయిత చెప్పిన విషయాన్ని తన జీవన అనుభవంలోకి తెచ్చుకోవడానికి ఆలోచనలను నెమరు వేసుకోవాల్సి ఉంటుంది. నెమరు వేసుకునే పనిని విప్లవ కుమార్ మనకు తగ్గించి విషయాన్ని సూటిగా, సుత్తి లేకుండా అందించాడు. విషయ బోధన అనేది గూఢంగా జరగాలి. భారతీయులకు, మరీ ముఖ్యంగా తెలుగు వారికి విషాదాంత సాహిత్యం నచ్చదు. వారు మోదాంతాన్నే కోరుకుంటారు. వర్తమాన సమాజమే విషాదం అయినప్పుడు నవల విషాదాంతం కావడంలో ఆశ్చర్యమేమి లేదు. ఈ 'నవలోద్యమం'లో ఒక తార నేలరాలుతూ తన రక్తంతో, బ్లూస్కార్ఫ్‌ని ముద్దాడుతుంది. రావణ్ సమీప సుందర భవిష్యత్తును కలగన్నాడు. ఆ ఆశయ సాధనలో మరింత సాహిత్యం వెలువడి అటువంటి అమరుల ఆశయాన్ని సాధించాలి. ప్రజా సాహిత్యం, సంస్కృతి – కళలు వర్ధిల్లాలి.

### ఏది కవిత...

కవిత ప్రభావం ఉల్లాసమొ! వేదనయొ
ఏదో ఒక నేపథ్య స్వరం! స్వనిస్తుంది సూక్ష్మంగా
పాత నంటి కొత్త ప్రవేశంతో జీవన ప్రవాహం
ఎప్పటికీ అవసరమైన అనుభవ సుందర రూపం

(మాదిరాజు రంగారావు)



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 (47) హైదరాబాద్ జూన్ : 2022

సమీక్ష

# సజీవ చిత్రాలలోని – నేను

**బి. రమేష్,** పి.జి.టి (తెలుగు), తెలంగాణ ఆదర్శ పాఠశాల, నాగ సముద్రాల. ఫోన్: 9908912662

కథా సాహిత్యంలో విభిన్నమైన ఆలోచనలతో, పోకడలతో కథకులు తమ దార్శనిక దృష్టితోనూ, అనుభవైక వేద్యంతోను సంఘటనల పట్ల వివేచితుడౌతూ ఆయా అంశాలను పదుగురికి పంచాలన్న భావనతో కొందరు కథకులు కథలు వెలువరిస్తుంటారు. నిజానికి కథలు రచయిత యొక్క ఊహాజనితములు అనుకున్నప్పటికీ అతను చూసిన సమాజచిత్రణను తన మాటలతో చెప్పడానికి ప్రయత్నిస్తారు. రచయిత కండ్ల ముందట వ్యక్తుల జీవనశైలులను, వారి మనస్తత్వాలను చేష్టలను కూడా చిత్రికరించే ప్రయత్నం చేస్తారు.

కథ రాసేటప్పుడు రచయిత ఉత్తమ పురుష కాకుండా మధ్యమ పురుషలో చెపుతుంటారు. కాని ఉత్తమ పురుషను ఎన్నుకున్నప్పుడు కథకుడు నేను అనే భావనను పాఠకుడికి కనబడుతున్న ఆ "నేను" రచయిత కాకుండా ఉండటానికే ప్రయత్నిస్తాడు. అనగా తాను పొందిన అనుభూతిని చూసిన సంఘటనల పట్ల ప్రభావితుడై ఉత్తమ పురుషలో కథ చెప్పడం అనేది కత్తి మీద సాములాంటింది. అందుకు ఆ రచయితకు ఆత్మవిశ్వాసంతో పాటు నిక్కమైన మనోస్థైర్యం కూడా ఉండాల్సి ఉంటుంది. అలాంటప్పుడే ఉత్తమ పురుష కథలు పాఠకుల మనస్సులోకి వెళతాయి.




ఈ సజీవ చిత్రాలలోని కథలు కూడా ఉత్తమ పురుషలో చెప్పినప్పటికి ఆ "నేను" అనే భావన ఆ ప్రత్యక్షంగానే ఉన్నట్టుగా ఉంటుంది. శ్రీరంగస్వామి గారు 2003 జనవరిలో "సజీవ చిత్రాలు" కథా సంపుటాన్ని వెలువరించారు. ఇందులో మొత్తం ఐదు కథలు ఉన్నాయి. అవి 1) వేరు 2) భయం 3)లాలస 4)ఆవిష్కరణ 5) మేడిపండు. ఈ కథలన్నీ 2001 నుండి 2002 మధ్య వివిధ పత్రికలలో అచ్చయినవే.

"సజీవ చిత్రాలు" కథా సంపుటిలోని కథలన్ని సాహిత్య కార్యకర్తగా శ్రీరంగస్వామిగారు పొందిన అనుభావాలను, వ్యక్తులను పరిశీలించినవి.

"వేరు" కథలో కథానాయకుడైన కనకయ్య తను గొప్ప రచయితను, ప్రసిద్ధుడను అను ఆయనలోని "నేను" తనతో సమానంగా సమావేశంలో పాల్గొంటున్న తోటి సాహితీవేత్తగా రామారావును చూడకపోవడం వల్లనే అతనితో ఖర్చులు పెట్టేలా చేసి, తన విలువను తగ్గించుకున్నాడు. ఐతే కాలం మారుతున్న వయస్సు పైబడిన ఆయనలోని అహం తన షష్టిపూర్తి సంచికకు ప్రకటనలను కోరేలా చేసింది. ఇది ఆయనలోని "నేను" అనే అహం. ఇదే దృష్టిలో పెట్టుకొని రామారావు తన మనస్సులో ఇలా అనుకున్నాడు "రచయిత వేరు మనిషి వేరు" రచయితలోని రచనలు వేరు నిజ జీవనంలోని మనిషి వేరు.

"భయం" కథలో ప్రముఖ విలేఖరి అంజయ్య దేశమ్మీద పేరున్న మానవతావాది అనిపించుకున్న ఉద్యమ భావ నేపథ్యుడైన సాహిత్యకారుడిని ఇంటర్వ్యూ చేయడానికి వెళ్తే 5,6 రోజుల ముందు అపాయింట్‌మెంట్ తీసుకోవాలని ఇప్పుడు చెప్పే మూడ్‌లో (నిజానికి నేను చూసినప్పుడు అతను సరదగా,హాయిగా ప్రవర్తిస్తున్నాడు) లేనని నిర్మొహమాటంగా చెప్పిన తీరు ఆ మహా రచయితలో ఉన్న "నేను" అనే అహం గుర్తు చేయడమే కాకుండా తను అడగగానే అవకాశం ఇవ్వననే అహం గోచరించింది.

"ఆవిష్కరణ" కథలో వర్ధమాన రచయిత రాఘవ పుస్తకావిష్కరణకు విచ్చేసిన ముఖ్య అతిథులు "ఆవిష్కరణ" సభలో "న భూతో న భవిష్యతి" అని సాయంత్రానికి హోటల్ గదిలో పీకలదాక తాగి అవాకులు చివాకులు మాట్లాడుతూ ఇదో పుస్తకం, దీనికో ఆవిష్కరణ సభ. నీవు మమ్ములను పిలవటం దానికి మేము రావటం అనేది ఎందుకోయ్ డబ్బులు దండగా అని హేళనగా మాట్లాడడం, ప్రసిద్ధ రచయితలకు వర్ధమాన రచయితల పట్ల ఉన్న వెకిలితనం, తేలికభావన, నిర్లక్ష్యధోరణి వారి హుందాతనముపై వారిలోని "నేను" అనే మసక మసి బూసినట్లు ఉంది.

"లాలస" కథలో అభ్యుదయ రచయిత శేషగిరిరావు చీకటి జీవితాన్ని ఒక పాన్‌షాప్ వాడి ద్వారా విన్న ఈ కథలో "నేను" అనే రచయితకు ఆశ్చర్యం వేస్తుంది. సుఖలాలసతకు దూరంగా ఉండటం వేషం వేసినంత, ఉపన్యాసం దంచినంత సులభం కాదన్న వాస్తవం ఈ కథలో నిక్షిప్తమైంది.

"మేడిపండు" కథలో రఘు తన కథలను పుస్తకరూపంలో చూడాలని తన మిత్రుడు మహేందర్ సలహా మేరకు వెంకటయ్య దగ్గరకు వెళితే పుస్తకంగా ప్రచురిస్తానని పన్నెండు వేల వరకు అవుతాయని ఎనిమిది వేల రూపాయలు అడ్వాన్సుగా తీసుకొని చివరకు తాను ఇచ్చిన ప్రెస్సు మూసినది వరదల్లో మునిగి పోయిందని బుకాయించడం అనేది ఆ పుస్తకం వలన రఘుకు తనకంటే ఎక్కువ పేరు వస్తుందనే ఆలోచనతో నాకంటే గొప్పవాడై పోతాడేమో అనే అతనిలోని "నేను" అలా బుకాయింప చేసిందని అనుకోవచ్చు.

సజీవచిత్రాలలోని కథల్లో రచయితలు తమ రచనల్లో చూపించిన ఆదర్శాలు, భావాలు అలాగే వారు చేసిన ప్రసంగాల్లో కనిపించే భావుకత, దార్శనికత, సమాజోద్ధరణ వారి సహజత్వ జీవనానికి విభిన్నముగా ఉంటుందని ఈ కథల వలన తెలుస్తుంది. సజీవచిత్రాలలో తీసుకున్న ఈ ఐదు కథల్లోని వస్తువు రచయితలు, కవులు, పాత్రికేయుల జీవనం కాని ఈ కథలు చదివిన పాఠకులకు మాత్రం సమాజంలోని ఆయా రంగాలలో ప్రముఖులుగా చెలామణి అవుతున్న వారి సహజత్వ జీవనం కూడా గుర్తు చేస్తాయి.

శ్రీరంగస్వామి గారు తన సజీవ చిత్రాలలో సందర్భోచితముగా ఉపమ, ఉత్ప్రేక్ష అలంకారాలను, జాతీయాలను, సామెతలను ఉపయోగించుకున్నారు. కథా వస్తువును బట్టి తెలంగాణ మాండలిక భాషను కూడా ఉపయోగించారు.

మానవుడు సహజమైన ప్రకృతిలో భాగం అలాంటి మానవుడు తనలో ఉన్న "నేను" అనే అహాన్ని వదిలివేసినపుడే పరిపూర్ణు డౌతాడని అలా పరిపూర్ణుడైన మానవుడే నింగి, నీరు, నిప్పు, నేల, వాయువు అనే పాంచభౌతికుడౌతాడు. "సజీవ చిత్రాలు" కథలు కూడా ఈ పాంచభౌతికాలవుతాయని భావిస్తున్నాను.

# నా రోజు



రోజులన్నీ...
సంతోషాలతో నిండాలి అనుకుంటాను
నేను ఆశావహంగా...
రాత్రి కాగానే నిండు చందమామ దర్శనం
ఇచ్చిన వేళ
కళ్ళు తడుముతూ చూసాను
అనుమానంగా...
చేతితో ముద్దాడాలని చూస్తే అందలేదు
ఆనందంగా...
తదేకమైన చూపు అందాన్ని
తన్మయత్వంలోకి నెడితే
అత్యుత్సాహంగా...
లోతుగా గ్రహించిన మనసు కళ్ళు
తెరిపించింది అమాయకంగా...
పేపర్ తీసి రాశాను
మార్పు లేని జీవితం ఉండదు
ఒక్క ఆనందం మాత్రమే ఉండాలి
అనుకోవడం మూర్ఖత్వం అని
అంతిమంగా ...
ఆనందంతో పాటు అన్ని రసాలు ఉంటేనే
జీవితానికి ఒక అర్థం అని అనంతంగా ...



**పెద్దపల్లి తేజస్వి**
ఖమ్మం, ఫోన్ : 9603329474

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 (49) హైదరాబాద్ జూన్ : 2022

# జ్ఞానవాహిని శ్రీ యాదగిరి నరహరి శతకం

డా. మంత్రి శ్రీనివాస్, ఫోన్ : 83283 33720

తెలంగాణ ప్రాంతం తత్త్వకవులకు, సద్భక్తి శతకకారులకు పెట్టింది పేరు. తొలి శతకమైన వృషాధిప శతకం ఈ నేల మీదనే అవతరించింది. పాల్కురికి సోమనాథుడు దీని కర్త. ఆనాటి నుండి నేటి వరకు అశేషమైన శతక సంపద ఈ ప్రాంతంలో ప్రాణం పోసుకుంది. తెలంగాణా ప్రాంత భక్తి శతకాలు భక్తిని, జ్ఞానాన్ని, తత్త్వాన్ని, వైరాగ్యాన్ని, మోక్షాన్ని అందించే వర ప్రదాయినులుగా ఖ్యాతికెక్కాయి. ధర్మపురి నారసింహ శతకం, దాశరథి శతకం, శరబాంక లింగ శతకం, సుమతి శతకం, అంబికా శతకం, పరశు రామ శతకం, లక్ష్మీ నృసింహ శతకం, సూర్య శతకం వంటి శతకాల సరసన నిలబడే శతకం ఈగ బుచ్చిదాసు విరచిత శ్రీ యాదగిరి నరహరి శతకం.

సాధారణంగా శతకంలో 100 లేదా 108 పద్యాలుంటాయి. కాని ఈ శతకంలో 128 పద్యాలుండడం విశేషం. ఈ శతకం 20వ శతాబ్దపు తెలంగాణా ప్రజల ఆధ్యాత్మిక, తాత్త్విక, నైతిక, భక్తి పరమైన జ్ఞానాన్ని మనముందు ఉంచుతుంది. సీస పద్య సమన్వితమై విభిన్న వస్తు వైవిధ్యంతో ముక్తకమై అందరి హృదయాలకు ఆనందాన్ని పంచుతుంది ఈ శతకం.

ఈగ బుచ్చిదాసు 1907వ సంవత్సరంలో వరంగల్ జిల్లాలో జన్మించారు. వీరు 1937 ప్రాంతంలో తనకు, తన తల్లికి కలిగిన అనారోగ్యాన్ని బాగు పరుచుకోవడం కోసం యాదగిరిగుట్టను చేరి అక్కడి లక్ష్మీ నరసింహస్వామిని భక్తితో ఉపాసించాడు. ఈ క్రమంలోనే కబీరు మతానుయాయి అయిన ఉత్పల చెన్నదాసు వద్ద గురూపదేశం పొంది యాదగిరిలోనే ఉండిపోయాడు. అనంతరం ఘోర తపస్సు చేసి నరసింహ స్వామిని సాక్షాత్కరింజేసుకున్నాడు. నరసింహ ఆరాధనలో నిత్యం మునిగి తేలే బుచ్చిదాసుకు నరసింహ స్వామి కలలో కనిపించి సంకీర్తనలు, శతకాలు రాయమని ఆజ్ఞాపించారట. అలా స్వామి ఆజ్ఞతో రాయబడ్డ శతకాలలో మొదటి శతకం శ్రీ యాదగిరి నరహరి శతకం. రెండవది శ్రీ యాదగిరి లక్ష్మీ నారసింహ శతకం.

ఈ శతకంలో మానవుడికి ఉండవలసిన జ్ఞానం, భక్తి, ధర్మనిరతి, ఉండకూడని ధనాశ, దేహ ప్రీతి, చంచలత్వం వంటి వస్తువులను స్వీకరించి మానవుడిని ఆత్మ తత్త్వం వైపుకు మళ్ళిస్తాడు కవి. కవి యొక్క ఆర్తి ఇందులో ప్రముఖంగా ప్రతిబింబిస్తుంది. ధర్మపురి నారసింహ శతకం వలే ఈ శతకం కూడా దైవ స్తుతితో ప్రారంభమవుతుంది. బుచ్చిదాసు నరసింహుని దనుజ మర్దనా, సర్వేశ, దయా పారావార, యాదగిరివాస, సాధు జనోద్ధారకా అంటూ స్వామి గుణ స్వభావాలను స్తుతిస్తూ శతక ప్రారంభం చేశాడు.



**'శ్రీ మనోనాయకా సరిత జనావళి పోష**
**కారుణ్య సాగర కమల నేత్ర**
**పీతాంబరధర పాతక సంహార**
**సుగుణ భూషణ సుందరాంగ**
**పద్మనాభాచ్యుత పరమపద నివాస**
**మకర కుండల ధర మణి కిరీట**
**భానుకోటి ప్రకాశ బ్రహ్మాండ నాయక**
**ప్రహ్లాద వరద యో పరమ పురుష ......'** అంటూ స్తుతి చేస్తాడు బుచ్చిదాసు. శ్రీలక్ష్మి మనస్సునేలు నాయకా! ఆశ్రిత జన పోషకా! కరుణా సముద్రా! కమల నేత్రా! పీతాంబరము లను ధరించువాడా! పాతకములను దూరం చేయువాడా! సుగుణములను భూషణములుగా కలిగిన సుందరాంగ అంటూ భక్తి ప్రపత్తులతో పలు విధాలుగా స్తుతించి శతకాన్ని ప్రారంభం చేశాడు. సాధారణ భక్తుని వలే కార్యాన్ని స్తుతితో ప్రారంభం చేసే ఆచారాన్ని బుచ్చిదాసు పాటించాడని చెప్పవచ్చు. గ్రామీణులు ప్రతి పనిని భగవంతుని స్తుతితో ప్రారంభించడం ఆనవాయితీగా నేటికీ కొనసాగుతుండడం మనం చూడవచ్చు. అదే సంప్రదాయం ఈ శతకారంభంలో కనిపిస్తుంది.

దామోదరుని తత్త్వాన్ని తెలియజేస్తూ .....

**'దామోదరా నిన్ను దలచెడి విధమును**
**నరుల లోపల పుణ్య నరుల కెరుక**
**యిందిరేశా నీకు వందనంబును జేయు**
**విధము ప్రహ్లాదుని మదికి యెరుక**

**కమలాక్ష నీయొక్క కరుణా రసంబును**
**బాగుగా నా శుకయోగి కెరుక**
**యసుర సంహార నీ యానంద భజనంబు**
**మరువని నారద మౌని కెరుక.........'**

అంటూ మానవ లోకంలో భగవంతుని తత్త్వం ఎరిగి సత్ప్రవర్తనతో మెలిగేవారిలో భగవంతుని ఉనికిని చూస్తామంటాడు ఈ పద్యంలో బుచ్చిదాసు. ధరణీ పతియైనవాడు, నాభియందు కమలము కల్గిన వాడిని సకల ప్రాణుల్లో దర్శించే వారిలో కనుగొనవచ్చు అంటూ పలు సాక్షాలను మనముందు ఉంచుతాడు కవి. వందనం చేయడం ప్రహ్లాదునికి, భజించు విధానం నారదునికి, భగవంతుని కరుణాగుణం శుకయోగికి, నామ మహిమ సద్గుణులకు తెలుసు అంటూ ప్రపంచ జనులను వారు నడిచిన మార్గంలో నడిపించడానికి మార్గం వేస్తాడు కవి ఈ పద్యంలో.

ఎంతటి ధనరాశులున్నా, కీర్తి ప్రతిష్టలు ఉన్నా, జ్ఞానమున్నా భక్తి అను సుగుణాన్ని అందుకోలేని మానవుని జీవితం సంపూర్ణం కాదు అంటారు పెద్దలు. అందుకే జ్ఞాని సృష్టికర్తను, అతని ఈ ప్రపంచాన్ని, దాని స్వభావాన్ని తెలుసుకొని మెలగాలంటాడు బుచ్చిదాసు. ప్రతి పనిలోనూ భగవంతుని చూస్తూ తనను తానూ కర్మయోగిగా మలుచుకోవాలంటాడు కవి. మనిషికి అన్నింటిని ప్రసాదించిన ఆ భగవంతుని గూర్చి చెబుతూ....

**'వజ్ర వైదూర్యముల్ వర్ణింపగావచ్చు**
**సొరిది పుత్తడి కండ్ల జూడవచ్చు**
**బిలువైన మణుల సంపాదించగావచ్చు**
**భాగ్యంబు లెల్లను బడయవచ్చు**
**వెలగల్ మౌక్తికంబుల గూర్పగావచ్చు**
**పచ్చలన్నియు నేరి పంచవచ్చు**
**షడ్రసంబుల నెల్ల జవి జూడగావచ్చు**
**పుష్ప సుగంధముల్ బూనవచ్చు**
**గాని నీ మహిమ నెవ్వానికైన**
**దెలియగా వశమౌనె యో దేవదేవా.....'**

అంటూ స్వామి శ్రీ నరసింహుని మహిమా గుణాన్ని లోకానికి తెలియపరుస్తాడు బుచ్చిదాసు. భగవంతుని గుణగణాదులు వెలకట్టలేనివి. సృష్టిలో మానవుడిని సృష్టించి అతనికి అన్ని విధాలైన భాగ్యాలను ప్రసాదించింది దైవమే. అతనిది ఇవ్వడమే గాని తీసుకునే గుణం కాదు. మానవ సహజ స్వభావాలైన ఈర్ష్యాదులకు అతను దూరం. అతనిలో అతను రమించడమే అతని గుణం. అతడు అంటే ఈ సృష్టి అని, అతనిలో అతను రమించడం అంటే పుట్టడం, లయం కావడం. ఇదే అతని రహస్యం అని తెలిసినవాడు మోహాంధకారంలో పడడు. బుచ్చిదాసు పద్యం ద్వారా ఇటువంటి మహత్తర సందేశాన్ని మానవజాతి అందుకుంటున్నదని భావించవచ్చు.

భక్తుడైన బుచ్చిదాసు తాను భక్తుడు కాకముందు చేసుకున్న తప్పుల్ని నరసింహ స్వామికి అప్ప జెప్పుకుంటూ తన పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తాడు. తన పూర్వ దోషాల్ని కన్నీళ్ళతో కడిగేసుకుంటాడు. ఈయన చేసే ఈ పశ్చాత్తాపంలో సాటి మానవులు చేసే తప్పులు పరోక్షంగా కనబడతాయి. అంతేకాదు ఈ పద్యాలను చదివిన వారికి స్వయం పశ్చాత్తాపం కలుగుతుంది. తన దోషాలను పద్యంలో విన్నవించుకుంటూ బుచ్చిదాసు ....

**"మాంసపు చెత్తను మరిమరి జూచుక**
**మురిసితి కొన్నాళ్ళు ముఖ్యముగను**
**బాహు బలంబును పదపడి జూచుక**
**మురిసితి కొన్నాళ్ళు ముఖ్యముగను**
**నోటి బిఱ్ఱుతొ నేను నొరులను దూషించి**
**మురిసితి కొన్నాళ్ళు ముఖ్యముగను .........''**

అంటాడు. స్వామికి చేసే విన్నపంలో తన దేహబలం చూసుకొని చేసిన తప్పుల్ని, నోటి దురుసుతో ఇతరుల మనసును నొప్పించిన సందర్భాలను గుర్తుచేసుకుంటాడు. పద్యాంతంలో తానిప్పుడు ముసలివాడనై పశ్చాత్తాప పడుతున్నానని ప్రాధేయపడుతాడు. అజ్ఞానంలో పడి కన్ను మిన్ను కానక లోకులు చేసిన తప్పులు, అంత్య కాలంలో వారు పడే మానసిక వేదన ఈ పద్యం చదివాక మనకు స్ఫురిస్తాయి. అహంకారం వీడి సన్మార్గంలో నడవాలన్న తాత్త్వికతను, సౌశీల్యవంతమైన జీవనం మనిషికి ఎంత అవరసమో ఈ పద్యం చదివితే తెలుస్తుంది.

నరసింహుని భక్తిలో అహరహం మునిగిపోయిన బుచ్చిదాసు తన తప్పుల్ని ఎంచి నరక దూతలు పీడిస్తుంటే అడ్డుపడి మోక్షాన్ని, విష్ణుపద సాయుజ్యాన్ని అందివ్వమని కోరుకుంటూ......

**"కాలదూతలు నన్ను పట్టి నీడ్వగ వార్ని**
**చేతి చక్రంబున జెండివేయు**
**కొరడాలతో నన్ను గొట్టుచుండగ వార్ని**
**మెడబట్టి నెట్టుము దడయకుండా**
**పాప చిత్తుడవని పట్టి బాధించగ**
**యడ్డమొచ్చిన వార్ని నడుపుమయ్య**
**రెండు దండలు గట్టి దండిగా నీడ్చుంగ**
**గాంచి నా కట్లు దప్పించవయ్యా .......''**

అని నరసింహ స్వామితో అంటాడు బుచ్చిదాసు. ఈలోకంలో చేసిన పాప పుణ్యాల లెక్కలను బట్టి స్వర్గ నరకాలు నిర్ణయించ బడతాయి అంటారు పెద్దలు. మనం చేసుకున్న పాపాలు మనల్ని నరకంలో పడదోస్తే, పుణ్యాలు స్వర్గానికి చేరుస్తాయి. ఈ సత్యాన్ని ఎరిగిన బుచ్చిదాసు తాను మునుపు చేసిన తప్పుల్ని లెక్కించి నరక దూతలు తీసుకుపోవడానికి వస్తే తన భక్తుడి దోషాలను మన్నించి వారికి అడ్డుపడమంటున్నాడు. బుచ్చిదాసులో పరివర్తన వచ్చాక

నరసింహుని సేవలో తన జీవితాన్ని పండించుకున్నాడు. ఎంత పుణ్యం చేసినా, చేసుకున్న కుకర్మలు వెంటాడి నరకాన్ని చేరుస్తాయి కాబట్టి ముందస్తుగానే తనను కాపాడుకొని కడుపులో దాచుకోమన్నట్లుగా బుచ్చిదాసు పరి నివేదన కనబడుతుంది.

మానవుడు తనను ఉద్ధరించే మార్గాన్ని విడిచిపెట్టి ప్రాపంచిక సుఖాల్లో, అరిషడ్వర్గాల మాయలో మునిగి ఉంటాడని ఒకవైపు లోకరీతిని చెబుతూనే అటువంటి స్థితిలో బడకుండా తనను నిత్యం కాచుకొని ఉండమంటూ......

**"కర్ణేంద్రియములు నీ కథలు గోరవు గాని**
**మందిమాటలు విన మరిగియుండు**
**జిహ్వేంద్రియంబు నిన్ గీర్తింప నోపదు**
**పలు గాకి పాటలు బాడుచుండు**
**హస్తేంద్రియములు నిన్నర్చింప నోపవు**
**కోపించి నితరుల గొట్టజూచు....."**

అంటూ మానవ స్వభావాన్ని ఆవిష్కరిస్తూనే తన రక్షణను పద్యాంతంలో కోరుకుంటాడు బుచ్చిదాసు. మానవుడు భగవంతుని కథల్లో దాగున్న తన ఉన్నతిని వదిలి పెట్టి పరనింద చేస్తూ, పరుల మాటలు వింటూ తనను తాను ఊబిలోకి నెట్టేసుకుంటాడని, దైవాన్ని కీర్తించక తనను సమాజంలో పలుచన చేసే పాటలు పాడుతూ వ్యక్తి గౌరవాన్ని కోల్పోతాడని, కామాది షడ్వర్గాల బారిన పడి వినాశనాన్ని తెచ్చుకుంటున్నాడని తెలియజేస్తూనే తాను కూడా మానవ మాత్రుడనేనని ఈ కాసారంలో పడకుండా కాపాడమని వేడుకుంటాడు బుచ్చిదాసు.

జీవ సమత్వాన్ని, పరబ్రహ్మ తత్వాన్ని మానవులకు జ్ఞానబోధ చేస్తూ....

**"అండమైతేనేమి పిండమైతేనేమి /అండంబులో బుట్టి పిండమాయే తల్లి యైతేనేమి తనయుడైతేనేమి / తల్లికి బుట్టిన తనయుడాయె బిందువైతేనేమి బాంధవులైతేనేమి/ పరగ బిందువు సంధి బంధుడాయె..."**

అంటాడు బుచ్చిదాసు. ఈ సృష్టిలో పుట్టిన ప్రతిజీవి పరమాత్మ అనబడే ఆది బీజం నుండే ఉద్భవించిందని అది అండోత్పత్తి జీవులైనా, పిండోత్పత్తి జీవులైనా ఆది అండంలోనుంచే పుట్టుకొచ్చాయని, ఈ జగతిలో అమ్మానాన్నలు వారికి కలిగిన సంతానం అందరూ ఆదిదేవుడైన అయిన ఆ నరసింహస్వామి నుండే ఉత్పత్తి అయ్యారని ఆయన మాయ వల్లనే ఈ జగత్తు నడుస్తున్నదని, అతడే ఆది మధ్యాంత రహితుడు అన్న సత్యాన్ని ప్రకటిస్తాడు బుచ్చిదాసు. దేవతలైనా, మానవులైనా ఆఖరకు అతడిలో లయం కావాల్సిందేనన్న అంతిమ నిజాన్ని లోకులకు జ్ఞాతం చేయిస్తాడు కవి ఈ సందర్భంగా. అందరం ఆ పరబ్రహ్మ సంతానమే కనుక అందరం కలిసి మెలిసి మెలగాలన్న సందేశం ఇక్కడ మానవజాతి




అందుకుంటుంది.

**"కొండంత ద్రవ్యంబు కూడబెట్టిన తాను**
**దర్లిపోవగ వెంట దవిలి రాదు**
**తల్లిదండ్రులు భార్య తనయులుండిన తాను**
**దర్లిపోవగ వెంట దవిలి రాదు**
**మిద్దెలు మేడలు పెద్ద భూములు తాను**
**దర్లిపోవగ వెంట దవిలి రావు**
**పరగా తా బెంచిన పశు పక్షి మృగములు**
**దర్లిపోవగ వెంట దవిలి రావు....."**

అనే పద్యంలో ఈ ప్రపంచంలో ప్రతీది నశ్వరమేనని, ఇక్కడున్నదేది అంతిమ సమయంలో వెంట రాదని, అది కూడబెట్టిన ధనం కావచ్చు, తనతో రక్త సంబంధాన్ని పంచుకున్న తల్లిదండ్రులు కావచ్చు, జీవితాన్ని పంచుకున్న భార్య కావచ్చు, తాను పెంచిన పశుపక్ష్యాదులు, కట్టిన మేడ మిద్దెలు ఏవి తన వెంట రావని మనిషి తాను చేసిన మంచిచెడులు మాత్రమే తనతో వస్తాయంటాడు. లోక విదితమైన అంతిమ సత్యాన్ని అత్యంత సరళంగా తెలియజేస్తాడు కవి. మనిషి సత్కర్మలు చేయాలని, లోక హితంలో తన జీవితాన్ని వెచ్చించాలని పెద్దలు చెప్పిన మాటలను అందరితో పంచుకుంటాడు బుచ్చిదాసు. ఈ పద్యం చదివాక ధర్మపురి నరసింహ శతకంలోని 'తల్లిగర్భము నుండి ధనము తెడెవ్వడు వెళ్ళిపోయే నాడు వెంటరాదు' అన్న పద్యం గుర్తుకువస్తుంది.

ఈ లోకంలో దానగుణానికి ఉన్న ప్రాముఖ్యతను, దానం చేయడం వల్ల కలిగే ఫలితాలను, పుణ్యాన్ని గురించి చెబుతూ ....

**"అన్నదానము తన యైశ్వతు కొద్దిగా**
**జేసిన తనతోడ జేరవచ్చు**
**గోభూమి దానముల్ కొమరొప్ప జేసిన**
**స్వర్గ సుఖంబిచ్చు సత్యముగను**
**పిడికెడు భిక్షంబు బీదల కిడినంత**
**తనకు కడివెడు గల్గు తథ్యముగను**
**విద్యదానంబు తా వివరంబు నొనరించు**
**శారదాదేవి ప్రసన్నమగును ....."**

అని దానమహిమను, దానవల్ల వచ్చే పుణ్యగతులను ఎరుక పరుస్తాడు కవి. అన్నం ఒక్కటే మనిషికి తృప్తినిస్తుంది. కడుపు నిండగానే ఇక చాలు అన్న భావన కలిగించేది అన్నం మాత్రమే. అన్నదానం మనిషి ఆకలి బాధను తీర్చి ఆయుస్సును పెంచుతుంది. అటువంటి అన్నదానం చేయడంవల్ల సాక్షాత్తూ పరబ్రహ్మతో ఉండే అదృష్టం కలుగుతుందని, గో, భూ దానాలు మనిషికి స్వర్గ సుఖాలు కలుగజేస్తాయని, బీదలకు చేసిన దానం, వేసే భిక్షం దాతకు తరగని సంపదను కలిగిస్తుందని, ఇక విద్యాదానం చేస్తే సాక్షాత్తు శారదామాత కరుణకు పాత్రులవుతాం అని దానమహిమను లోకానికి తెలియజేస్తాడు బుచ్చిదాసు. ఒకరికోసం ఒకరు అన్న సద్భావన ఇక్కడ ఆవిష్కృతమవుతుంది. దానం అనేది ఇతరుల కష్టాలను తీర్చే మానవ కళ్యాణ సూత్రంగా కవి ఈ పద్యంలో తెలియజేస్తాడు. లేమి అనేది ఏదో ఒక రోజు అందరికి కలుగుతుంది. ఆ కష్టాన్ని దూరం చేయడానికి దానం అనే మహా మానవ గుణాన్ని మనిషికి భగవంతుడు అందించాడని బుచ్చిదాసు పద్యం మాధ్యమంగా మరొక్కమారు గుర్తుచేసుకోవచ్చు.

ఈ సృష్టిలోని జీవరాశులు, దేవ, బ్రహ్మ మొదలు అన్ని లోకాలు తన స్వరూపాలేనని, అందరి రూపంలో ఉండి నిత్య కర్మలు నిర్వర్తించేది, ఆపద వేళల్లో రక్షించేది ఆ నారసింహుడేనని, అతడే ముక్తి ప్రదాత అని లోకానికి చెబుతూ....

**"పరమాత్ముడవు నీవే పరబ్రహ్మమును నీవె**
**అఖిల బ్రహ్మాండాల కాది నీవె**
**ఇలను బ్రహ్మాదుల కింద్రాద్రులకు నీవె**
**అఖిల దిక్పాలుర కాది నీవె**
**సురులందరికి నీవె ధరణి మునులకెల్ల**
**అఖిలమున్ రక్షించ ఆది నీవె....."** అంటాడు బుచ్చిదాసు.

సమస్త లోకాలను సృష్టించి వాటికి పాలకులను నియమించింది నరసింహుడేనని, సమస్త దిక్పాలకులకు శక్తినిచ్చేది అతడేనని, సురులకు, మునులకు, దొరలకు అందరికి ఆ నరసింహుడే రక్షకుడని అఖిల బ్రహ్మాండము తానేనని పద్నాలుగు భువనాలకు పాలనకర్తగా మోక్షదాత శ్రీహరి ఒక్కడేనని స్థిరమనస్కులై అతడిని కొలవాలని బ్రహ్మసత్యాన్ని లోకులకు వరంగా అందిస్తాడు బుచ్చిదాసు. సమస్త జీవులు నరసింహుడి స్వరూపాలే కనుక పరస్పరం ప్రేమతో, మెలిగితే భువిలోనే స్వర్గం ఆవిష్కృతమవుతుందనే సుందర సందేశం బుచ్చిదాసు అందిస్తున్నాడు.

మానవ కళ్యాణం వైపు నడిపించే విభిన్న అంశాల సమ్మేళనంగా ఈ శ్రీ యాదగిరి నరహరి శతకాన్ని పేర్కొనవచ్చు. సుగుణాలను అలవరచుకోవాలనుకున్నవారంతా ఈ శతకాన్ని చదివి తీరాల్సిందే. ఈ యాదగిరి నరసింహ శతకం అలనాటి కవి శేషప్ప భావాలకు కొనసాగింపుగా ఆ నరసింహుడు బుచ్చిదాసు చేత రాయించుకుని రచయితకు మోక్షప్రదాత అయినాడు.

# తెలంగాణ తల్లి

చేత బతుకమ్మ చెంగావి చీరకట్టి
మొక్కజొన్న కంకిని పట్టి మురిపెముగను
కనక భూషణాదుల మరి కాంతులీన
అరుణ సింధూర ప్రభలతో అందగిస్తు
తల్లి తెలగాణ ఏతెంచె ధైర్యమొసగ

కవివరులు పోతనాదులన్ కన్నతల్లి
గాయకేంద్రుల కమ్మని గళములందు
మురిసి ముచ్చటగ వసించు ముద్దరాలు
నీరజాక్షి! సుభాషిణి! నీలవేణి
జనని! స్వాతంత్ర్య వరధాత్రి!
జయము జయము!!



డా. బి. నీలిమా కృష్ణమూర్తి
ఫోన్ : 9700080030

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 24

# శుభలేఖ

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

**"కె.విశ్వనాథ్ చలనచిత్రాలు – సామాజిక అవలోకనం"** నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం **"శుభలేఖ"**. చిరంజీవి, సుమలత, కైకాల సత్యనారాయణలు ప్రధాన తారాగణంగా నటించిన ఈ చిత్రం ఇది. ఈ చిత్రం 1982 జూన్11 న విడుదలైంది. చిరంజీవి– కె.విశ్వనాథ్‌ల కలయికలో ఇదే మొదటి చిత్రం. చిరంజీవికి ఇది 40వ చిత్రం. ఈ చిత్రంలో ఆడపిల్లల, వారి తల్లిదండ్రుల జీవితాలను పట్టి పీడిస్తున్న సామాజిక సమస్య అయిన 'వరకట్నం'ను ప్రధాన నేపథ్యంగా తీసుకుని రూపొందించారు. కాలం మారినా, మనిషి జీవన విధానంలో మార్పు వచ్చినా, అక్షరాస్యత పెరిగిన నాటి నుండి నేటి దాకా దిగువ, మధ్యతరగతి మనుషుల జీవితాల్లో సంక్షోభం సృష్టించే అంశాల్లో వరకట్నం కూడా ఒకటి.



**చిత్ర కథ :** మూర్తి (చిరంజీవి) పట్నంలో ఒక పెద్ద హోటల్లో పనిచేస్తుంటాడు. అతడి బామ్మ శాంతమ్మ (నిర్మల) కు ఆరోగ్యం కులాసాగా లేదని ఉత్తరం ద్వారా తెలుసుకొని ఆందోళనగా ఊరికి వెళ్తాడు. కాని తన బామ్మ ప్రతి సంవత్సరం తన చేత చేయించే దైవ కార్యక్రమం నిమిత్తం అలా ఉత్తరం పంపిందని తెలిసి ఊపిరి పీల్చుకుంటాడు. అదే ఊరిలో మూర్తికి బాగా కావాల్సిన వ్యక్తి భావనారాయణ (సాక్షి రంగారావు). ఆయన కూతురిని సోదరిలా భావిస్తాడు మూర్తి. పెళ్ళైన నెలల వ్యవధిలోనే భర్త పోయి విధవగా మారిన ఆమెను చూసి చలించిపోయి పట్నం తీసుకెళ్లి చదివించి ఆమె కాళ్ళపై ఆమె నిలబడి బతికేలా చేయాలని భావిస్తాడు. దానికై భావనారాయణ కూతురును తనతోపాటు తీసుకెళ్లి కాలేజ్‌లో జాయిన్ చేసే ప్రయత్నం చేస్తాడు. కాని కాలేజీ యాజమాన్యం డబ్బు ఆశతో ఆమెకు మంచి మార్కులు వున్నప్పటికీ ప్రవేశం కల్పించదు. ఆ కళాశాల అంకెల ఆదిశేషయ్య (కైకాల) అనే పేరుమోసిన వ్యాపారవేత్తది.

హోటల్లో పనిచేస్తుండగా మూర్తికి ఒక వాణిజ్య ప్రకటనలో నటించే అవకాశం వస్తుంది. మూర్తి బ్యాంక్ కు డబ్బు లావాదేవీల విషయమై వెళ్ళినప్పుడు అక్కడ సుజాత (సుమలత) తో పరిచయం ఏర్పడ్తుంది. సుజాత కాలేజీలో ట్యూటర్‌గా పనిచేస్తూ వుంటుంది. జీవితంపై స్వతంత్ర ఆలోచనలు, బలమైన నైతిక భావాలు కల్గిన అమ్మాయి తను. సుజాత తండ్రి జగన్నాథం (జె.వి.రమణమూర్తి) ఆమెకు పెళ్ళి సంబంధాలు చూస్తూ వుంటాడు. సుజాత చెల్లి లక్ష్మి (తులసి) అల్లరి పిల్ల, తెలివైంది.

అంకెల ఆదిశేషయ్య (కైకాల సత్యనారాయణ) వ్యాపారవేత్త, పిసినారి, విపరీతమైన డబ్బు పిచ్చివున్న మనిషి. ఆదిశేషయ్య అసిస్టెంట్ గురునాథం (రాళ్ళపల్లి). ఆదిశేషయ్యకు ఇద్దరు కుమారులు మొదటివాడు మోహన్ (అరుణ్), రెండవవాడు మురళి (సుధాకర్). ఇద్దరినీ పెద్ద చదువులు చదివించి దాన్ని ఆసరాగా చేసుకొని వివాహ సమయంలో భారీగా కట్నం తీసుకోవాలని లెక్కలేస్తూ వుంటాడు ఆదిశేషయ్య. దానిలో భాగంగా పెద్ద కుమారుడు మోహన్ కోసం జగన్నాథం పెద్ద కుమార్తె సుజాతతో పెళ్లి సంబంధానికై వారి ఇంటికి వెళ్తాడు. తనకు వరకట్నంపై వున్న పిచ్చిని తీయని మాటలతో ప్రదర్శిస్తాడు ఆదిశేషయ్య. అది సహించని సుజాత ఆదిశేషయ్యను ఎడాపెడా తన మాటలతో కడిగి పారేస్తుంది. అదేసమయంలో ఆ ఇంటికి మూర్తి కేటరింగ్ బాయ్‌గా వచ్చి వుండడం వల్ల ఆ తంతు మొత్తాన్ని చూస్తుంటాడు. సుజాత వ్యక్తిత్వాన్ని మెచ్చి ఆమెతో స్నేహం చేస్తాడు. మూర్తి సుజాత అండతో తను చెల్లిగా భావించే భవనారాయణ కూతురుకు కాలేజీ సీటు వచ్చేలా చేస్తాడు. ఆదిశేషయ్యకు అవమానం చేసిందనే కారణం చేత సుజాతను తన కాలేజీలో ఉద్యోగం నుండి తొలగిస్తాడు. అంతేకాక సుజాత తల్లిదండ్రులు కూడా సుజాత – మూర్తిల మధ్య వున్న స్నేహబంధాన్ని తప్పుగా అర్థం చేసుకోవడంతో ఆమె ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఒంటరిగా జీవిస్తూ వుంటుంది.

ఒకసారి ఆదిశేషయ్య డబ్బులిచ్చి బిరుదు, సత్కారాన్ని పొందే సభ ఒకటి జరుపుతున్నాడని తెలిసి, మూర్తి ఆ సభకు వెళ్ళి అందరి ముందు అతడి నిజస్వరూపాన్ని ఎండగడతాడు. మరోవైపు కట్నానికి కక్కుర్తి పడే ఆదిశేషయ్యకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంటుంది సుజాత చెల్లి లక్ష్మి. దానికోసమై ఆదిశేషయ్య రెండవ కుమారుడు మురళిని బుట్టలో వేసుకుంటుంది. ఒంటరైన సుజాతకు తోడుగా

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022




వుంటూ ఆమెను మంచి ఉద్యోగంలో చేర్పించి ఆమెకు వివాహం చేయాలని భావిస్తాడు మూర్తి. దానిలోభాగంగా మూర్తికి పరిచయం వున్న రావుగారి ఆఫీసులో సుజాత స్థాయికి సరిపోయే ఉద్యోగంలో చేర్చుతాడు. ఇక ఆమెకు వివాహం చేయడమే తరువాయి అని ఆలోచిస్తుంటాడు. మరోవైపు సుజాత చెల్లి లక్ష్మి తన ప్రేమికుడైన మురళిని తనతో వివాహానికి పురమాయిస్తుంది. దాంతో మురళి తన ప్రేమ విషయం తన తండ్రి ఆదిశేషయ్యకు చెప్తాడు. జగన్నాథం రెండవ కూతురని తెలిసి, గతంలోనే కట్నం విషయంలో ఆ కుటుంబాన్ని అవమానపరిచాననే విషయం గుర్తు చేసుకుని ఏ మొహం పెట్టుకొని సంబంధం కోసం వెళ్ళాలి అని ఆలోచనలో పడతాడు ఆదిశేషయ్య. కాని మురళి మాత్రం లక్ష్మితో తన వివాహం చెయ్యకపోతే చస్తానని తండ్రిని భయపెడ్తాడు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆదిశేషయ్య జగన్నాథం ఇంటికి సంబంధం కోసం వెళ్తాడు. అంతేకాక అక్కడ లక్ష్మి పెట్టే అన్ని కండీషన్స్‌కి ఒప్పుకోవడం విశేషం. చివరికి మురళి – లక్ష్మి లకు వివాహం జరుపుతాడు ఆదిశేషయ్య.

సుజాత కోసం సంబంధాన్ని వెతుకుతున్న మూర్తికి ఆమెకు ఉద్యోగం ఇచ్చిన రావుతో వివాహం జరపడం సబబేమో అని ఆలోచిస్తాడు. ఆ ప్రతిపాదనను రావు ముందుంచి అతడిని సుజాతతో వివాహనికి ఒప్పిస్తాడు. మరోవైపు మురళిని వివాహం చేసుకున్న లక్ష్మి అతడి వద్దకు కాపురానికి వెళ్ళదు. అసలే తక్కువ కట్నానికి వివాహం చేశాననే బాధలో వున్న ఆదిశేషయ్య తన కోడలు కాపురానికి రాకపోవడం పట్ల కోపంగా వుంటాడు. అంతలో అతడి ఇంటికి అతడి చిన్న కుమారుడిని నలభై వేల నగదుకు లక్ష్మి కొనుగోలు చేసినా ఆమె వద్దకు వెళ్ళకుండా అతడి ఇంట్లోనే వుండడం సబబు కాదు అని లాయర్ నుండి నోటీసు వస్తుంది. అది చూసి ఆదిశేషయ్య షాక్ అవుతాడు. లాయర్ (అల్లు రామలింగయ్య) ఆదిశేషయ్యతో సంత నుండి ఒక పశువును కొనుగోలు చేసినప్పుడు దాన్ని ఇంటికి తీసుకెళ్ళే హక్కు కొనుగోలు చేసిన వ్యక్తికి వున్నప్పుడు ఆ అమ్మాయి డబ్బులిచ్చి నీ కుమారుడిని కొన్నప్పుడు అతడిని తన ఇంటికి తీసుకెళ్ళే హక్కు వుంటుంది అని చెప్తాడు. ఆ మాటలకు ఆదిశేషయ్య సిగ్గుతో తలదించుకుంటాడు.

సుజాత పెళ్లికి అన్నీ సిద్ధం చేసిన మూర్తి ఆ పెళ్ళికి తన బామ్మ శాంతమ్మ రావడంతో ఆశ్చర్యపోతాడు. పెళ్ళికొడుకు రావు మూర్తితో సుజాతకు అన్ని పరిస్థితుల్లో అండగా వుండి ఆమె ఆలోచనలకు, ఆమె వ్యక్తిత్వానికి విలువనిచ్చిన నువ్వే ఆమెను వివాహం చేసుకోవడానికి సరైన వ్యక్తివో అని చెప్తాడు. పైగా సుజాత కూడా తనకోసం ఇంతగా తపించిన నిన్నే తన మనసులో నిలుపుకున్నది అని చెప్పి వివాహం జరపడంతో కథ సుఖాంతం అవుతుంది.

**చిత్ర విశేషాలు :** కె. విశ్వనాథ్ – చిరంజీవిల కలయికలో వచ్చిన మొదటి చిత్రం ఇది. చిరంజీవి మాస్ నటనకు విభిన్నంగా పూర్తిగా కొత్త తరహాలో అభినయించే అవకాశం వున్న చిత్రంలో నటించారని చెప్పొచ్చు. చిత్ర కథ వరకట్నం నేపథ్యంలో సాగినప్పటికీ దానికి అనుసంధానంగా సమాజంలో నిత్యం మన కళ్ళముందు మనల్ని అసహనానికి గురిచేసే చాలా సాధారణ విషయాలను గూర్చి విశ్వనాథ్ గారి కోణంలో ఆవిష్కృతం చేశారు. ఇక గొల్లపూడి మాటలు కథలోని సన్నివేశాలకు మరింత బలాన్నిచ్చాయి. కె. విశ్వనాథ్ అంతకుముందు చిత్రాలు తదుపరి చిత్రాలతో పోల్చితే ఒక కొత్తరకమైన దృశ్యానుభూతి కలుగుతుంది ఈ చిత్రం చూస్తున్నప్పుడు, దానికి ప్రధాన కారణం చిరంజీవి నటన, ఇమేజ్ యే.

మూర్తి పాత్రలో చిరంజీవి నటన సాధారణ యువకుడిని ప్రతిబింబించే రీతిలో వుంటుంది. మూర్తి పాత్రకు ఎదురయ్యే అనుభవాలు, సంఘర్షణలు ప్రతీ యువకుడికి నిత్యం ఎదురయ్యే సున్నితమైన భావోద్వేగాలను పరిచయం చేస్తాయి. ఉదాహరణకు కొన్ని సన్నివేశాలను తరచి చూసినప్పుడు భావనారాయణకు మూర్తి హొటల్లో పనిచేస్తున్నాడని తెలిసినప్పుడు మీ కుటుంబంలో ఇంతవరకు ఎవరూ ఇలాంటి పనిచేయలేదు పైగా ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తావ్ అని భావిస్తే ఇలా హొటల్లో చెయ్యడం తగదు అని చెప్పినప్పుడు మూర్తి 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' ను ప్రస్తావిస్తాడు. భావనారాయణ కూతురుకు కళాశాలలో సీటు కోసం వెళ్ళినప్పుడు ఆమెకు మంచి మార్కులు వున్నప్పటికీ సీటు ఇవ్వనప్పుడు మూర్తి

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2022

యాజమాన్యాన్ని నిలదీస్తాడు. దీని ద్వారా కళాశాలలు డబ్బుకోసం చేసే మోసాన్ని ప్రస్తావిస్తాడు. మూర్తి పాత్ర నిండైన వ్యక్తిత్వం ఎలా వుంటుందో చెప్పేలా వుంటుంది.

చిత్రంలో మరొక ప్రధాన పాత్ర సుజాత (సుమలత). సుజాత లాంటి పాత్ర సమాజంలో ఏదో ఒకమూలన కనపడడం కాదు ప్రతీ కడపలో కనపడిన రోజు సమాజం కాంక్షించే లింగ వివక్ష లేని సమాజం ఆవిర్భవిస్తుంది. లింగ వివక్ష అనే ఒకే అంశాన్ని పెనవేసుకొని ఆడపిల్లల, స్త్రీల జీవితాలను ప్రభావితం చేసే చాలా సామాజిక అంశాలు మన చుట్టూ కనిపిస్తాయి. బాల్యవివాహాలు, విద్య వారికి అవసరం లేదని భావించడం, వరకట్నం, తన భావాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ లేకపోవడం, సమాన పనికి సమాన వేతనం లాంటి అంశాలు మొదలైనవి. వరకట్నం విషయంలో ఆదిశేషయ్యను, ఆమె తల్లిదండ్రులను ఎదిరించి మాట్లాడగల్గిన సుజాత పాత్ర ఆమె చెల్లి లక్ష్మికి స్ఫూర్తినివ్వగల్గింది. ప్రధానంగా సుజాత పాత్ర అమ్మాయికి విద్యను అందించగల్గితే ఆమె ఎంత ధైర్యంగా సమాజంలో బతకగలదు అనే విషయానికి చిహ్నంగా వుంటుంది. సుజాత-మూర్తిల స్నేహబంధాన్ని చుట్టూ వుండే సమాజం అపార్థం చేసుకునే తీరు నిత్యం అందరి జీవితాల్లో జరిగేదే.

చిత్రంలో మరొక చర్చించుకోదగిన పాత్ర ఆదిశేషయ్య (కైకాల సత్యనారాయణ). ఈ పాత్రతో పాటు ప్రతీ సన్నివేశంలో కనబడే మరొక పాత్ర గురునాథం (రాళ్ళపల్లి). ఈ రెండు పాత్రల మధ్య సంభాషణలు చమత్కారంగా వుంటూనే ఎదుటి వ్యక్తిని ఎత్తిపొడిచేలా వుంటాయి. ఆదిశేషయ్య కొడుకును ప్లస్ గానూ, కూతురిని మైనస్ గాను పోల్చడంతోనే ఆయన దృక్పథం వ్యక్తమవుతుంది. అంతేకాక బిరుదుకోసం డబ్బులిచ్చి సన్మానం చేసుకునే విషయం సమాజంలో ఈ కోణంలో ఆలోచించే వైఖరి కల్గిన వ్యక్తులు కూడా వుంటారా అనే ప్రశ్నకు తావిస్తుంది. ఆదిశేషయ్య పెద్ద కుమారుడు మోహన్ తండ్రిని గౌరవిస్తూ పెరిగి ఒకానొక సమయంలో తండ్రి ఒట్టి స్వార్థజీవి, పైసా కోసం మాత్రమే బతికే వ్యక్తి అని తెలిసి తండ్రిని లెక్కచేయకుండా భావనారాయణ కూతురును వితంతువివాహం చేసుకున్నప్పుడు అతడి సానుకూల ఆలోచనా దృక్పథం, దృఢమైన వ్యక్తిత్వం బహిష్కృతం అవుతుంది.

ఈ చిత్రానికి సంగీతం కె.వి.మహదేవన్ అందించారు. సాహిత్యాన్ని వేటూరి అందించారు. 'ఐతే అది నిజమైతే', 'రాగాల పల్లకిలో కోకిలమ్మా / రాలేదు ఈవేళా ఎందుకమ్మా ' లాంటి పాటలతో పాటు మరుగేలరా, విన్నపాలు వినవలె వింతవింతలూ, నెయ్యములల్లో నేరెళ్ళో వంటి అన్నమాచార్య కీర్తనలను సన్నివేశాలకు అనుగుణంగా అవసరమైన చోట పూర్తి స్థాయి పాటగా తెరకెక్కించారు. ఈ చిత్రం ద్వారా అరుణ్, సుధాకర్‌లు నూతన నటులుగా పరిచయం అయ్యారు. ఈ చిత్రంలో చిరంజీవి నటనకు ఫిలింఫేర్ అవార్డు లభించడం







విశేషం. ఏదేమైనా "శుభలేఖ" చిత్రం వరకట్నం అనే సామాజిక దురాచారాన్ని గూర్చి సుజాత పాత్రను ఆధారంగా చేసుకొని బలంగా ప్రశ్నించిన చిత్రంగా చెప్పొచ్చు.

చిత్రం : శుభలేఖ
తారాగణం : చిరంజీవి, సుమలత, తులసి, కైకాల సత్యనారాయణ, రాళ్ళపల్లి, సుధాకర్, అరుణ్
మాటలు : గొల్లపూడి
సంగీతం : కె.వి. మహదేవన్
సాహిత్యం : వేటూరి, అన్నమయ్య కీర్తనలు
నిర్మాత : అల్లు అరవింద్, వి.వి.శాస్త్రి
దర్శకత్వం : కె.విశ్వనాథ్



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 8 (56) హైదరాబాద్ జూన్ : 2022

సమీక్ష

# వలస రాయలసీమలో మహిళా చైతన్యం

**శివప్రియ** ఫోన్: 99640 82076

ఆంధ్రదేశ చరిత్రలోనూ, ఆంధ్ర సాహిత్య చరిత్రలోనూ అటు తెలంగాణాకు ఇటు రాయలసీమకు యథార్థమైన స్థానం లభించలేదన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ రెండు క్షేత్రాల్లోనూ కృషి చేసిన మహనీయులు తీరాంధ్ర ప్రాంతాలకు చెందిన వాళ్లే కావడం గమనార్హం. కోస్తా ప్రాంతంలో ఈస్ట్ ఇండియా ప్రభుత్వ కాలంలోనే పలుచోట్ల పాఠశాలలు, కళాశాలలు స్థాపించబడ్డాయి. కాగా గోదావరి జిల్లాల్లోని, కృష్ణా జిల్లాలోని సంఘ సంస్కర్తలు స్వప్రయత్నంతోనూ, వదాన్యుల సహకారంతోనూ పాఠశాలలు, ఆడపిల్లలకు ప్రత్యేక విద్యాలయాలు స్థాపించి, ప్రజల్లో విద్యపట్ల కుతూహలం, ఆసక్తులను కలిగించారు. విద్యా ప్రచార ప్రసారాలు తక్కువైన తెలంగాణ, రాయలసీమల్లో ప్రజాచైతన్యానికి అవకాశాలే కొరవడి పొయ్యాయి. ఈ రెండు ప్రాంతాల్లోనూ బాలురకే పాఠశాలలు లేకుండా వుంటే ఇక బాలికా పాఠశాలల వూసెత్తడ మెందుకు?

భారతదేశ చరిత్ర రచించిన చరిత్రకారుల్లో మొదట్లో విదేశీయులే ఎక్కువ. స్వదేశీ చరిత్రకారుల సంఖ్య నదురుగానే వుండేది. స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత కూడా మనదేశంలోని ఘనత వహించిన రాజవంశాల చరిత్ర పట్లే స్వదేశీ విదేశీ చరిత్ర కారులు ఆసక్తి చూపారే కాని ప్రాంతీయ అస్తిత్వం, అస్మిత పట్ల దృష్టి మరల్చిన విద్వాంసులు తక్కువే అని చెప్పాల్సి వుంటుంది. అలాంటప్పుడు స్వస్థాన చరిత్ర-సంస్కృతుల అధ్యయనం పట్ల అభిరుచి, అభినివేశం, పరిశోధనాభిలాష ఏ ఒకరిద్దరికో పుట్టుకొస్తుంది. ఎన్నో కారణాల వల్ల విద్యకు దూరమైన రాయలసీమ స్త్రీ పురుషుల్లో చైతన్య రాహిత్యం, చైతన్య జాగృతుల గురించి ఇంత వరకు చాలా తక్కువగానే పరిశోధన జరిగిందని చెప్పొచ్చు.

ఈ నేపథ్యంలో డా. షేఖ్ మహబూబ్ బాషా వెలువరించిన 'వలస రాయలసీమలో మహిళా చైతన్యం' (డిసెంబర్ 2021) అన్న చిన్న పొత్తం ఎంతో స్వాగతించదగ్గది.

కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన షేఖ్ మహబూబ్ బాషా (1976) జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి 2000లో యమ్.ఏ. (చరిత్ర) పట్టాపొందారు. ఆయన 'ఆంధ్రప్రదేశ్ లో మహిళా చైతన్యానికి దోహదం చేసిన తెలుగు మహిళా పత్రిక గృహలక్ష్మి (1928-42) అనే విషయం గురించి 2002లో జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి యం. ఫిల్. డిగ్రీ సంపాదించారు. తర్వాత "తెలుగు పత్రికల్లో (1902-60) వినిపించిన మహిళా స్వరాలు : ఒక అధ్యయనం" అనే అంశంపై ఆచార్య ఇందీవర్ కామ్టేకర్, ఆచార్య ఆర్.మహాలక్ష్మీ గార్ల పర్యవేక్షణలో పరిశోధన జరిపి 2016లో జె.ఎన్.యూ నుంచే పిహెచ్.డి., పట్టా అందుకొన్నారు. డా. షేఖ్ మహబూబ్ బాషాగారికి యం.ఫిల్ మరియు పిహెచ్.డి., పరిశోధనల్లో పర్యవేక్షక బాధ్యతను నిర్వహించిన ఈ ఇద్దరూ దిగ్గజాలే.

మహిళాభ్యుదయం కోసరమై కోస్తా ప్రాంతంలో మహిళా సంస్థలు తామర తంపరగా పుట్టుకొస్తే, కరువు కాటకాలకు నిలయమైన రాయలసీమలో చెదురుమదురుగా అయినా స్త్రీ సంఘాలు స్థాపించ బడ్డాయి. చరిత్ర గర్భంలో దాగివున్న సత్యాల్ని డా. షేఖ్ మహబూబ్ బాషా తవ్వితీయడం అందరూ అభినందించదగ్గ సంగతే.

డా. షేఖ్ మహబూబ్ బాషా రాసిన 'వలస రాయలసీమలో మహిళా చైతన్యం' అరవై పేజీల వ్యాసం ఎన్. వేణుగోపాల్ గారి సంపాదకత్వంలో వెలువడుతున్న 'వీక్షణం' మాసపత్రికలో 2021 జనవరి నుండి ఏప్రిల్ దాకా వెలుగు చూసింది. తర్వాత 'వీక్షణం' ప్రచురణల కింద 2021 డిసెంబర్ లో పుస్తక రూపంలో ప్రచురితమయింది. ప్రముఖ విమర్శకులైన ఎన్. వేణుగోపాల్ ఒక తట్టు ఆధునిక భావాలు, ఇంకొక తట్టు వలస వ్యతిరేక పోరాటాలు సాగిస్తున్న రాయలసీమ మహిళల్లో ఉబుకుతున్న చైతన్యాన్ని పకడ్బందీ పత్రికా సాక్ష్యాధారాలతో ఈ పరిశోధనా పుస్తకాన్ని డా. షేఖ్ మహబూబ్ బాషా రచించారని చెప్పడం గమనార్హం.

'వలస రాయలసీమలో మహిళా చైతన్యం' సుదీర్ఘ వ్యాసానికి ప్రేరకశక్తి డిసెంబర్ 16-17 తేదీల్లో కడపలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ 14 వ వార్షికోత్సవంలో ఆహ్వాన సంఘ అధ్యక్షురాలిగా కడప రామసుబ్బమ్మగారు చేసిన ఉపన్యాసం. గ్రంథ రచయిత ఆమె ఉపన్యాసంతో పాటు అధ్యక్షోపన్యాసం చేసిన సుప్రసిద్ధ సంఘసేవకురాలు శ్రీమతి బేగం అమీరుద్దీన్ గారి అభిప్రాయాల్ని కూడా సమీక్షిస్తూ ఈ వ్యాసం రాశారు. డా. షేఖ్ మహబూబ్ బాషా గారిలా అంటారు- **"....కడప రామసుబ్బమ్మ ఇచ్చిన ప్రసంగాన్ని విశ్లేషించి ఆమె జెండర్ చైతన్యాన్ని స్థూలంగా మదింపు చేయడం ఈ వ్యాసం ఉద్దేశం"** (పేజి: 16)

వ్యాసకర్త కడప రామసుబ్బమ్మ గారి ఉపన్యాసంలోని ముఖ్యాంశాల్ని ఈ విధంగా క్రోడీకరించారు.

1. భారతదేశం అభివృద్ధి సాధించాలంటే ఈ దేశంలోని స్త్రీలకు నిర్బంధ ఉచిత విద్యాసౌకర్యాల్ని కలిగించాలి.

2. బ్రిటిష్ ప్రభుత్వం మహిళల సర్వతోముఖ ప్రగతికి ఉదారంగా పెద్ద మొత్తంలో నిధుల్ని కేటాయించాలి.

3. పురుషులు సాధించగలిగిన కార్యాలన్నింటిని స్త్రీలు కూడా చేసి చూపించగలరు.

4. ప్రభుత్వం స్త్రీలకు పురుషులతో పాటు సమానమైన హక్కుల్నీ, హోదాల్నీ, స్వాతంత్ర్యాన్ని ఇవ్వాలి.

డా. షేఖ్ మహబూబ్ బాషా భారత మహిళా వికాసానికి ప్రభుత్వం ఉదారంగా పెద్ద మొత్తాల్లో నిధులు కేటాయించాలన్న సూచనను **"...అప్పటికీ, ఇప్పటికీ కడప నల్లరాయి లాంటి గొప్ప ఆలోచన"** (పేజి:31) గా పేర్కొన్నారు.

డా. బాషా కడప రామసుబ్బమ్మగారి **"ఇప్పటికైన స్త్రీల శక్తి సామర్థ్యములను పురుషులు గ్రహించి, స్త్రీ పురుషుల సమానత్వమును ఒప్పుకొని, తమ చర్యలను సవరించుకొని, స్త్రీ పురుషుల మధ్య సంఘర్షణకు అవకాశము కలిగించారని నమ్మెద"** (పేజి:33) అనే వినమ్రతను ప్రకటించిన మాటల్ని ఉటంకించారు. కాని మరుసటి సంవత్సరమే -1940 జనవరిలో ఏలూరులో జరిగిన ఆంధ్ర సేనికల సభలో **'పురుషులు స్త్రీలను సర్వ ప్రయోజనములకై సర్వ విధములా అన్ని శాఖల యందూ ఉపయోగించుకొంటున్నారు. కానీ స్త్రీలకు ప్రాతినిధ్యము ఇచ్చే విషయంలోనూ, వారికి సమానమైన హక్కులు ఇచ్చే విషయం లోనూ స్వార్థపరులుగా ప్రవర్తించారు."** (పేజి:34)

అని మగవాళ్ల స్వార్థపరత్వాన్ని తీవ్రంగా ఖండించిన మాటల్ని ఉదహరించారు. డా. మహబూబ్ బాషా కడప రామసుబ్బమ్మ వ్యక్తం చేసిన మహిళా ధోరణుల్ని కొన్నింటిని బలపరుస్తూ, ఒకటి, రెండు సందర్భాల్లో తమ అసమ్మతి తెలియచేశారు. ఆమె చాలామంది తెలుగు మహిళలు ప్రతిపాదించి, సమర్థించిన విడాకుల చట్టాన్ని బలంగా వ్యతిరేకించారు.

**"వీటి నెదుర్కొనుటకై కళంక పూరితమగు దాంపత్య శాంతి భంగమునకు తోడ్పడు విడాకుల చట్టము వంటి దారుణాస్త్ర ప్రయోగము కేవలము కొరివితో తల గోకి కొనిన చందమగును."** (పేజి: 39) రామసుబ్బమ్మగారి ఈ విపరీత మనఃస్థితిని డా. బాషా **"...అది ఆమె లోని డోలాయమాన స్త్రీవాదానికి ప్రబల తార్కాణంగా నిలుస్తుంది."** (పేజి: 40) అని పేర్కొన్నారు.

కడపలో జరిగిన ఈ ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభలో అధ్యక్షోపన్యాసం కానించిన బేగం అమీరుద్దీన్ గారి ప్రగతి పరమైన అభిప్రాయాల్ని డా. బాషాగారు సమీక్షించడం సబబే. ఆమె ప్రతిపాదించిన బహుభార్యాత్వ వివాహ నిషేధాన్ని, వరకట్న నిరసనను, స్త్రీ విద్యకు సకల సౌకర్యాల్ని ప్రభుత్వం కలిగించాలన్న అభిప్రాయాన్ని, వితంతు స్త్రీల స్వావలంబనకై తగిన వృత్తులు కల్పించాలన్న సంగతిని, ముస్లిం పురుషుల వివాహ విచ్ఛేదన (తలాక్) హక్కును నియంత్రిచడం, హిందూ ముస్లిం ఐక్యతను బలపరచడం మొదలైన విషయాల్ని డా.మహబూబ్ బాషాగారు చక్కగా ప్రస్తావించారు.

1939 డిసెంబర్ 16-17 తేదీల్లో కడపలో జరిగిన పదునాలుగో 'ఆంధ్రరాష్ట్ర మహిళా మహాసభ' లో మొదటి దినం వెయ్యిమంది, రెండోదినం రెండు వేలమంది స్త్రీలు పాల్గొన్నారని పత్రికలు చెప్పాయి. హిందూ స్త్రీలతో పాటు మహమ్మదీయ, క్రైస్తవ మహిళలు కూడా పాల్గొనటం విశేషమే, ప్రశంసనీయమే. ఈ సమావేశం **"....దత్తమండల మహిళా చరిత్రలో ప్రారంభమగు నిర్మాణ కార్య దీక్షాబద్ధమైన ఒక నూతన శకారంభ సృష్టికి"** (పేజి: 52) దారి తీయగలదని భావించడమూ సమంజసమే, సముచితమే.

కడప రామసుబ్బమ్మ గారి మహిళా చైతన్యాన్ని 'స్థూలంగా మదింపు' (పేజి:43) చేసిన డా. షేఖ్ మహబూబ్ బాషాగారి అభిప్రాయాల్ని పరిశీలిద్దాం. రామసుబ్బమ్మ గారిలో పురుషుల ఆధిపత్య ధోరణిని ఎదిరించి, పోరాడే సత్తా లేదు. పైగా కుటుంబ సంస్కృతి సంరక్షించుకొంటూ తీరిక వేళల్లో మహిళాభ్యుదయం గురించి మాట్లాడే సామాన్య స్త్రీయే తప్ప, యుద్ధ ప్రాతిపదికతో పోరాడే స్త్రీ సాహసం ఆమెలో తక్కువని చెప్పొచ్చు. ఇక, స్త్రీల అణచివేతలో మత ధర్మశాస్త్రాల పాత్ర గురించి రామసుబ్బమ్మ గారు ఏమీ చెప్పక పోవడానికి ఆమెకు వాటి పరిచయం లేక పోవడమే కారణం ఇక ఆమె స్త్రీవాదం వైరుధ్యాలతో, సంశయాలతో నిండి వుండటానికి కారణం ఆమె పరిమిత జ్ఞానం, చింతనారాహిత్యమే.

డా. షేఖ్ మహబూబ్ బాషా గారు రాయలసీమల్లో పుట్టి, పెరిగిన మహిళా సంఘాల కార్యకలాపాల్ని ప్రస్తావించారే కాని వాటి గురించి వార్తలు ప్రచురించిన కొస్తా, మద్రాసు పత్రికల్నే ప్రస్తావించారు. అయితే ఆయన శ్రీసాధన పత్రిక (అనంతపురం) రేనాడు (కడప) కామోదకి (నంద్యాల) ఇత్యాది రాయలసీమ పత్రికల్ని పరిశీలించి వుంటే ఉభయతారకంగా వుండేది. డా. బాషాగారి విషయసేకరణ సమృద్ధం. అనుశీలన సునిశితం. దృక్పథం స్పష్టం. వలస ప్రభుత్వ పాలనా కాలంలో రాయసీలయ మహిళల స్థితిగతుల్ని, భవిష్యత్ దర్శనా ధోరణుల్ని వెల్లడించే అమూల్యమైన పరిశోధనా గ్రంథమిది.

(వలస రాయలసీమలో మహిళా చైతన్యం, రచయిత : డా. షేఖ్ మహబూబ్ బాషా, పేజీలు: 88, వెల : రూ 100 ప్రాప్తిస్థానం : వీక్షణం మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నంబర్ -3, హిమాయత్ నగర్, హైదరాబాద్ -500029. ఫోన్. 7330795849, ప్రముఖ పుస్తక కేంద్రాలు.)



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక   సంపుటి -25 : సంచిక - 8   58   హైదరాబాద్   జూన్ : 2022

# వ్యాస భారతి ముక్తేవి భారతి

**ఆచార్య వెలుదండ నిత్యానంద రావు** ఫోన్ : 9441666881



అధ్యాపనం, రచనా వ్యాసంగం, వక్తృత్వాలతో జీవితాన్ని సార్థకం చేసుకున్న నిత్య సాహిత్యార్చనశీలి డాక్టర్ ముక్తేవి భారతి గారు. నవల, కథ, వ్యాసం, పత్రికాకాలం లాంటి భిన్న భిన్న ప్రక్రియల్లో సాహిత్య సృజనం చేసి తనదైన ముద్రను ప్రకటించుకున్న విదుషీమణి. వర్తమానకాలానికి అనుగుణమైన సులభ సుందర శైలిలో భారతాది కావ్య ప్రబంధాలలోని అంశాలను అందించి నూతనతరంలో సాహిత్యస్పృహను ఉద్దీపింప చేయడానికి యత్నిస్తున్న బాధ్యతాయుత మైన అధ్యాపకురాలు. సంస్కారం, ఉదాత్తత, దేశీయత, పరోపకారం, సహనశీలం, సౌజన్యంలాంటి సద్భావాలను యువతరంలో ప్రచోదనం జరిగేలా ఒక లక్ష్యాత్మకంగా కృషిచేస్తున్న రచయిత్రి .

ముక్తేవి భారతిగారు చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి సాహిత్య వరివస్యను విశ్లేషిస్తూ ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారి పర్యవేక్షణలో పిహెచ్.డి చేశారు. జీవితంలో డాక్టరేట్ అనేది ఒకేసారి చేస్తాం. ఐదారేళ్ళకు మించిన కాలం, ధనం, శక్తిసామర్థ్యాలు పీహెచ్.డి గ్రంథ రచన పట్ల చేసినంతగా ఇతర రచనల మీద సాధారణంగా వ్యయించం. అందువల్ల మన డాక్టరేటు ప్రభావం మన మీద ప్రభావం చూపడం సామాన్యాంశం. నాటకాలు, ప్రహసనాలు, నవలలు చిలకమర్తివారు రాసిన మహాపురుషుల చరిత్రలు శ్రద్ధతో వ్రాసిన పక్షంలో యువజనులకు ఆదర్శంగా ఉంటాయని ప్రబోధించి, లక్ష్యప్రాయంగా ముప్పైఏడుమంది జీవిత పరిచయాత్మక వ్యాసాలు రాశారు. చిలకమర్తి సాహిత్యాన్ని లోతుగా కంఠదఘ్నంగా అధ్యయనం చేసిన రోజుల్లో ఏర్పడిన ఆదర్శాల ప్రతిఫలన రూపమే ఈనాటి ముక్తేవి భారతిగారి సవిస్తృత సాహిత్య వ్యాసంగం అనడంలో అసహజమేమీ లేదు. ఆధునిక తెలుగు సాహిత్య సామాజిక పురోగమనానికి ఆధారశిలలుగా నిలిచి చిరస్మరణీయులైనవారి సమగ్రమూర్తిమత్వాన్ని ఆవిష్కరిస్తూ **"తెలుగు సాహిత్య చైతన్య మూర్తులు", "సాంఘిక సేవారంగంలో స్త్రీలు"** అనే రెండు సంపుటాలను ముక్తేవి భారతి గారు వెలువరించారు. స్పష్టత, వినూత్నత, విషయ ప్రామాణ్యం భారతిగారి వ్యాసాల లక్షణం. ఈ రెండు సంపుటాల్లోని వ్యాసాలు సామాన్య విద్యార్థులకు ఒక అవగాహన కల్పిస్తాయి. విషయంతో పరిచయం ఉన్న వ్యక్తులకు వారికి తెలిసిన విషయాలతో పాటు మరికొన్ని కొత్తవి కనిపించి ఆనందాన్నీ, సంతృప్తినీ కలిగిస్తాయి. పరీక్షార్థులకు కావలసిన నైపుణ్యాన్ని అందిస్తాయి. సభల్లో ఎక్కువగా పాల్గొనే వక్తలకు శ్రమపడకుండా సమాచారమందించి సభారంజకానికి దోహదం చేస్తాయి. భారతిగారి ఈ రెండు వ్యాససంపుటాలు సామాన్యులకు, మాన్యులకు ఎంతో ఉపయోగకరమైనవని భావించి తెలుగు అకాడమీ ప్రచురించి అందుబాటులోకి తెచ్చింది.

చిన్నయసూరి, పానుగంటి, గిడుగు, గురజాడ, రాయప్రోలు, సురవరం ప్రతాపరెడ్డి, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, త్రిపురనేని గోపీచంద్, దాశరథి లాంటి 40మంది మహనీయుల జీవితంలోని, సాహిత్యంలోని విశేషాంశాలను **"తెలుగు సాహిత్య చైతన్య మూర్తులు"** లో పొందుపరిచారు. కనపర్తి వరలక్ష్మమ్మ, యల్లాప్రగడ సీతాకుమారి, ఇల్లిందల సరస్వతీదేవి, సరోజినీ నాయుడు, కందుకూరి రాజ్యలక్ష్మి, డొక్కా సీతమ్మ, జే ఈశ్వరీబాయ్, హేమలతా లవణం లాంటి 26 మహిళామణుల సాంఘిక సేవా విశేషాలను, వారి జీవిత వివరాలను **"సాంఘిక సేవారంగంలో స్త్రీలు"** సంపుటంలో అందించారు.

విశ్వనాథ సత్యనారాయణ ప్రాశస్త్యాన్ని, విస్తార సాహిత్య వ్యాసంగాన్ని పరిచయం చేస్తూనే సాధారణంగా పాఠకుల దృష్టి సోకని వారి నాటకాలను, చిన్నకథల గొప్పతనాన్ని చెప్పడంలో భారతిగారి నైపుణ్యం గోచరిస్తుంది. రామాయణ కల్పవృక్షం, వేయి పడగలు, ఏకవీరల విశ్లేషణలోకి పోతే అదో సముద్రమై, వ్యాసమంతా అదే ఆక్రమిస్తుంది. అవి అంతగా ప్రసిద్ధమైనవి. కానీ భారతిగారు అటువైపు వెళ్ళకుండా తన విలక్షణతను ప్రదర్శించారు. విశ్వనాథ సంప్రదాయవాదుల్లో నవ్య సంప్రదాయవాది. ఆధునికులలో

అత్యాధునికుడు. విశ్వనాథ చిన్నకథల్లో శైలీ, వస్తువైవిధ్యాలు ఉండడం, చిన్న చిన్న వాక్యాలతో అత్యాధునిక సిద్ధాంతాల ప్రస్తావన చేయడాన్ని వివరించి వారి కథలు సార్వజనీనత, సార్వకాలీనతలకు ప్రతిరూపాలుగా నిలుస్తాయని భారతిగారు వ్యాఖ్యానించడం సముచితంగా ఉంది. వితంతు వివాహం జరిపించడం, ఒక గుడ్డిపిల్లను ధనవంతుడు పెళ్లాడడం, ఒకవేశ్య ప్రేమించి పెళ్లి చేసుకోవడం, ఒక వేశ్య ఒక పాశ్చాత్యునితో సహజీవనంచేసి, కొడుకును కని చనిపోతే ఆ పాశ్చాత్యుడు తప్పించుకోకుండా పెంచి పెద్దచేయడం – లాంటి అపూర్వ ఇతివృత్తాలు విశ్వనాథ కథల్లో కనిపించడం గమనార్హం. ఆధునిక సిద్ధాంతాల పట్ల ఆయనకున్న అవగాహన, నిశిత పరిశీలనలకు ప్రతీకలుగా "మాక్లీ దుర్గంలో కుక్క" "ముగ్గురు బిచ్చగాళ్ళు" కథలు నిలుస్తాయి. మేము తిండి కోసం బిచ్చమెత్తుతాం. మీరు ఓట్ల కోసం బిచ్చమెత్తుతారు. రెంటికీ భేదం ఉందా అని ఆలోచించడంటాడు బిచ్చగాడు. నా చిన్నతనంలో ఇంతమంది పోలీసులు ఉంటే ఎంతమంది దొంగలు ఉన్నారో అనిపించేది. పెద్దయిన తర్వాత తెలిసింది లోకమంతా దొంగతనమేనని. రాజ్యం చేసేవాడంటే మొదట బిచ్చగాడు. తర్వాత దొంగ అని వ్యవస్థలోని మౌలిక దోషాల మీదకు దృష్టి పోనిచ్చి పాఠకులను ఆలోచన పాలు చేస్తారు విశ్వనాథ.

**"నాకు ఉరిశిక్ష వేస్తూ నన్ను చెప్పుకునేది చెప్పుకోమన్నారు. శిక్ష వేయకముందు చెప్పుకొన్నా అర్థం ఉండేది. బియ్యం కోసం క్యూలో నిలిస్తే, ఎవరో రాయి విసిరితే మరెవరో మరణించారు. కళ్ళు లేని దేవుడు ఆ రాయి నేనే విసిరానన్నాడు. నాకు ఈ ఉరిశిక్ష వేయడంతో నాకు ఆకలి తీరింది. మా ఆవిడకు, మా పిల్లలకు కూడా ఇలాంటి యోగమే పడితే వారి ఆకలి కూడా తీరుతుంది. బాబ్బాబు ఈ ఉపకారం చేస్తే నీ కడుపున చచ్చిపుడుతా"** నంటాడు 'ఉరి' అనే కథలోని నాయకుడు. ఆశ్చర్యకరమైన ముగింపు విశ్వనాథ కథల ప్రత్యేకత. విశ్వనాథ చిన్న కథలను పెద్ద మనసుతో చూస్తే మహాకావ్యాలు, రసవత్కావ్యాలు అని వ్యాఖ్యానిస్తారు భారతిగారు. (పుట. 24)

మునిమాణిక్యం నరసింహారావు జీవిత సాహిత్య విశేషాలను పేర్కొంటూ "రుక్కుతల్లి" కథను భారతి గారు చక్కగా విశ్లేషించారు. మునిమాణిక్యం గారి పెద్ద కూతురు రుక్మిణి పెళ్లయి, చిన్నతనంలోనే మరణిస్తుంది. నలుగురూ చేరి పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నట్లుగా కథ నడపడం దీనిలోని విశేషం. కథలో రుక్మిణి (రుక్కుతల్లి) అనేది ఒక పాత్ర. ఆమె తల్లి చనిపోతూ కూతురు (రక్కుతల్లి)కి చెప్పిన విషయాలు లోకసత్యాలు, అనుభవైకవేద్యాలు. "రుక్కు తల్లీ! నా మాట విను. నీ తల్లి చెప్పే ఆఖరి సందేశం ఇది. బిడ్డలపైన ప్రేమ చూపగలది స్త్రీయే కానీ పురుషుడు కాదు. మగవారంతా ఇంత సంపాదించగలరు. అంతే. బిడ్డలను ప్రేమతో పెంచడానికి స్త్రీయే కావాలి. స్త్రీ చేసిన త్యాగం పురుషుడు ఎప్పుడూ చేయలేడు. ఓర్పు, సహనం పురుషుడికి తలకిందులుగా తపస్సు చేసినా రాదు. స్త్రీ ప్రేమ స్వరూపిణి" (పుట. 144) అని వాస్తవిక కోణంలో కరుణరసాత్మకంగా చెబుతుందని భారతి గారు ఉల్లేఖించి చూపారు.

చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు 1909లో దళితుల కోసం ఒక పాఠశాలను నెలకొల్పారు. జీతాలు పిల్లలు కట్ట అక్కర్లేదు. పలకలు, పుస్తకాల పూచీ చిలకమర్తివారిదే. పగలు పని చేసుకుని రాత్రిపూట చదువుకోవడానికి వీలుగా రాత్రి పాఠశాలలు నడిపారు. అక్కడ అలా చదువుకున్న వెంకన్న అనే దళితుడు స్కూల్ ఫైనల్ చదివి చిలకమర్తి సహకారంతో పిఠాపురం కళాశాలలో బి.ఎ., పూర్తి చేసి డిప్యూటీ తహసీల్దార్ అయ్యాడు. ఆయన తన కొడుకుకు "లక్ష్మీ నరసింహం" అని పేరు పెట్టుకున్నాడు. అట్లాగే మరో దళిత విద్యార్థి మార్కండేయుడు చదువుకొని పెద్దగయి తన కొడుకుకు "లక్ష్మీ నరసింహం" అని పేరు పెట్టుకున్నాడు (పుట. 38) అని ముక్తేవి భారతిగారు రాశారు. తమ నాయకత్వాలను నిలబెట్టుకోవడానికీ, స్వార్థప్రయోజనాలను నెరవేర్చుకోవడానికీ నిరంతరం ద్వేష భావాలను విరజిమ్ముతూ వాతావరణాన్ని మరింత కలుషితం చేస్తున్న పెద్దలు ఇలాంటి వాటిని గుర్తించాలి. ఇలాంటి సానుకూలమైన, ఉత్తేజపూరితమైన అంశాలను వెలుగులోకి తెచ్చి పెద్ద ఎత్తున ప్రచారం చేసినపుడే సామరస్య సౌమనస్యాలు వెల్లివిరుస్తాయి.

**"ముక్తసరిగా సూత్రప్రాయమైన మాట తీరు, న్యాయం కోసం ఎంతటివారినైనా ఎదిరించగల దిట్టతనం, తమ భావాలను ఎదుటి వారికి సౌమ్యంగా, కచ్చితంగా చెప్పే కరుకుతనం, తెలియని ఏ చిన్న విషయమైనా, ఏ చిన్నవాడు తెలిపినా స్వీకరించే సరసత, పాండిత్య ప్రకర్ష కోసం కాక పదిమందికి తెలియజేయడానికి చేపట్టిన రచనాదీక్ష... ఈ ధర్మాలన్నీ సమపాళ్ళుగా పోత పోసిన వ్యక్తిత్వం తాపీ ధర్మారావుగారిది".** (పుట. 68) అంటూ తాపీధర్మారావు సాహిత్యాన్ని పరిచయం చేసి సూత్రప్రాయంగా ఒకే మాటలో భారతి గారు వారి గొప్పతనాన్ని, వ్యక్తిత్వ గరిమను చెప్పడం చాలా బాగుంది.

అన్నదానం చేసి అమితఖ్యాతి సంపాదించుకున్న మహనీయురాలు డొక్కా సీతమ్మగారు. డొక్కా సీతమ్మను బ్రిటిష్ చక్రవర్తి తన పట్టాభిషేకం నాడు లండన్ ఆహ్వానించాడట. ఆమె అందుకు నిరాకరించింది. దాంతో ఆమెను ప్రార్థించి ఆమె ఫోటోను తీసుకెళ్ళి, పట్టాభిషేకం రోజున పక్కన పెట్టుకొని నమస్కరించాడట (పుట. 93). మరి ఈనాడు 5 రూపాయల భోజనపథకం, అమ్మపథకం, అన్నపూర్ణ పథకం, అక్షయపాత్ర పథకాలు మొదలైనవెన్నో భోజన పంపిణీ కార్యక్రమాలను వివిధ ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్నాయి. వీటన్నింటికీ ఆ మహాసాధ్వి డొక్కా సీతమ్మ గారే మూలం అంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి ఉత్తేజకరమైన సంఘటనలను భవిష్యత్ తరానికి అందించాల్సిన కర్తవ్యం మనమీద ఉంది.

ఆ రోజుల్లో కమ్యూనిస్టు నేతలు, స్త్రీ పురుషులు చూపిన నిబద్ధత, నిరాడంబరత ఎంత ప్రశంసదాయకంగా, స్ఫూర్తిదాయకంగా ఉ ందో గమనిస్తే నేడు ఆశ్చర్యం కలగకమానదు. ఆరంటే ఆరు చీరలు మించి స్త్రీలకు ఉండాల్సిన అవసరం లేదన్నారట. దాంతో మానికొండ సూర్యావతి అనే కమ్యూనిస్టు నాయకురాలు తన పెళ్ళినాటి పట్టు చీరలు తీసేశారట. వితంతువులు తిరిగి వివాహం చేసుకోవచ్చుననీ, అవసరమైతే విడాకులు తీసుకోవచ్చుననీ, సభలు సమావేశాలకు భర్తతో కలిసి రావాలనీ, స్త్రీలకు ఆస్తిహక్కు, విద్యాహక్కు ఉండాలనీ మానికొండ సూర్యావతి గారు సభల్లో ప్రబోధిస్తూ ఉంటే జనం వింతగా చూసేవారట. ఆమె ఒక వితంతు వివాహం చేయడానికి పూనుకొంటే, చూడడానికి 1200 మంది వచ్చారట. సనాతన ఛాందసుల తరపున రౌడీలు దాడి చేస్తే అంతా పరారయ్యారట. కమ్యూనిస్టులు భార్యలను తిట్టరు, కొట్టరు, గౌరవంగా చూస్తారు. తాగినా, సెక్స్ తప్పులు చేసినా పార్టీలో తీసివేస్తారు అని ప్రజలలో బాగా వినికిడి అవడం వలన కాంగ్రెస్ కుటుంబాల వారు కూడా కమ్యూనిస్టులకు తమ పిల్లలను ఇచ్చి పెళ్లిళ్లు చేయాలని ఉ వ్విళ్ళు ఊరే వారట – (పుట.47) అంటూ ప్రజల్లో నైతిక నిబద్ధత, క్రమశిక్షణ ఆవశ్యకతను ముక్తేవి భారతిగారు సోదాహరణంగా ప్రబోధిస్తారు.

నాళం కృష్ణారావుగారి కూతురు ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ ధైర్యసాహసాలు మూర్తీభవించిన వ్యక్తి, విదుషీమణి. సాంఘిక దురాచారాల నెదరించిన వారు. వారు ఎనిమిదినెలల గర్భవతిగా ఉన్న సమయంలో ఒక జాతరలో జీవహింస జరుగుతుందని తెలిసి ఆపడానికి వెళ్లారట. దున్నపోతును బలి ఇస్తుంటే, దాన్ని పక్కకు తోసి, ఆ స్థానంలో ఆమె తన తలనుపెట్టి నరకమన్నదట (పుట.14). ఇలాంటి సాహసోపేత సంఘటనలు ఎన్నో ఆ కాలం వారిలో ఉ న్నాయి. వాటన్నింటినీ పనిగట్టుకొని మనం నమోదు చేయవలసిన చారిత్రక సన్నివేశంలో ఉన్నాము.

మాగంటి అన్నపూర్ణగారు (1900-1927) కలకత్తాలో విద్యాభ్యాసం చేసినవారు. ఆమె భర్త మాగంటి బాపినీడుగారు సైన్యంలో ఉన్నతాధికారి. ఆయన ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్తున్నాడు. భర్తను అనుసరించాలి భార్య. కానీ గాంధీజీ అనుయాయురాలై స్వాతంత్ర్యోద్యమంలో చేరింది. ఇలాంటి సమయంలో అమెరికా వెళ్ళడం అన్యాయమనుకొంది. నగలను గాంధీజీకి దానం చేసింది. ఖద్దరు దాల్చింది. అమెరికా ప్రయాణం కోసం దాచిన డబ్బుతో పరిశ్రమలను నెలకొల్పింది. భర్త అమెరికా వెళ్ళివచ్చి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. కూతురికి ఝాన్సీలక్ష్మి అని పేరు పెట్టుకొన్నారు. మాగంటి అన్నపూర్ణగారు 27 ఏళ్ళ చిన్న వయసులో అనారోగ్యం పాలయి చనిపోతే గాంధీజీ కన్నకూతురిని పోగొట్టుకొన్నానని వ్యాఖ్యానించాడట. (పుట.86)

యల్లాప్రగడ సీతాకుమారి విచక్షణ లేకుండా నిరంతరం సహాయం అందించే వారు. మహమ్మదీయ వనితలు పెరటి తలుపు కొట్టి తమను రక్షించమని అరిస్తే, వారిని లోపల దాచిపెట్టి వారిని వెతుకుతూ వచ్చి వీధివాకిలిలో నిలుచున్నవారిని మంచి మాటలతో పంపించే వారట. ఎన్నో విధవా వివాహాలకు తన మంగళసూత్రాలు దానం చేసి మళ్లీ చేయించుకునేదట. చివరకు మంగళ సూత్రాలు ఇస్తూ మాటిమాటికి కొత్తవి చేయించుకుంటూ ఉండటం కన్నా ఇంకా నాకీ మంగళసూత్రాలు ఎందుకు అని ఊరుకుందట. ఒక సుఖవ్యాధి గ్రస్తురాలిని అందరూ వద్దని వారిస్తున్నా ఆదరించి వైద్యం చేయించింది. “నా పిల్లలకే వస్తే నేను ఇలాగే వదిలేస్తానా” అని ఎదురు ప్రశ్నించిందట. ఒక పెళ్లి కాని అమ్మాయి గర్భవతయి పిల్లను కని వారి ఇంటి దగ్గర వదిలేసి వెళ్ళి పోయిందట. ఆ పిల్ల ఏడుపు విని బయటకు వచ్చి సీతాకుమారి గారు ఆ పిల్ల నా పిల్లేనని పెంచి పెద్ద చేసి పెళ్లి చేసిందట. (పుట.27)

సాహిత్య, సామాజికరంగాల్లో వెలుగొందిన మహనీయుల జీవితాల్లోని స్ఫూర్తిదాయక ఘట్టాలను, ఆదర్శాలను, సంస్కారాలను నిశిత వ్యాఖ్యానంతో యువతరంలో చైతన్యస్ఫూర్తి కలిగేలా అందించిన ముక్తేవి భారతి గారికి అభివాదాలు తెలుపుతూ ముగిస్తున్నాను.




## శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం ‘శిలాక్షరం’.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177




**పొన్నలు - పొగడలు (వచన, పద్య కవితలు)**
డా. తుమ్మలపల్లి వాణీకుమారి
వెల : 100 /-
**ప్రతులకు :** డా. టి. వాణీకుమారి, ఫ్లాట్ నెం. 003, సొనాటా అపార్ట్‌మెంట్స్, విద్యానగర్, హైదరాబాద్ - 500 044.
ఫోన్ : 77807 16753






**విశ్వనాథ జయంతి**
ఆచార్య జె.వి. రాఘవేందర్ రావు ప్రత్యేక సంచిక
- ముఖ్య సంపా : వెల్చాల కొండలరావు
వెల : 150 /-
**ప్రతులకు :** సిస్టర్ నివేదిత పబ్లికేషన్స్, 11-4-654/2, రెడ్ హిల్స్, లక్డీకాపూల్, హైదరాబాద్ - 500 004.
ఫోన్ : 98481 95959




**ప్రస్థాన స్ఫూర్తి**
- శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి
వెల : 180/-
**ప్రతులకు :** స్ఫూర్తి కుటుంబం, ఇం.నెం. 7-1-28/10, ఫ్లాట్ నెం. 301, రామ టవర్స్, శ్యామ్ కరణ్ రోడ్, అమీర్‌పేట, హైదరాబాద్ - 500 016.
ఫోన్ : 8977613435, 8977513435.




**కాలచక్రం (మహాకవి కాళిదాసుపై నవల)**
- కన్నడం : నా.సు. భరతన హళ్ళి;
తెలుగు : వేలూరి కృష్ణమూర్తి
వెల : 150 /-
**ప్రతులకు :** పాలపిట్ట బుక్స్, 16-11-20/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట, హైదరాబాద్ - 500 036. ఫోన్ : 9848787284

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# నిరుద్యోగుల స్వప్నం



డిగ్రీలన్ని మూటగట్టుకొని,
పుస్తకాలన్ని చేతబట్టుకొని,
భాదలన్ని అనగదొక్కుకొని
బాద్యతలన్ని భుజానకెత్తుకొని,
నిరంతరం పరుగెత్తే
ఓ నిరుత్సాహ నిరుద్యోగి

సంబరాలన్ని బందువెట్టుకొని,
సత్తువనంత కూడగట్టుకొని ,
ఆశయాలన్ని ముందువెట్టుకొని,
అవకాశాలన్ని అందిపుచ్చుకొని,
పట్టువదలక ప్రయత్నిస్తే..
నువ్వేనోయి నిలువు కీర్తి.



భయాలన్ని చుట్టుముట్టనీ..
బందువులంతా వెక్కిరించనీ..
బలహీనతలే వెనక్కిలాగనీ..
ఈ ప్రపంచమే కృంగదీయనీ..
ఆత్మవిశ్వాసమే నీవెంటుంటే
అదే నీకు ఆయుధమోయి.




ఇది డూ ఆర్ డై కాలం కాదు,
డూ బిఫోర్ డై.
ఇది గెలుపోటముల ఆట కాదు,
గెలిచి రాయాల్సిన పాట.
ఇది రెప్పపాటున స్వప్నంకాదు,
యువత జీవిత ఆశయం.
చేయి దాటితే మళ్ళీరాదోయి
చరిత్రలో నిలిచే ఈ సమయం,
ఒక్కసారి గెలిచిచూడు
లక్షల నిరుద్యోగుల స్వప్నం.

**వెంకటేశ్ కే విశ్వ**
ఫోన్ : 955 376 2108

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2020-2022
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month




From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

**Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.**
**Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana**
**Editor : Dr.Sagi Kamalakara Sharma**